ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
18-8-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 199 పేజీలు: 12 వెల: 6.50

**ప్రజాప్రతినిధులపై 4,192 కేసులు**
**రాహుల్ గాంధీకి సుప్రీంలో ఊరట**
9లో



## దిగి వచ్చిన సోరెన్


**జార్ఖండ్‌లో ఉద్యోగార్థులు, విద్యార్థుల విజయం**
**జెపిఎస్‌సి- సిజిఎల్ పరీక్షలు రద్దు**



**రాంచి, ఆగస్టు 17:** ఉద్యోగార్థుల ఆందోళనల నేపథ్యంలో జార్ఖండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్-కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షలను రద్దు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సోమవారం ప్రకటించారు. రాంచీలో మూడు వారాలకు పైగా ఆందోళన చేస్తున్న ఉద్యోగార్థుల ప్రధాన డిమాండ్లలో ఈ పరీక్షల రద్దు కూడా ఉంది. నేడు కేబినెట్ జెఎస్ఎస్‌సి సిజిఎల్ పరీక్షలను కూడా రద్దు చేయాలని నిర్ణయించింది. అంతేకాకుండా 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన చిన్నా, పెద్దా అన్ని తప్పిదాలపై సమగ్ర విచారణ నిర్వహిస్తామని సోరెన్ తెలిపారు.గిదిశిలికు సంబంధించిన అన్ని కార్యకలాపాలు రద్దుఈ వ్యవహారంలో టిడిపిఎల్ సంస్థకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. టిడిపిఎల్ నిర్వహించిన పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపికైన అభ్యర్థులు, పరీక్షలకు హాజరైన అభ్యర్థులు, అలాగే సంస్థ చేపట్టిన ఇతర అన్ని కార్యకలాపాలను రద్దు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని టిడిపిఎల్‌కు సంబంధించిన ప్రతిచర్యనూ రద్దు చేయాలని నిర్ణయించాం"అని హేమంత్‌సోరెన్ వెల్లడించారు. జెపిఎస్‌సి, జెపిఎస్‌సి సంస్కరణా మంచ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలు సోమవారం 24వరోజుకు చేరుకున్నాయి. తమ డిమాండ్లను ఈనెల18 లోగా పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నిరసనకారులు ఇప్పటికే హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈనెల 20నముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని కూడా ప్రకటించారు.

# ధైర్యముంటే అసెంబ్లీకి రండి



**వైసిపికి సిఎం చంద్రబాబు సవాల్**
**డిఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు**
**నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే**
**డిఎస్సీపై వైసిపి హిట్ అండ్ రన్ చర్యలు**
**ఒడిశా కూలీలు, 90యేళ్ల వృద్ధులు జెట్టీలతో జగన్ ఫేక్ ప్రదర్శనలు**
**శాసనసభలో మెగా డిఎస్సీ నియామకాలపై సిఎం చంద్రబాబు**

**విజయవాడ, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసిపి నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సిఎం ఆక్షేపించారు. డిఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం. ఐటీని ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సిఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజి, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019-24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారు. ఇప్పటి వరకూ 14 డిఎస్సీలు జరిగితే, టిడిపి, ఎన్డీయే హయాంలో 11డిఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. పాఠశాలలకు విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా రాష్ట్రంలో నాడు టిడిపినే ప్రవేశపెట్టింది. ఇంటర్ విద్య వరకూ ఈ పథకాన్ని విస్తరించాం. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీని పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేకంగా ఓ చట్టమే తీసుకువచ్చాం. గడచిన 30 యేళ్లుగా విద్యారంగంలో వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థలు సహా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. 2019-24 మధ్య 1012 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావటం మానేశారు. అందుకే తల్లికి వందనం పేరిట పిల్లలందరికీ ఆర్ధికసాయం అందించేలా మేం నిర్ణయం తీసుకుని అమలు చేశాం. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచటంతో 1 లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చారు" అని వివరించారు.

"గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డిఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం >>2



## బిజెపి జాతీయ ఉపాధ్యక్షులుగా పురందేశ్వరి, రామ్‌మాధవ్



**కొత్త కార్యవర్గంలో ఎపి నేతలకు చోటు**
**అన్ని విభాగాల సంయుక్త కార్యదర్శిగా విష్ణువర్ధన్ రెడ్డి**
**13 మంది ఉపాధ్యక్షులు, 8 మంది ప్రధానకార్యదర్శులు**
**జాబితా విడుదల చేసిన అధ్యక్షుడు నితిన్ నబీన్**


విష్ణువర్ధన్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సోమవారం పార్టీ కొత్త జాతీయ పదాధికారులను ప్రకటించారు. వసుంధర రాజే సింధియా, తీర్థ్ సింగ్ రావత్, రామ్‌మాధవ్, బైజయంత్ పాండా, దగ్గుబాటి పురందేశ్వరి, రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి, భారతి ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్య, ఎం.నాగరాజా, తారిఖ్ మన్సూర్, మధుచంద్రకర్‌లను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు.వినోద్ తావ్డే, స్మృతి ఇరానీలను జాతీయ ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. పీయూష్ గోయల్‌కు జాతీయ కోశాధికారి బాధ్యతలు అప్పగించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు)గా బీఎల్ సంతోష్‌ను కొనసాగించారు. మొత్తం ఎనిమిది మంది జాతీయ ప్రధాన కార్యదర్శులతో కూడిన కొత్త బృందంలో మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, మాజీ త్రిపుర ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ >>2

## ఎల్‌నినోతో వర్షాభావం

**సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు**
**ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన కల్పించాలి**
**తాగునీటికే తొలి ప్రాధాన్యం.. ఆతర్వాతే సాగుకు..**
**శాసనసభలో ఎల్ నినోపై స్వల్పకాలిక చర్చలో సిఎం చంద్రబాబు**
3లో

# యేటా డిఎస్సీ

**ఉపాధ్యాయ నియామకాలు చేపడతాం**
**అసెంబ్లీలో మంత్రి నారా లోకేష్ ప్రకటన**
**మెగా డిఎస్సీ 2025పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్**



## సభకు వస్తే, డిఎస్సీపై చర్చకు సిద్ధమని జగన్‌కు సవాల్

**విజయవాడ, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీ జరుగకుండా చేయాలని ప్రత్యర్థి రాజకీయ పార్టీల నేతలు కుట్రలపై కుట్రలు చేశారని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆరోపించారు. డిఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత వైఎస్సార్సీపీ నాయకులు కావాలని 141 కేసులు పెట్టారని మంత్రి లోకేశ్ ధ్వజమెత్తారు. అయినా పారదర్శకంగా నిర్వహించడం వల్ల డిఎస్సీని పూర్తి చేశామని వెల్లడించారు. మెగా డిఎస్సీ 2025 నిర్వహణపై సోమవారం మంత్రి లోకేశ్ శాసనసభలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కూటమి సర్కార్ టీచర్లను సింగపూర్, ఫిన్లాండ్ దేశాలకు పంపిస్తే గత వైఎస్సార్సీపీ సర్కార్ వైన్ షాప్‌ల ముందు నిలబెట్టిందని మండిపడ్డారు.

అనంతరం మెగా డిఎస్సీ 2025 నియామక ప్రక్రియపై మంత్రి లోకేశ్ అసెంబ్లీలో మాట్లాడుతూ, ఈ ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించామని తెలిపారు. ఎన్నికలకు ముందే తాము ప్రతి యేటా డిఎస్సీ నియామకాలు చేపడతామని హామీ ఇచ్చామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. కేవలం 148 రోజుల్లోనే మొత్తం డీఎస్సీ నియామక ప్రక్రియను పూర్తి చేశామని ఆయన చెప్పారు.

విద్యాశాఖలో టీడీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేసిందని, ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలలో పారదర్శకత ఉండాలని ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించారని ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు తమ ప్రభుత్వం 1.80 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని ఆయన గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఉపాధ్యాయులను శిక్షణ కోసం సింగపూర్, ఫిన్లాండ్ దేశాలకు పంపితే, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం మాత్రం వారిని మద్యం దుకాణాల >>2



## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా కొణిదెల నాగబాబు

**కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**విజయవాడ, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం, అటవీ విస్తీర్ణం, పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఎపి గ్రీన్)' ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు)ని నామినేట్ చేస్తూ రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ సోమవారం జిఒ ఆర్‌టి నం.93 జారీ చేసింది. ఈ నియామకంతోపాటు, ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నాగేంద్రరావుకి క్యాబినెట్ హోదా కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

**2047 నాటికి 50శాతం గ్రీన్ కవర్ లక్ష్యం:** ఆంధ్రప్రదేశ్‌లో అటవీ పరిరక్షణ, పచ్చదనం పెంపు కలిపి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతానికి పెంచడం ఎపి గ్రీన్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ లక్ష్యాన్ని 2047 నాటికి సాధించే దిశగా ఎపి గ్రీన్ పనిచేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ఎపి గ్రీన్ గవర్నింగ్ బోర్డు, ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు జిల్లాస్థాయిలో పాలక మండళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. >>2

**పంచాయతీరాజ్ ఎఇ ఫ్యామిలీ**
## గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం

**మనవడిని కాపాడిన మత్స్యకారులు**
**నూకరాజు, భార్య మీనా, కూతురు సౌజన్య గల్లంతు**
**సూసైడ్ లెటర్ కలకలం..**
**సమగ్ర విచారణ జరపాలని డి.సిఎం పవన్ ఆదేశం**


నూకరాజు(ఫైల్)

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు17,ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లాలో సంచలనం సృష్టించిన పంచాయతీ రాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యాయత్నం ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిలోకి దూకిన నూకరాజు రాసినట్లు చెబుతున్న సూసైడ్ లెటర్ వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. లేఖలో పేర్కొన్న అంశాలు ప్రస్తుతం పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారాయి. రాజ మహేంద్రవరం సమీపంలోని గోదావరి నదిలోకి పంచాయతీరాజ్ >>2

## చర్చలు విఫలం

**మూడో దశకు జూడాల సమ్మె**
**అత్యవసర సేవలు నిలిపివేత**
**ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన సర్కార్**

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 17, ప్రభాత వార్త:** పీజీ వైద్యులకు సముచితమైన ఉపకార వేతనం పెంపుతోపాటు ఇతర న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మె సోమవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. మూడో దశ ఆందోళన తొలిరోజు కావడంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో జూనియర్ వైద్యులు అత్యవసర సేవల నుంచి కూడా వైదొలిగారు.ఇప్పటివరకు అత్యవసరం కాని వైద్య సేవలను మాత్రమే నిలిపివేసిన జూనియర్ వైద్యులు అత్యవసర వైద్య సేవలను యథావిధిగా అందించారు. అయితే ఆగస్టు11న ప్రభుత్వ అధికారులతో జరిగిన చర్చలు విఫలం కావడంతోపాటు, తదుపరి చర్చలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పిలుపు రాకపోవడంతో మూడో దశ ఆందోళనకు శ్రీకారం చుట్టారు.

**గుంటూరులో కొనసాగిన ఆందోళన:** గుంటూరు వైద్య కళాశాలలో అంతర్గత వైద్య శిక్షణార్థులు, పీజీ వైద్యులు, ప్రత్యేక వైద్య విభాగాల పీజీ వైద్యులు, సీనియర్ నివాస వైద్యులు సమ్మెలో పాల్గొన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల పర్యవేక్షకుల కార్యాలయం సమీపంలో ఆందోళన కొనసాగించారు. సమ్మెలో భాగంగా చేపట్టిన స్వచ్ఛంద రిలే నిరాహార దీక >>2





## గేట్‌వే ఆఫ్ ది ఈస్ట్

**ఇక విమానయానానికి సిద్ధం**
**అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం**
**ఉత్తరాంధ్ర అభివృద్ధి గమ్యానికి కొత్త రెక్కలు: డి.సిఎం పవన్ కల్యాణ్**

**విజయనగరం, ఆగస్టు 17 ప్రభాతవార్త:** జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. దీంతో ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లో కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధిలో నూతన శకం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ విమానయాన రంగంలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలిచింది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణాలకు రాష్ట్రాన్ని తూర్పు ముఖద్వారంగా మరింత బలోపేతం చేస్తోంది. విమానాశ్రయం వాణిజ్య కార్యకలాపాల ప్రారంభం పలు చారిత్రాత్మక తొలి విమాన సర్వీసులతో ఘనంగా జరిగింది. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసుల ద్వారా >>2

**వెలుగొండ ప్రాజెక్టు టన్నెల్-2లో విషాదం**
## హైడ్రాలిక్ వాహనం తగిలి కార్మికుడు మృతి


మోంటిలాల్(ఫైల్)

**పెద్దదోర్నాల, ఆగస్టు 17, ప్రభాతవార్త:** వెలిగొండ ప్రాజెక్టు టన్నల్ - 2 లో సోమవారం తెల్లవారుజామున విషాదకర ఘటన చోటు చేసుకుంది. టన్నల్లో చిక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్(టిబిఎం) జరుగుతున్న సమయంలో సోమవారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. టిబి ఎం పనుల్లో ఉపయోగిస్తున్న హైడ్రాలిక్ మిషన్ వాహనం అక్కడ పడు కొని ఉన్న కార్మికుని ఢీకొని తొక్కటముతో శరీరము లోపల తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ కు చెందిన కార్మికుడు మోంటిలాల్ (18) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తోటి కార్మికులు, ఇంజనీరింగ్ అధికారులు దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మోంటిలాల్ మృతి చెందాడు. ఈనెల 22న కృష్ణా జలాలను సొరంగాలద్వారా నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు చేరవేసేందుకు ట్రయల్ రన్ చేసినందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోగా మిగిలి ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన రేయింబవళ్లు పనులు వేగవంతముగా చేస్తున్న తరుణంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం కార్మిక వర్గాల్లో ఆందోళనకు కారణమైంది. మృతుని కుటుంబానికి తగిన పరి హారం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కార్మికులుకోరుతున్నారు. సమాచారం అందుకున్న ఎర్రగొండపాలెం సిఐ కే.అజయ్‌కుమార్, ఎస్సై ఎస్ వెంకటరమ ణయ్య ఆస్పత్రిలో మాంటిలాల్‌ను, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు.

18-8pg2exHMNWJQE_18-8pg2exHMNWJQE.qxd 18/Aug/26 12:15 AM Page 1



# బిజెపి జాతీయ ఉపాధ్యక్షులుగా పురందేశ్వరి, రామ్‌మాధవ్

>> దేబ్‌లకు చోటు కల్పించారు. బీఎల్ సంతోష్‌కు ముంబై కేంద్రంగా పనిచేసే సంయుక్త ప్రధాన కార్యదర్శి శివ్ ప్రకాశ్, చండీగఢ్ కేంద్రంగా పనిచేసే సౌదాన్ సింగ్ సహకారం అందించనున్నారు. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు రాజీనామా చేసిన సందీప్ పాఠక్‌ను బీజేపీ జాతీయ కార్యదర్శిగా నియమించడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్తగా సంబిత్ పాత్రాకు బాధ్యతలు అప్పగించారు. 2027 ఎన్నికలే లక్ష్యంగా పునర్వ్యవస్థీకరణ2027లో జరగనున్న కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సంస్థాగత మార్పులు చోటుచేసుకున్నాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్ సహా పలు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నాయకత్వం కొత్త బృందాన్ని ఏర్పాటు చేసింది. 2029 లోక్‌సభ ఎన్నికలకు దీర్ఘకాలికంగా పార్టీని సిద్ధం చేసే వ్యూహంలో భాగంగానూ ఈ మార్పులను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర స్థాయిలోనూ సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టింది. పంజాబ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న పార్టీ ఇటీవల మొత్తం 36 సంస్థాగత జిల్లాలకు ఇన్‌చార్జ్‌లను నియమించింది. కొత్తగా నియమితులైన జాతీయ పదాధికారులకు ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. సంస్థాగత అనుభవం, ఉత్సాహం, క్షేత్రస్థాయి అనుసంధానం కలిగిన కొత్త బృందం పార్టీని మరింత బలోపేతం చేస్తుందని, ప్రజాసేవపై దృష్టి సారిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అనుభవజ్ఞులతో పాటు యువతకు చోటుబీజేపీ కొత్త జాతీయ బృందంలో అనుభవజ్ఞులైన నేతలతో పాటు యువతకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. ప్రాంతీయ ప్రాతినిధ్యానికి పెద్దపీట వేశారు. 16 మంది జాతీయ కార్యదర్శుల బృందంలో కవితా పాటిదార్, కె. సురేంద్రన్, సందీప్ పాఠక్, మనోజ్ తిగ్గా తదితర కొత్త ముఖాలకు చోటు కల్పించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కీలక సంస్థాగత బాధ్యతలోకి తిరిగి రావడం విశేషం. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియాను జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగించారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం ద్వారా పార్టీ అగ్రస్థాయి సంస్థాగత పదవుల్లో మహిళలకు మరింత ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. కొత్త బృందంలో నలుగురు మహిళా కార్యదర్శులు, ఒక మహిళా ప్రధాన కార్యదర్శి ఉన్నారు. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నేతలకు కూడా కొత్త బృందంలో స్థానం కల్పించారు.

భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ కార్యవర్గంలో ఆల్ సెల్స్ జాయింట్ కోఆర్డినేటర్‌గా ఎస్. విష్ణువర్ధన్ రెడ్డికి బాధ్యతలు దక్కాయి. జాతీయ స్థాయిలో పార్టీ కీలక పదవికి ఎదిగిన ఆయన కృషి వెనుక దశాబ్దాల పాటు ఆయన సాగించిన నిరంతర , సంస్థాగత శ్రమ దాగి ఉంది. 1978 అక్టోబర్ 2న ఆర్ఎస్ఎస్ అనుబంధమున్న కుటుంబంలో జన్మించిన ఆయన, అఖిల భారత విద్యార్థి పరిషత్ ద్వారా అతి చిన్న వయసులోనే ప్రజాజీవితంలోకి అడుగుపెట్టారు. 1992లో కదిరి తాలూకా కార్యదర్శిగా ప్రారంభమై అనంత్ పూర్ జిల్లా కన్వీనర్, ఉమ్మడి ఏపీ కార్యదర్శిగా మరియు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా 1998 వరకు విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా కొణిదెల నాగబాబు

>> ఎపి గ్రీన్ లక్ష్యాలు, కార్యక్రమాల అమలులో వివిధ శాఖలు, జిల్లాస్థాయి సంస్థల మధ్య సమన్వయం సాధించడం, కార్యక్రమాల అమలును వేగవంతం చేయడం, వాటి పురోగతిని పర్యవేక్షి ంచడం వంటి కీలక బాధ్యతలను ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నాగబాబు నిర్వహించనున్నారు. ప్రత్యే కంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే పచ్చదనం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు జిల్లాస్థాయి వ్యవస్థలను అనుసంధానిస్తూ సమర్థవంతమైన అమలు వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ నియామకం కీలకంగా నిలవనుంది. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అడవులు, చెట్ల విస్తీర్ణాన్ని పెంచడం, పునర్వనీకరణ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టడం వంటి అంశాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదనడానికి ఎపి గ్రీన్ ఏర్పాటు, దాని ఎగ్జిక్యూటివ్ కమిటీకి చైర్‌పర్సన్ నియామకం నిదర్శనంగా నిలుస్తుంది. నాగబాబు నాయకత్వంలో ఎపి గ్రీన్ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతాయని, "పచ్చని ఆంధ్రప్రదేశ్ – ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్" లక్ష్య సాధనకు ఈ వ్యవస్థ దోహ దపడుతుందని కూటమి



సోమవారం ఖట్మాండులోని అధ్యక్షభవనంలో అధ్యక్షుడు రామచంద్ర పోడ్వాల్‌తో భారత్ ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ కరచాలనం దృశ్యం

# రచయిత్రిపై లైంగిక దాడికేసులో ట్రంప్‌నకు సుప్రీం షాక్

**వాషింగ్టన్, ఆగస్టు 17:** రచయిత్రి జీన్ కారోల్పై లైంగిక దాడికి పాల్పడి, అనంతరం ఆమెను పరువు నష్టం కలిగించేలా వ్యాఖ్యానించారంటూ న్యూయార్కులోని జ్యూరీ విధించిన 5 మిలియన్ డాలర్ల పరిహారం తీర్పును కొట్టివేయాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నానికి మరోసారి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జ్యూరీ ఇచ్చిన తీర్పుపై ట్రంప్ దాఖలు చేసిన అప్పీల్ను విచారించేందుకు నిరాకరించినసుప్రీంకోర్టు నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ఆయన తరఫు న్యాయవాదులు కోరారు. అయితే, ఈ పిటిషన్‌తోపాటు మరికొన్ని పిటిషన్లను కూడా సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇలాంటి పునఃపరిశీలన అభ్యర్థనలను సుప్రీంకోర్టు స్వీకరించడం చాలా అరుదు. అయితే గతంలో కొన్ని సందర్భాల్లో అలా చేసిన ఉదాహరణలు ఉన్నాయి. జూన్లో కారోల్ కేసులో తన అప్పీల్‌ను విచారించేందుకు కోర్టు నిరాకరించిన కొద్దికాలానికే ట్రంప్ ఆ తీర్పు కింద చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించారు. ఇదిలా ఉండగా, కారోల్‌కకు సంబంధించిన మరో కేసులో వచ్చిన 83 మిలియన్ డాలర్ల పరిహారం తీర్పును కూడా రద్దు చేయాలని ట్రంప్, అమెరికా న్యాయశాఖ సుప్రీంకోర్టును కోరుతున్నాయి. 2019లో ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కారోల్పై చేసిన వ్యాఖ్య లకు సంబంధించి తనపై దావా వేయలేరని, అధ్యక్షుడిగా తనకు రక్షణ ఉందని వారు వాదిస్తున్నారు. ఈ అప్పీలుపై సుప్రీంకోర్టు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కారోల్ చాలాకాలంగా సలహా కాలమిస్టుగాను, టివి టాక్‌షో మాజీ వ్యాఖ్యాతగా పనిచేసారు. 2023లో జరిగిన విచారణసందర్భంగా ఆమె సాక్ష్యమిస్తూ 1990లలో 'ట్రంప్‌తో జరిగిన స్నేహపూర్వకపరిచయం మన్‌హట్టన్‌లోని డిపార్టుమెంటల్‌స్టోర్ బెర్గ్ డార్ఫ్‌గుడ్‌మాన్ డ్రెస్సింగ్‌రూమ్‌లో హింసాత్మక దాడిగా మారిందని తెలిపారు. ట్రంప్ టవర్‌కు ఎదురుగా ఉన్న ఈ లగ్జరీ రిటైలర్‌లో ఈదుర్ఘటన జరిగిందని ఆమె వాంగ్మూలంలో పేర్కొన్నారు. 2022లోకారోల్ చేసిన ఆరోపణలను ట్రంప్ ఖండించడంతో, ఆమెను పరువునష్టం కలిగించేలా వ్యా ఖ్యానించినందుకు కూడా ట్రంప్‌బాధ్యుడేనని జ్యూరీ తేల్చింది. అయితే ట్రంప్ తనపై వచ్చిన ఆరో పణలను, తానుఎలాంటి తప్పు చేయలేదన్న వాదనను కొనసాగిస్తున్నారు. కారోల్ స్వయంగా బహిరం గంగా తనపై జరిగిన లైంగిక దాడి గురించి వెల్లడించినందున, మీడియా కూడా ఆమె పేరును వెల్లడించింది.

# యెమెన్ సమీపంలో సౌదీ నౌకలపై క్షిపణి దాడి: హౌతీల వెల్లడి

**సనా, ఆగస్టు 17:** యెమెన్‌కు చెందిన ఇరాన్ అనుకూల హౌతీ తిరుగుబాటు గ్రూపు సోమవారం ఎర్ర సముద్రంలో యెమెన్ మొఖా తీరానికి సమీపంలో సౌదీ సైనిక నౌకతో పాటు దానికి అనుబంధంగా ఉన్న నాలుగు నౌకలపై క్షిపణి దాడి చేసినట్లు ప్రకటించింది. హౌతీ సైనిక ప్రతినిధి యాహ్యా సరీ ఈ దాడిని ప్రకటించారు. సౌదీ అధికారులు మాత్రం ఈ ఘటనపై తక్షణం ఎలాంటి ధ్రువీకరణ ఇవ్వలేదు. మొఖా వ్యూహాత్మకంగా కీలకమైన ఎర్ర సముద్ర నౌకాశ్రయం. ఇది ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌తో అనుసంధానించే కీలకమైన బాబ్ ఎల్‌మండెబ్ జలసంధికి సమీపంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య నౌకల రాకపోకలకు ఈ జలమార్గం అత్యంత ప్రాధాన్యమైనది. ఎర్ర సముద్రంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో హౌతీల తాజా ప్రకటన వెలువడింది. సౌదీ అరేబియాతో తమ ఘర్షణలో భాగంగా హౌతీలు గతంలోనూ ఈ ప్రాంతంలోని నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు, హెచ్చరికలు జారీ చేశారు. గత మంగళవారం కూడా బాబ్ ఎల్‌మండెబ్ జలసంధి సమీపంలో ఓ నౌకపై హౌతీలు దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది మరణించినట్లు యెమెన్ రవాణా మంత్రిత్వ శాఖ తెలిపింది. యెమెన్‌పై సౌదీ అరేబియా విధించిన దిగ్బంధానికి ప్రతిస్పందనగా జూలైలో సౌదీ అరేబియాను లక్ష్యంగా చేసుకుని నౌకా దిగ్బంధాన్ని ప్రారంభిస్తున్నట్లు హౌతీలు ప్రకటించారు. సౌదీ అరేబియా ఈ ఆరోపణలను ఖండించింది. ఇదిలా ఉండగా, సోమవారం అంతకు ముందు యెమెన్‌లోని అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వానికి చెందిన ఇద్దరు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బాబ్ ఎల్‌మండెబ్ జలసంధిలో ఓ నౌకపై హౌతీలు ఆరు క్షిపణులను ప్రయోగించారు.

# ధైర్యముంటే అసెంబ్లీకి రండి

>>148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డిఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సిబిటి విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీతో పాటు అప్పీలేట్ అథారిటీనీ కూడా పెట్టి ఫిర్యాదులను పరిష్కరించాం. స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిబంధనల్నే అమలు చేశాం. ఉద్యోగాలు వచ్చిన వారంతా అత్యుత్తమ ప్రతిభ కలిగిన వ్యక్తులు, ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నారు. మెగా డిఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని టీచర్లు చెప్పారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే రిజల్ట్స్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ఉంది. ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుంది.? ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఓ ఐఎఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నోటిఫికేషన్‌లో నియామక ప్రక్రియలో ఒక్క డీవియేషన్ కూడా లేదు. లిటిగెంట్ పార్టీకి చెందిన వ్యక్తులు వందల కేసులు వేసి అడ్డంకులు సృష్టించారు. అధికారికంగా వివరణ ఇచ్చినా రోజుకో కుట్ర చేస్తూనే ఉన్నారు. డిఎస్సీపై గొడ్డలిపార్టీ ఒడిశా కూలీలతో, 90యేళ్ల జగన్ జెన్ జీ వ్యక్తులతో ధర్నాలు చేయించింది. ఈ ఆరోపణల్ని ఇక సహించలేక ఇప్పుడు టీచర్లే రోడ్డుపైకి వచ్చారు. మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో పెద్ద ఎత్తున టీచర్లు ఆందోళన చేశారు. పిల్లలకు పాఠాలు చెబుతాం, ప్రతిభను కించ పరిస్తే గుణపాఠం కూడా చెబుతామని వారు నినదించారు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**అసెంబ్లీకి రాకుండా పబ్జీలు:** "మా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ, కుట్రలు చేసే పార్టీలకు, వ్యక్తులకు కాదు. ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసురుతున్నాను. అసెంబ్లీకి వస్తే అడ్డంగా దొరికిపోతారనే వాళ్లు రావటం లేదు. రోడ్డుపై హిట్ అండ్ రన్ తరహాలో వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ కుట్రలూ పనిచేయవని డిఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన వారికి చెబుతున్నాను. పూర్తి పారదర్శకతతో బాధ్యతతో, పూర్తి జవాబు దారీతనంతో నియామకాలు జరిగాయి. విద్యావిధానంలో సంస్కరణలతో పాటు పరీక్షల్లోనూ మరింత పారదర్శకత తీసుకువస్తాం. సిగ్గులేని ఆ పార్టీ అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. బాధ్యత కలిగిన వ్యక్తులు శాసనసభకు వచ్చి డిమాండ్ చేయాలి. రెండున్నర యేళ్ల నుంచి అసెంబ్లీకి రాని పార్టీని చూడటం నా జీవితంలో ఇదే తొలిసారి. అసెంబ్లీకి రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. అనే నేనుగా నాకు ప్రజలపై పూర్తి బాధ్యత ఉంది. వారికి ఏముందో ప్రజలే చెప్పాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# గేట్‌వే ఆఫ్ ది ఈస్ట్

>>విశాఖపట్నం భారతదేశంలోని కీలక నగరాలతో పాటు మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియాలోని ముఖ్య గమ్యస్థానాలకు అనుసంధానమైంది. ఈ తొలి విమాన సర్వీసులు ఉత్తర ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంతో అనుసంధానించే వ్యూహాత్మక విమానయాన కేంద్రంగా విమానాశ్రయం సిద్ధంగా ఉందని చాటి చెప్పాయి. పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు, విమానాశ్రయ వర్గాలకు చెందిన భాగస్వాములతో కలిసి ఈ చారిత్రాత్మక మైలు రాయి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా, తొలి ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఆయన లాంఛనంగా బోర్డింగ్ పాస్‌లను అందజేశారు. అలాగే, విమానాశ్రయ కార్యకలాపాల ప్రారంభానికి గుర్తుగా జ్ఞాపికలను అందజేశారు.

**తొలి రోజున చారిత్రాత్మక విమాన సర్వీసులు :** ఇండిగో విమానం 6ఈ 6408: హైదరాబాద్ – విశాఖపట్నం – అరైవల్స్

ఇండిగో విమానం 6ఈ 9051: విశాఖపట్నం – హైదరాబాద్ – డిపార్చర్స్, తొలి భారతీయ విమానయాన సంస్థ అంతర్జాతీయ విమానం

ఇండిగో విమానం 6ఈ 1443: అబుదాబి (ఎయుహెచ్) – విశాఖపట్నం (విటిజెడ్) – అరైవల్స్

ఇండిగో విమానం 6ఈ 1444: విశాఖపట్నం (విటిజెడ్) – అబుదాబి (ఎయుహెచ్) – డిపార్చర్స్

తొలి అంతర్జాతీయ విమానయాన సంస్థ విమానం

స్కూట్ విమానం టిఆర్ 784: సింగపూర్ (ఎస్ఐఎన్) – విశాఖపట్నం (విటిజెడ్) – అరైవల్స్

స్కూట్ విమానం టిఆర్ 785: విశాఖపట్నం (విటిజెడ్) – సింగపూర్ (ఎస్ఐఎన్) – డిపార్చర్స్

రోజులో తొలి రాక విమానాలుగా వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఇండియా, ఇండిగో, స్కూట్, ఇండియా వన్ విమానాలకు సంప్రదాయబద్ధమైన వాటర్ క్యానన్ సెల్యూట్‌తో స్వాగతం పలికారు. ఇది ప్రాంతీయ విమానయానంలో నూతన అధ్యాయానికి నాంది పలికిన వేడుకగా నిలిచింది. తొలి రోజున 52 ఎయిర్ ట్రాఫిక్ మూవ్‌మెంట్స్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించడంతో, విమానాశ్రయం సందడిగా మారి తన కార్యకలాపాల ప్రయాణాన్ని ఉత్సాహభరితంగా ప్రారంభించింది. జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కన్వర్‌బీర్ సింగ్ కల్రా మాట్లాడుతూ, అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో వాణిజ్య కార్యకలాపాల ప్రారంభం ఉత్తర ఆంధ్రప్రదేశ్‌కు ఒక పరివర్తనాత్మక ఘట్టం. ఇది ఈ ప్రాంత కనెక్టివిటీ ప్రయాణంలో ఒక నూతన అధ్యాయానికి నాంది.

మా బృందాలు, భాగస్వాములు సంవత్సరాలుగా చేసిన సమగ్ర ప్రణాళిక, ఇంజినీరింగ్ నైపుణ్యం, నియంత్రణ నిబంధనల అమలు, కార్యకలాపాల సన్నద్ధతకు ఇది ప్రతిబింబం. విమానాశ్రయం ద్వారా ఈ ప్రాంతానికి సేవలు అందించడం ప్రారంభిస్తున్న సందర్భంగా తొలి ప్రయాణికులు, విమానయాన భాగస్వాములకు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉంది. సురక్షితమైన, సౌకర్యవంతమైన, ప్రపంచ స్థాయి ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాము. ఈ విమానాశ్రయం నుంచి కనెక్టివిటీని మరింత విస్తరించేందుకు కృషి చేస్తాము. వాణిజ్యం, పర్యాటకం, పెట్టుబడులు, ఉపాధికి ఈ విమానాశ్రయం





శక్తివంతమైన ఉత్ప్రేరకంగా నిలుస్తుంది. అదే సమయంలో ప్రాంతీయ, అంతర్జాతీయ కనెక్టివిటీని బలోపేతం చేస్తూ, ఉత్తర ఆంధ్రప్రదేశ్ దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుంది" అని ఆయన తెలిపారు. ఈ విమానాశ్రయాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2026 ఆగస్టు 1న ప్రారంభించారు.

ఏటా ప్రారంభంగా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యంతో రూపొందించిన ఈ విమానాశ్రయాన్ని దశలవారీ విస్తరణకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ చేశారు. భవిష్యత్తులో ఏటా 4 కోట్లకు పైగా ప్రయాణికులను నిర్వహించేలా విస్తరించేందుకు అవకాశం ఉంది. 3,800 మీటర్ల కోడ్ 4ఈ రన్‌వే వైడ్‌బాడీ విమానాలను సైతం నిర్వహించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది భవిష్యత్తులో దేశీయ, అంతర్జాతీయ విమాన కనెక్టివిటీ విస్తరణకు తోడ్పడటంతో పాటు, విమాన కార్గో సామర్థ్యాలను బలోపేతం చేసి, భారత తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన విమానయాన మరియు లాజిస్టిక్స్ హబ్‌గా మరింత స్థిరపరచనుంది.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గమ్యానికి కొత్త రెక్కలు తొడుగుతూ భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం నుంచి సేవలు ప్రారంభం కావడం ఎంతో ఆనందదాయకంగా ఉందని డి.సిఎం పవన్ కల్యాణ్ "ఎక్స్" వేదికగా వ్యాఖ్యానించారు. "హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో విమానం విజయవంతంగా ల్యాండ్ కావడంతో రాష్ట్ర ప్రగతి చరిత్రలో ఒక అద్భుత ఘట్టంగా ఆవిష్కృతమైంది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో నిర్మితమైన ఈ అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం రవాణా సౌకర్యాల విస్తరణ మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల ఆకాంక్షలకు నిలువెత్తు రూపమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# చర్చలు విఫలం

>>నాలుగోరోజుకు చేరుకుంది. సోమవారం 15 మంది పీజీ వైద్యులు ఉదయం 9నుంచి రాత్రి 9 గంటల వరకు దీక్షలో పాల్గొన్నారు.

**జూనియర్ వైద్యులకు వైద్యుల సంఘం మద్దతు:** జూనియర్ వైద్యుల ఆందోళనకు భారత వైద్యుల సంఘం గుంటూరు విభాగం ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. ఆందోళన శిబిరాన్ని సందర్శించిన వారిలో మాజీ అధ్యక్షుడు, మాజీ వైద్య మండలి సభ్యుడు డాక్టర్ నాగళ్ల కిశోర్, గుంటూరు విభాగం అధ్యక్షుడు డాక్టర్ సేవా కుమార్, కార్యదర్శి, జీర్ణకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ సాయి కృష్ణ, చెవి-ముక్కు-గొంతు వైద్య నిపుణుడు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నరాల వైద్య నిపుణుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు డాక్టర్ రాజేంద్ర ఉన్నారు.

జూనియర్ వైద్యులు తమ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న పోరాటానికి వైద్య సమాజం ఐక్యంగా అండగా నిలవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

**సృజనాత్మక నిరసు:** ఆందోళనలో భాగంగా సోమవారం కళలు, చిత్రలేఖన కార్యక్రమాన్ని నిర్వహించారు. జూనియర్ వైద్యులు తమ డిమాండ్లు, నిరసన భావాలను చిత్రాలు, కళారూపాల ద్వారా వ్యక్తం చేశారు. ఆందోళన తీవ్రతరం కావడంతో రోగులకు కలుగుతున్న అసౌకర్యానికి జూనియర్ వైద్యుల సంఘం విచారం వ్యక్తం చేసింది. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు వస్తే స్నేహపూర్వకంగా, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సంఘం ప్రకటించింది. ప్రభుత్వం జూనియర్ వైద్యుల డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని కోరింది. సమస్య పరిష్కారమై సమ్మె విరమించి, తిరిగి పూర్తి స్థాయిలో రోగులకు వైద్య సేవలు అందించే అవకాశం లభించాలని

# ఆత్మహత్యాయత్నం

>> ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు కలిసి దూకినట్లు సమాచారం. ఈ ఘటనలో నూకరాజుతో పాటు భార్య మీనా, కుమార్తె సౌజన్య గల్లంతయ్యారు. నదిలో కొట్టుకుపోతున్న నూకరాజు మనవడిని మత్స్యకారులు గుర్తించి ప్రాణాలతో కాపాడారు. గల్లంతైన ముగ్గురి కోసం పోలీసులు, గజ ఈతగాళ్లు, మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మహత్యకు ముందు నూకరాజు రాసినట్లు భావిస్తున్న లేఖలో షేక్ సాధిక్ ఖాన్ అనే వ్యక్తిపై ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తన కుమార్తెను సాధిక్ ఖాన్ వేధిస్తున్నాడని, ఆ వేధింపుల కారణంగానే తాము ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నామని నూకరాజు ఆలేఖలో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో కుటుంబం ఆత్మహత్యాయత్నం వెనుక అసలు కారణాలపై తీవ్ర చర్చ జరుగుతోంది. కాగాసూసైడ్ లెటర్‌లో ప్రస్తావించిన షేక్ సాధిక్ ఖాన్ నిర్వహిస్తున్న రైఫిల్ షూటింగ్ అకాడమీలో నూకరాజు మనవడు షూటింగ్ నేర్చుకుంటున్నట్లు సమాచారం. ఈ పరిచయం కుటుంబ సమస్యకు దారితీసిందా? కుమార్తెను వేధించినట్లు లేఖలో పేర్కొన్న ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు ఏమిటి? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే గోదావరిలో గల్లంతైన నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య ఆచూకీ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. నది ప్రవాహం, నీటి ఉధృతి, గాలింపు ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం వెనుక ఉన్న పూర్తి కారణాలను వెలికితీసేందుకు పోలీసులు సూసైడ్ లెటర్‌ను ఆధారంగా చేసుకుని దర్యాప్తు చేపట్టే అవకాశం ఉంది. ఈ ఘటనతో నూకరాజు కుటుంబం, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ సంఘటన పై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికార యంత్రాంగం ని ఆదేశించారు.

గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు వేగవంతం చేయాలని కోరారు. జరిగిన విషయం పై విచారం వ్యక్తం చేస్తూ బాధ్యులుగా తేలిన వారిపై చట బద్ధంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిసిఎం పవన్ ఆదేశించారు.

# యేటా డిఎస్సీ

>> వద్ద కాపలా ఉంచిందని ఆయన విమర్శించారు. ఈ ప్రజా ప్రభుత్వంలో పౌరులకు స్వేచ్ఛ ఉందని, ఎవరైనా వ్యవస్థను ప్రశ్నించవచ్చని లోకేశ్ తెలిపారు. భిన్నాభిప్రాయాలు ఉన్నవారు కోర్టులో 336 కేసులు వేశారని, వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ విధానాలను అమలు చేయాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే డిఎస్సీ నియామక ప్రక్రియలో ఇలాంటి రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయడం ఇదే మొదటిసారని ఆయన స్పష్టం చేశారు. తాము నియామకాలను పారదర్శకంగా నిర్వహించామని, అందుకే వేలాది మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వానికి మద్దతు తెలిపారని ఆయన వివరించారు. డిఎస్సీ ప్రక్రియపై జగన్ బృందం నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని లోకేశ్ ఆరోపించారు. వైఎస్సార్సీపీ కుల, మత ప్రాతిపదికన రాష్ట్రంలో చిచ్చు పెడుతోందని ఆయన మండిపడ్డారు. జగన్ అసెంబ్లీకి వస్తే చర్చకు తాను సిద్ధమని, ఎక్కడైనా సరే దీనిపై చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి లోకేశ్ సవాల్ విసిరారు .

# జూడాల సమ్మె.. వైద్యసేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

**విజయవాడ.ఆగస్టు 17,ప్రభాతవార్తప్రతినిధి:** జూనియర్ డాక్టర్ల (జూడాల) సమ్మె నేపథ్యంలో రోగులకు వైద్యసేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని ఆసుపత్రుల్లో (డీఎస్‌హెచ్) పనిచేస్తున్న సీనియర్ రెసిడెంట్లు, డీఆర్‌పీలను వెంటనే రిలీవ్ చేసి, సంబంధిత వైద్య కళాశాలల ప్రిన్సిపళ్ల వద్ద రిపోర్టు చేయాల్సిందిగా వైద్యశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రస్తుత అత్యవసర పరిస్థితుల్లో సెలవులో ఉన్నవారితో పాటు, అనధికారికంగా విధులకు రాని వైద్య సిబ్బందిని కూడా వెంటనే విధుల్లోకి రప్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ ఆస్పత్రులపై అదనపు భారం పడకుండా ఉండేందుకు వీలైనంత వరకు రిఫరల్స్‌ను తగ్గించాలని, కేవలం అత్యవసర కేసులనే ప్రభుత్వ, బోధనాసుపత్రులకు పంపాలని స్పష్టం చేశారు. వైద్య రంగానికి ముందస్తు ఊరటనిచ్చేలా వైద్యాధికారులకు సాధారణ సెలవులు మంజూరు చేయవద్దని ఉన్నతాధికారులను ఆదేశించడంతో పాటు, అవసరమైతే ప్రైవేట్, ఐఎంఏ వైద్యుల సేవలను తాత్కాలికంగా వినియోగించుకోవాలని సూచించారు.




## తిరుపతిలో అత్యవసరసేవలు బంద్

**తిరుపతి,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమలోనే ప్రఖ్యాతిగాంచిన వైద్యశాల తిరుపతి రుయాలో జూనియర్ డాక్టర్ల సమ్మె ఉద్ధృతమైంది. ఫేజ్3లో భాగంగా సోమవారం ఉదయం నుండి అత్యవసర సేవలను కూడా నిలిపివేశారు. రెండేళ్లకోసారి 15శాతం స్టైపెండ్ పెంచాలన్నా ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని కలెక్టర్‌కు వినతి సమర్పించారు. ఎస్వీ మెడికల్ కళాశాల పీజీలు, ఇంటర్న్‌లు, సీనియర్ రెసిడెంట్లు ఆందోళనలో పాల్గొన్నారు. మరోవైపు రుయాలో ఇబ్బందులు లేకుండా సర్వీస్ డాక్టర్లతో సేవలు అందిస్తున్నామని వైద్యవర్గాలు తెలిపాయి. వారం రోజులుగా దశలవారీగా నిరసనలు తెలిపినప్పటికీ సర్కార్ నుంచి స్పందన కరువవడంతో, సోమవారం ఉదయం నుంచి క్యాజువాల్టీ, ఐసీయూ, ఆపరేషన్లు సహా అన్ని రకాల అత్యవసర సేవలను బహిష్కరిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు ప్రకటించారు. ఫలితంగా సర్కారీ ఆస్పత్రుల్లో వైద్య సేవలు కుదేలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

## విషాద సంఘటన దురదృష్టం: మంత్రి నిమ్మల

**పెద్దదోర్నాల, ఆగస్టు 17, ప్రభాతవార్త:** వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరరంగములో ఇరుక్కుపోయిన టీబీఎం పనులు తొలగింపు పనుల్లో జరిగిన ప్రమాదంపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్న సమయంలో దురదృష్టవశాత్తు ఇటువంటి విషాదకర సంఘటన చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ప్రమాదంలో కార్మికుడు మృతి చెందడం పట్ల మంత్రి నిమ్మల రామానాయుడు విచారం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వము, ప్రాజెక్టు యాజమాన్యం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని అధికారులు, ఏజెన్సీ సంస్థ ప్రతినిధులను మంత్రి ఆదేశించారు. వెలుగొండ ప్రాజెక్టు పనులు తుది దశలో ఉన్న నేపథ్యంలో అధికారులు, ఇంజనీర్లు నిర్మాణ సంస్థ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మిగిలిన పనులను భద్రతతో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. టన్నెల్స్ పనులలో కార్మికుల భద్రతకు మొదటి ప్రాధాన్య ఇవ్వాలని అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

## వారం - వర్జ్యం

18-08-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.షష్ఠి సా.5.55
న.స్వాతి పూర్తి
వ.ఉ.11.00-మ.12.43
దు1.ఉ.8.23-ఉ.9.14
దు2. రా.11.34-రా.12.25
రాహు.మ.3.00-సా.4.30 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తత కలిగి ఉండండి. వృత్తి పరంగా అభివృద్ధి సాధిస్తారు. కాంట్రాక్ట్లు దక్కుతాయి.

**వృషభం :** వీసా, పాస్‌పోర్ట్ అంశాలు ఒకింత పురోభివృద్ధి సాధిస్తారు. తనఖాలు విడిపిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తొలగుతాయి.

**మిథునం :** మీ వారెవరో మీకు అపకారం చేసే వారెవరో స్పష్టంగా తెలుస్తుంది. వాహన సౌఖ్యం. ముఖ్య వ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు తీసుకొంటారు.

**కర్కాటకం :** ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడంలో కాస్త జాప్యం జరుగుతుంది. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. వాహన సౌఖ్యం.

**సింహం :** మీ మేధస్సు నలుగురిలో ప్రశంసించ బడుతుంది. బంధుత్వాలకు అతీతంగా వ్యవహరించండి. సభలలో పాల్గొంటారు.

**కన్య :** ఆర్థిక ఒడిదుడుకులు కొంత చికాకు గురి చేస్తాయి. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. క్రయ విక్రయాలకు దూరంగా ఉండండి.

**తుల :** ఇంటా బయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఉద్యోగులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. నూతన విద్యావకాశాలు లాభిస్తాయి.

**వృశ్చికం :** దూరప్రాంత ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. వస్తు లాభం.

**ధనుస్సు :** కోర్ట్ కేసులు ఓ కొలిక్కి వస్తాయి. బాధ్యతలు సమర్థవంతంగా పూర్తి చేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**మకరం :** సంతానం కోసం అధికంగా ఖర్చు చేస్తారు. నూతన ప్రయత్నాలు కలిసి వస్తాయి. బంధువుల కలయిక. ఇంటా బయటా ప్రోత్సాహం.

**కుంభం :** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. జీవిత భాగస్వామి ద్వారా ధన లాభం పొందుతారు. వాహన యోగం.

**మీనం :** కొత్త కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయటానికి విఫల యత్నం చేస్తారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అమరావతి రోడ్లన్నీ ఐఆర్‌ఆర్‌తో అనుసంధానం

## రూ.3200 కోట్లతో ప్రభుత్వం ప్రతిపాదనలు

**విజయవాడ, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి రాజధాని నగరంలో నిర్మిస్తున్న ట్రంకు రోడ్లను ఇంటర్నల్ రింగు రోడు (ఐఆర్‌ఆర్)కు అనుసంధానం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.3,200 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఆమోదం తెలిపారు. త్వరలోనే ఈ మేరకు పనులు ప్రారంభం కానున్నాయి. ఇంటర్నల్ రింగు రోడ్డుకు అవసరమైన భూమి కోసం ఇప్పటికే సిఆర్‌డిఎ ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించింది. కంతేరు, తాడికొండ, మోతడక గ్రామాల్లో భూములు సమీకరణ పద్ధతిలో తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా మోతడకలో గతంలో గ్రామసభ ఆమోదం మేరకు పూలింగుకు తీసుకోవాలని అథారిటీ సమావేశంలో నిర్ణయించారు. ఇంటర్నల్ రింగురోడ్డును కంతేరు సమీపంలో నుండి వైకుంఠపురం వరకూ నిర్మిస్తున్నారు. రెండోదశ అభివృద్ధిలో భాగంగా తొలిదశలో ఉన్న ట్రంక్ లైన్లను ఐఆర్‌ఆర్‌కు కలపాలని గతంలోనే ప్రతిపాదనలు వచ్చాయి. వాటిల్లో ముఖ్యంగా తూర్పు పడమరలకు వేస్తున్న ఈ సిరీస్ రోడ్డు 2, 7, 8, 13, ఉత్తర దక్షిణం వరకూ వేస్తున్న ఎన్ సిరీస్ రోడ్లలో 10, 12, 15, 17 రోడ్లను మరింత విస్తరించడంతో పాటు ఇంటర్నల్ రింగురోడ్డుకు అనుసంధానం చేయనున్నారు. దీనిపై సర్వే ప్రక్రియ కూడా పూర్తి చేశారు. ఇప్పటికే సీడ్ యాక్సిస్ రోడ్డును పాత జాతీయ రహదారికి కలిపిన నేపథ్యంలో మిగిలిన రోడ్లను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీని ద్వారా రవాణా మెరగవుతుందని అంచనా వేస్తున్నారు. 2028 నాటికి రాజధాని పూర్తి చేసే సమయానికి రోడ్లను




కూడా పొడిగించనున్నారు. ఇప్పటికే ఇ-13 రహదారిని వడ్డేశ్వరం వద్ద ఎన్‌హెచ్-16లో కలిపే పని ప్రారంభించారు. దీనికోసం ఎయిమ్స్ వెనుక కొండ ప్రాంతాలన్ని తొలిచారు. అలాగే ఇ-15వ రోడ్డును కూడా మంగళగిరి సమీపంలో జాతీయ రహదారికి కలపాలని నిర్ణయించారు. దానికి సంబంధించిన పనులూ ప్రారంభం అవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఎన్6ను జాతీయ రహదారికి ఇచ్చేశారు. ఈ రోడ్డు నిర్మాణ సమయంలోనూ మాస్టర్ ప్లాను ప్రకారం ఉన్న రోడ్లు దాదాపు దెబ్బతిన్నాయి. నేరుగా కనెక్టివిటీ లేకుండా పోయింది. దీంతో జాతీయ రహదారికి అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మించాల్సి ఉంది. దీనిపై గతంలోనే కేంద్రానికి లేఖ రాశారు. మరో ఏడాదికాలంలో అమరావతి రాజధాని నగరంలో రోడ్లను పూర్తి చేయడంతోపాటు ఇంటర్నల్ రింగు రోడ్డుకు అనుసంధానం చేసే ప్రక్రియను కొలిక్కి తీసుకురానున్నారు.

# ఎల్ నినోతో వర్షాభావం

- సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు
- ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- తాగునీటికే తొలి ప్రాధాన్యం
- శాసనసభలో ఎల్ నినోపై స్వల్పకాలిక చర్చలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, తద్వారా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కానుందని తెలిపారు. కొన్ని జిల్లాల్లో జులై నెలలో 68 శాతం లోటు వర్షపాతం నమోదైందని వివరించారు. ఈ యేడాది 35.5శాతం లోటు వర్షపాతం ఉంటుందని చెబుతున్నారని, కొన్ని జిల్లాల్లో అయితే 42శాతం లోటు వర్షపాతం ఉంటుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు.

ఎల్‌నినోపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, పరిష్కారాలపై సోమవారం శాసనసభలో చంద్రబాబు మాట్లాడుతూ, "నీటిపంపకాల్లో రాష్ట్రాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయి. కావేరి జలాలపై తమిళనాడు-కర్ణాటక మధ్య వివాదం నెలకొంది. ఈ వివాదంపై సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకుంది. గ్రామాలు, రాష్ట్రాలు, దేశాల మధ్య కూడా నీటి గొడవలు వస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్రలోనూ లోటు వర్షపాతం ఉంది. పైనుంచి నీళ్లు రాకుంటే శ్రీశైలం, నాగార్జున సాగర్‌పై తీవ్ర ప్రభావం ఉంటుంది. ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటినిల్వలు తగ్గిపోతున్నాయి. గోదావరి నదికి మాత్రం కాస్త నీళ్లు వస్తున్నాయి. పెన్నా బేసిన్ కూడా ప్రమాదంలో ఉంది" అని పేర్కొన్నారు. 'జలధార ద్వారా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాం. ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోడీ కూడా ప్రశంసించారు. మరో మూడేళ్లలో రూ.35,555



కోట్లతో 36 ప్రాజెక్టులు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాం. ఇవన్నీ పూర్తయితే 19.16 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించవచ్చు. ఎల్‌నినోపై పోరాటానికి పంచ సూత్రాలు పెట్టుకున్నాం. భూగర్భజలాలు పెరిగేలా చర్యలు చేపడుతున్నాం. రైతులంతా వర్షపు నీటిని ఎక్కడికక్కడ పొదుపు చేసుకోవాలి. నేరేడు, మడ్డువలస ఫేజ్2 ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తాం. నాగావళి, చంపావతి లింక్‌ను వచ్చే జూన్ నాటికి, తోటపల్లి బ్యారేజ్‌కు రూ.249 కోట్లు ఖర్చు చేసి జులైలోగా పూర్తి చేస్తాం. వంశధార, గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం పూర్తి చేస్తాం. ఇవి పూర్తయితే రాష్ట్రంలో కరవు అనే మాటే ఉండదు' అని సిఎం చంద్రబాబు అన్నారు. మరోవైపు పొగాకు రైతులకు వడ్డీ లేని రుణాలు ఇప్పించామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నష్టపోయిన మామిడి, కోకో, ఉల్లి రైతులను ఆదుకున్నామని గుర్తుచేశారు. పశుగ్రాసానికి సమస్య రాకుండా ఏర్పాట్లు చేశామని, పశువుల కోసం గడ్డి బాగా పెంచేలా చర్యలు చేపట్టామన్నారు. అదేవిధంగా 15,300 గోకుల షెడ్లు నిర్మించామని, ఈ ఏడాది కూడా మరికొన్ని నిర్మిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. సంక్షోభం వచ్చినప్పుడు అందరూ కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని చంద్రబాబు అన్నారు. నీటిని తక్కువగా తీసుకునే పంటలను ప్రోత్సహిస్తున్నా మని చెప్పారు. సేంద్రియసాగు విధానంలో పంటలసాగు పెరగాలన్నారు. మెట్ట ప్రాంతాల రైతులకు మెరుగైన సాగు విధానం ప్రకృతి సేద్యమని తెలిపారు. మీ ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రతి ఎమ్మెల్యే, మంత్రీ ప్రోత్సహించా లని కోరారు. అన్నదాతల నుంచి వచ్చే పంటలబీమా దరఖాస్తులు పెరిగాయని వివరించారు. పంటల బీమాలో దేశంలోనే ఐదో స్థానంలో ఉండటం మనకు గర్వకారణమని వెల్లడించారు. అయితే అన్ని రకాల పంటలకు బీమా చేయించడం కర్షకుల బాధ్యతని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## పాఠశాల ప్రహరి గోడ కూలి

# విద్యార్థి మృతి

**పార్వతీపురం (సాలూరు), ఆగస్టు 17 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిపై స్కూల్ ప్రహరీగోడ కూలిపోయి మృతి చెందిన ఘటన చోటుచేసు కుంది. స్థానిక 5వ వార్డు రెల్లివీధికి చెందిన తుపాకుల వరుణ్ తేజ్(14) హైస్కూల్లో టెన్త్ క్లాస్ చదువుతున్నాడు. సోమవారం సప్లమెంటరీ పరీక్షలకు హాజర య్యాడు. అలాగే మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్కూల్ వెనక భాగంలో ఉన్న మరుగుదొడ్ల వెనుక ప్రహరీగోడ వద్దకు తన స్నేహితుడు యాకోబ్‌తో కలిసి వెళ్ళాడు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా గోడకూలి వరుణ్ తేజ్‌పై పడిపోవడంతో కొన ఊపితో ఉన్న ఆ బాలుడ్ని పక్కన ఉన్న ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన పాఠశాల సిబ్బంది తరలిం చారు. తక్షణమే వైద్యులు చికిత్స అందించినప్పటికీ వరుణ్ తేజ్ మృతి చెందడంతో తల్లి తండ్రులు సుమన్ అశ్వినీ గుండెల అవిసెల రోదించారు. అలాగే వీరికి ఇద్దరు పిల్లలు అక్షయ, అక్షత ఉన్నారని తెలిసింది. రెల్లివీధిలో ఉంటున్న బాలుడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నేరయ్యారు. పాఠశాల ఆవరణలో వరుణ్ తేజ్ మృతదేహంతో బయటాయించి ఆందోళన చేపట్టారు. టౌన్ సీఐ అప్పలనాయుడు, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఉద్రిక్త వాతావరణాన్ని అదుపులోకి తెచ్చారు. అలాగే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

# ఈనామ్ భూ బాధితుల ఆందోళన

**జగ్గయ్యపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త:** గడచిన దశాబ్ధకాలంగా పలు రకాలుగా పోరాటాలు చేస్తున్న ఈనామ్ భూ బాధితులు సోమవారం పెద్దసంఖ్యలో భారీ ప్రదర్శన, తహసీల్ధార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈనామ్ భూ బాధితులు తమ భూములపై ఉన్న నిషేదాన్ని ఎత్తివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. 1956 ఈనాం అబాలిషన్ యాక్టును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా తహసీల్ధార్‌కు మొత్తం 160 అర్జీలను సమర్పించారు. రాష్ట్ర ఈనామ్ భూ బాధితుల సంఘం అధ్యక్షులు రాచకొండ కోటేశ్వరరావు, కన్వీనర్లు రంగాపురం నరసింహారావు, ప్రసాద్, సుధీర్, గట్టిడి దుర్గాప్రసాదు, వి.రామకృష్ణ, కెవి రమేష్, ఈనామ్ భూ బాధితులు పాల్గొన్నారు.

**లైఫ్ సైన్సెస్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకించిన గ్రామ ప్రజలు:** జగ్గయ్యపేట మండలం షేర్ మహ్మద్‌పేట గ్రామ సమీపంలో ఏర్పాటుచేయనున్న శ్రీసాయిరామ లైఫ్ సైన్సెస్ ఫ్యాక్టరీ ఏర్పాటును గ్రామసభలో ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. కాలుష్యంతో ఇప్పటికే సతమతమవుతున్న ప్రజలు ఆనారోగ్యాలతో, అర్ధాయుష్షుతో కుటుంబాలకు కుటుంబాలు నష్టపోతున్న పరిస్థితుల్లో కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఎట్టిపరిస్థితిలోనూ అంగీకరించేది లేదంటూ నినాదాలు చేశారు. గ్రామ సచివాలయంలో గ్రామసభ ప్రత్యేక అధికారి పిఆర్ ఏఈ శ్రీనివాసరావు, గ్రామ ఇన్‌ఛార్జి కార్యదర్శి సాయిసంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో ఆందోళకారులు మాట్లాడుతూ ప్రజామోదం పొందక ముందే సదరు ఫ్యాక్టరీ నిర్మాణ పనులు మొదలుపెట్టి 70 పనులు ఎలా చేశారని, అధికారులు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. సిపిఎం నాయకులు సోమోజు నాగమణి, రామనాథం, కాకనబోయిన లింగారావు, కోట కృష్ణ, షేక్ గౌస్‌మియా, వెంకటేశ్వరరావు, పుల్లారావు, నరేంద్ర, ఎస్ ప్రణయ్‌తేజ, టిడిపి నాయకులు సుభాని, చెక్కా సుధాకర్, కమలేష్, నాగేశ్వరరావు, సిహెచ్ సుధాకర్, కాలుష్య వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధి డాక్టర్ బొజ్జా రాజేష్ తదితరులు పాల్గొని తమ నిరసన వ్యక్తంచేశారు.



ఆందోళన చేస్తున్న ఈనామ్ భూ బాధితులు




# జోనల్‌స్థాయి స్కేటింగ్‌లో చిన్నారుల ప్రతిభ

**విజయవాడ, ఆగస్టు 17 ప్రభాతవార్త:** ఇటీవల రావులపాలెంలో జరిగిన సిఐఎస్సీఐ బోర్డు జోనల్, రీజనల్‌స్థాయి స్కేటింగ్ పోటీలలో ఎన్‌టిఆర్‌జిల్లా చిన్నారులు ప్రతిభ కనపరచి బంగారుపతకాలు సాధించగా, పతకాలు సాధించిన చిన్నారులను కలెక్టర్ లక్ష్మీశా సోమవారం అభినందించారు. 11సంవత్సరాల లోపు బాలుర విభాగం రోడ్‌రేస్ పోటీలలో నడికట్ల బ్లెస్సన్ బంగారు పతకాన్ని సాధించగా, 14సంవత్సరాల లోపు బాలికల విభాగం రోడ్‌రేస్‌లో నడికట్ల ఘనత ఆనంద్ బంగారు పతకం, రింక్‌రేస్‌లో బంగారు పతకం సాధించింది. రీజనల్‌స్థాయి పోటీల్లో బ్లెస్సన్ రజిత పతకాన్ని సాధించింది. స్కేటింగ్‌లో పతకాలు సాధించిన వీరిద్దరిని విజయవాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ అభినందిం చారు. స్కేటింగ్‌లో మరింత తర్ఫీదుపొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు గౌరవాన్ని తేవాలని కలెక్టర్ లక్ష్మీశా ఆకాంక్షించారు.

# కళ్ల ముందు నీళ్లు ఉన్నా వాడకూడదంటే ఎలా?!

- మిరప పంట వాడిపోతుంటే కడుపు తరుక్కుపోతోంది
- భార్యల నగలు తాకట్టుపెట్టి పంటలు సాగు చేశాం
- నీళ్లు ఇవ్వకుంటే ఎలా?
- విద్యుత్ కనెక్షన్లు తొలగించడంతో ధర్నాకు దిగిన రైతులు



రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

**వజ్రకరూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం వల్ల హంద్రీనీవా నీటిని తాగునీటికి మాత్రమే వాడాలని, కెనాల్సి నుంచి అక్రమంగా సాగునీటికి వాడకూడదని అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో ఆదేశాల అమలుకు అధికార యంత్రాంగం నడుం బిగించింది. ఈ క్రమంలో వజ్రకరూరు మండలం రైతులు ఆందోళనకు దిగడం చర్చని అంశంగా మారింది. రైతులకు విషమిచ్చి చంపండి. కళ్ళముందు పోతున్న నీటిని వాడుకోవద్దు అంటే ఆంక్షలు విధిస్తే ఎలా అంటూ ఆవేదనతో ఉరవకొండ గుంతకల్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నాకు దిగిన సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ ను ఏర్పాటు చేసినప్పటి నుంచి కృష్ణా జలాలను వాడుకుంటూ రైతులు పొలాలను సాగు చేస్తున్నారు. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా మిరప పంటను కాలువ నీటిని నమ్ముకుని వందలాది ఎకరాలలో మండలంలో సాగు చేస్తున్నారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో తీవ్రవర్ష భావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. మెట్ట ప్రాంతా లలో వర్షాధారం క్రింద సాగు చేస్తున్న పంటలు వర్షం లేక ఎండిపోయే పరిస్థితి నెలకొంది. వారం రోజుల క్రితం హంద్రీనీవా నీరు రావడంతో రైతులు వందలాది ఎకరాలలో మిరప పంటను సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సోమవారం పొట్టిపాడు ఫీడర్ ఛానల్‌లోని 11 కెవి జంపర్‌ను కట్ చేశారు. రైతులకు సంబంధించిన త్రీ ఫేజ్ రాక విద్యుత్ మోటార్లు ఆడకుండా నిలిచిపోయాయి. మోటర్లు నిలిచిపోవడంతో పంటలకు నీరు అందలేదు. దీంతో ఆగ్రహించిన రైతన్నలు మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద ఉరవకొండ గుంతకల్ ప్రధాన రహదారిపై 3 ఫేస్ కనెక్షన్ ను పునరుద్ధరించాలంటూ రహదారిపై ట్రాక్టర్ ను అడ్డంగా ఉంచి ధర్నాకు దిగారు. ఇరువైపులా పదుల సంఖ్యలో వాహనాలు రహదారిపై నిలిచిపోయాయి.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Thulluru Mandal, Guntur District - 522237, Andhra Pradesh
NIT No. 21/MAU61-ADMN0STG(OTH)/12/2026/2nd call Dt: 14/08/2026
**E-PROCUREMENT TENDER NOTICE**
Name of Work: APCRDA - "Request for Proposal (RFP) for Selection of Consultant to Provide Comprehensive Multi-layered Third-Party Quality Assurance & Quality Control Services for infrastructure and construction works of development in Amaravati Capital City, Andhra Pradesh, India". The bid can be downloaded on AP e-procurement portal from **19.08.2026 to 03.09.2026 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **03.09.2026 up to 15.00 Hrs**, Technical bid opening **03.09.2026 @ 16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**
Sd/- Commissioner, APCRDA, Amaravati

# దేశ అంతర్గత భద్రతా సేవల్లో సిఆర్‌పిఎఫ్ భేష్

- జవాన్ల సంక్షేమానికి మోడీ సర్కార్ అత్యంత ప్రాధాన్యం
- సిఆర్‌పిఎఫ్ బలగాల ఆధునీకరణపై కేంద్రం దృష్టి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్





**పీలేరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:** తిరుపతి విమానాశ్రయంలో దిగిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు టిటిడి సభ్యులు భానుప్రకాశ్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుండి నేరుగా రోడ్డు మార్గంలో బయలుదేరి కలికిరిలోని సిఆర్‌పిఎఫ్ కేంద్రానికి చేరుకున్నారు. తొలుత అమరవీరుల స్థూపాన్ని సందర్శించి నివాళి అర్పించారు. సిఆర్‌పిఎఫ్ ఉన్నతాధికారులు కేంద్రమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.26 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆఫీసర్స్ మెస్, సబార్డినేట్ ఆఫీసర్స్ మెస్, రిక్రియేషన్ క్లబ్, స్టోర్, ట్రేడ్స్‌మెన్ బ్లాక్ భవనాల సముదాయాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఇందులో రూ.9.47 కోట్లతో ఆఫీసర్స్ మెస్, రూ.7.9 కోట్లతో సబార్డినేట్ మెస్, రూ.4.9 కోట్లతో రిక్రియేషన్ క్లబ్, రూ.4.55 కోట్లతో స్టోర్ బ్లాక్ భవనాలను నిర్మించారు. ఆయా భవనాలను నేడు కేంద్రమంత్రి బండి సంజయ్ జాతికి అంకితం చేయడం గమనార్హం. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ ఎడిజి సౌత్ జోన్ రవిదీప్ సింగ్ సాహి, ఐజీ దినేష్ ప్రతాప్ ఉపాధ్యాయ్, బ్రిగేడియర్ అనుపమ్ శర్మ, డిఐ సుభాష్ చంద్రశర్మ, చీఫ్ ఇంజనీర్ సీఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిఆర్‌పిఎఫ్ జవాన్లను ఉద్దేశించి కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, 'సిఆర్‌పిఎఫ్ బలగాలకు అందిస్తున్న మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా ఈ రోజు ఆఫీసర్స్ మెస్, సబార్డినేట్ ఆఫీసర్స్ మెస్, రిక్రియేషన్ క్లబ్, స్టోర్, ట్రేడ్స్‌మెన్ బ్లాక్‌ను ప్రారంభించాం. దేశ అంతర్గత భద్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు 24గంటలు విధుల్లో ఉండే మన బలగాల సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అనే విషయం మనందరికీ తెలుసు. మీరు దేశ భద్రత, సార్వభౌమత్వం కోసం మీ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారు. అందుకే మీకు సాధ్యమైనంత మెరుగైన, ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. రిక్రియేషన్ క్లబ్‌లో మన జవాన్ల మానసిక, శారీరక ఆరోగ్యానికి వినోదానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ క్లబ్ మన వీర జవాన్లకు ఒత్తిడి తగ్గించుకోవడానికి, ఒకరితో ఒకరు కలిసిమెలిసి ఉండటానికి, ఆటలు, క్రీడల ద్వారా కొత్త ఉత్సాహం పొందడానికి సహాయపడుతుంది. ముఖ్యమైన వస్తువులు, వనరులను మరింత సురక్షితంగా, క్రమబద్ధంగా నిర్వహించడానికి, భద్రపరచడానికి స్టోర్ బ్లాక్, ట్రేడ్స్‌మెన్ బ్లాక్ ఉపయోగపడతాయి. ఈ ఆధునిక భవనాలు బలగాల పనితీరు, కార్యాచరణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తాయి. ట్రేడ్స్‌మెన్ బ్లాక్ మన కష్టపడి పనిచేసే సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని అందిస్తుంది. ప్రధాని మోడీ నాయకత్వంలో, హోం మంత్రి అమిత్ షా మార్గదర్శనంలో బలగాల ఆధునీకరణకు అనేక చర్యలు చేపడుతున్నాం. దీంతోపాటు జవాన్ల, వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాం. మీరు దేశ అంతర్గత భద్రత కోసం విధుల్లో ఉన్నప్పుడు, మొత్తం దేశం సురక్షితంగా ఉందనే నమ్మకంతో ఉంటుంది. అందుకే మీ ప్రతి అవసరాన్ని చూసుకోవడం మా బాధ్యత. ఈ ఆధునిక మౌలిక వసతుల నిర్మాణంలో పనిచేసిన ఇంజనీర్లు, కార్మికులు, అధికారులందరికీ, ఈ పనిని రికార్డు సమయంలో పూర్తి చేసినందుకు నా అభినందనలు. ఈ కొత్త సౌకర్యాలు మీ ఆత్మవిశ్వాసాన్ని, మనోధైర్యాన్ని మరింత పెంచుతాయని, దేశ సేవ పట్ల మిమ్మల్ని మరింత ప్రేరేపిస్తాయని పూర్తి నమ్మకం ఉంది" అని బండి సంజయ్ పేర్కొన్నారు.

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)
AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN: L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV (8 (1) నిబంధన చూడండి) స్వాధీనతా ప్రకటన**

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్", "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో ఏప్రిల్ 01, 2024 నుండి విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకందారు "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడిన సెక్షన్ 13 (12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. దిగువ పేర్కొన్న తేదీకి రుణగ్రహీతలు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పిలుపునిచ్చారు:-

| రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (లోన్ ఎ/సి నెం.) 24660002505764, నాగిడి వీర రాజు (రుణగ్రహీత), నాగిడి మౌనిక (సహ-రుణగ్రహీత) | 03-ఫిబ్రవరి-26 రూ. 6,72,177/- రూపాయలు ఆరు లక్షల డెబ్బై రెండు వేల నూట డెబ్బై ఏడు మాత్రమే 02-ఫిబ్రవరి-26 నాటికి | 12-ఆగస్టు-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: బాపట్ల జిల్లా, మంతెనవారిపాలెం సబ్-డిస్ట్రిక్ట్, నిజాంపట్నం మండలం, నిజాంపట్నం గ్రామ పంచాయతీ పరిధి, నిజాంపట్నం గ్రామం, డోర్ నం. 31-158 D. నం. 431/15. 1376.125 చదరపు అడుగులు లేదా 153 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ప్రస్తుతం దీనిలో RCC భవనం ఉంది. సరిహద్దులు: తూర్పున - చింత శ్రీనివాస రావు మరియు కన్న శ్రీరాములు గారి ఆస్తి 29.9 అడుగులు, పడమరన - 5 అడుగుల వెడల్పు గల ఉమ్మడి దారి 24.9 అడుగులు, ఉత్తరాన - నాగిడి లక్ష్మి కుమారి గారి స్థలం 51.6 అడుగులు, దక్షిణాన - నాగిడి పోలేరయ్య మరియు నాగిడి కుమారి గారి ఆస్తి 49.6 అడుగులు. | | |
| (లోన్ ఎ/సి నెం.) 24660001944664, కొక్కిలిగడ్డ వీర్రాజు (రుణగ్రహీత), కొక్కిలిగడ్డ లక్ష్మణస్వామి (సహ-రుణగ్రహీత), కొక్కిలిగడ్డ నాగదేవత (సహ-రుణగ్రహీత) | 05-జనవరి-26 రూ. 6,08,405/- ఆరు లక్షల ఎనిమిది వేల నాలుగు వందల ఐదు రూపాయలు మాత్రమే 03-జనవరి-26 నాటికి | 12-ఆగస్టు-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: బాపట్ల జిల్లా, రేపల్లె సబ్-డిస్ట్రిక్ట్, నిజాంపట్నం మండలం, కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధి, కొత్తపాలెం గ్రామం, ఇంటి నం. 2-40 దిండి గ్రామం, ఇంటి నం. 486/1, అసెస్‌మెంట్ నం. 240). ఇందులో 435.2 చదరపు గజాల ఖాళీ స్థలం మరియు ప్రస్తుతం అక్కడ ఉన్న 302.4 చదరపు అడుగుల విస్తీర్ణంలో ACC పైకప్పు కలిగిన ఇల్లు ఉన్నాయి. ఈ ఆస్తి సరిహద్దులు: తూర్పున పంచాయతీ రోడ్డు, పడమరన ఒడుగు శ్రీనివాస రావు గారి ఆస్తి, ఉత్తరాన సాయికం రామ కుమారి గారి ఆస్తి, దక్షిణాన చిప్పల శివయ్య గారి ఆస్తి. | | |
| (లోన్ ఎ/సి నెం.) 23660002404445, తుల్లూరి రమాదేవి (రుణగ్రహీత), తుల్లూరు నాగరాజు (సహ-రుణగ్రహీత) | 04-డిసెంబర్-25 రూ. 6,20,161/- ఆరు లక్షల ఇరవై వేల నూట అరవై ఒక రూపాయలు మాత్రమే 02-డిసెంబర్-25 నాటికి | 12-ఆగస్టు-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: బాపట్ల జిల్లా, రేపల్లె సబ్-జిల్లా, నిజాంపట్నం మండలం, అడవులదీవి పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో, డోర్ నం. 3-172 D.No. 458-5 వద్ద ఉన్న 121 చదరపు గజాలు లేదా 101.84 చదరపు మీటర్ల విస్తీర్ణం గల స్థలం మరియు దానిపై ఉన్న ACC భవనం. (ఈ ఆస్తి రేపల్లె SRO వారి డాక్యుమెంట్ నం. 8009/2023కి సంబంధించినది). దీని సరిహద్దులు: తూర్పున పంచాయతీ రోడ్డు, పడమరన బోలగాని సుందరయ్య గారి ఆస్తి, ఉత్తరాన పంచాయతీ రోడ్డు, దక్షిణాన కటూరి శ్రీనివాసరావు గారి ఆస్తి. | | |

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు [చట్టం 2002కి సెక్షన్ 13(4) కింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకందారు స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8 (6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది"
ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేదీ : 17/08/2026
స్థలం : బాపట్ల, ఆంధ్రప్రదేశ్
సం/- అధీకృత అధికారి
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

మనుషుల వెనుక చెప్పే మాటలను వారి ముఖాల మీదనే చెబితే సమాజం నిలబడటం కష్టం.

న- బాల్జాక్

# కలల వై'భోగం'


కాలాతీతమైనా తూర్పున నవోదయానికి నాంది జరిగింది. సరైన సమయంలో సరైన సందర్భంలో సరైన దిశానిర్దేశం జరిగి భోగాపురానికి ఆకాశయాన వైభోగం దక్కింది. ఇది ఉత్తరాంధ్రకే కాదు తూర్పు తీరానికే ఉషోదయం. వర్తక వాణిజ్యాలకు పెట్టింది పేరయిన ఆ ప్రాంతానికి నిరంతర విమానయాన సౌకర్యాన్నిపొందడం విశేషం. నవ్యాంధ్రప్రదేశ్‌కు ఉత్తరాన విశాఖపట్నం, మధ్యమాన విజయవాడ,దక్షిణా పథాన తిరుపతి ముఖ్యమైన కూడళ్లు. కోస్తాతీర ప్రాంతమంటేనే ప్రాచీన కాలం నుండి వర్తక రాజధానిగా విలసిల్లింది. కాకినాడ, మచిలీపట్నం, విశాఖపట్నంలో మంచిరేవు పట్టణాలైన కనెక్టివిటీ విషయంలో ఎక్కడో కొంత అసంతృప్తి ఉండేది. ప్రధానంగా విశాఖపట్నం రేవు ద్వారానే ఇతర దేశాలకు వాణిజ్యపరంగా ప్రాధాన్యత ఉండేది. గమనాగమనాలన్నీ ఆ రేవు ద్వారానే కానీ ఆకాశయానం అంశానికొస్తే ప్రస్తుతమున్న విశాఖ ఎయిర్‌పోర్ట్ మాత్రం కలిసిరాలేదు.దాని స్థల మహత్యం అలాంటిది. తీర ప్రాంతం తుఫానుల వంటి ప్రకృతి బీభత్సాలను తట్టుకోవాల్సి వచ్చినప్పుడు విశాఖ విమానాశ్రయం కూడా మోకాలిలోతు నీటిలో మునిగిపోవడం చేత అక్కడ్నించి ఎక్కడికి వెళ్లాలన్నా విమానాశ్రయం అందుబాటులో ఉండేది కాదు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల నాడు నిర్మితమైన విశాఖపట్నం విమానాశ్రయం సంవత్సరానికి కొన్ని రోజులే ప్రయాణీకులకు అందుబాటులోకి వస్తుండేది. వాణిజ్యానికి నౌకాయన మార్గం ఉన్నా కాని వాటి స్థితిగతులను పర్యవేక్షించే పారిశ్రామిక యాజమాన్యానికి ప్రయాణ సౌకర్యం తక్కువగా ఉండేది. ఇలాంటి పరిస్థితులు విశాఖపట్నానికి మరో ప్రత్యామ్నాయ ఏర్పాటు అవసరమైంది. ఇప్పుడు ఉత్తరాంధ్ర వాసుల కలలు ఫలించాయి. విశాఖపట్నం విమానాశ్రయానికి స్వస్తి వాచకం చెప్పి పట్టణానికి 45 మైళ్ల కిలోమీటర్ల దూరంలో ఉండే భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ప్రధానంగా విశాఖపట్నం తమ వాహన వై'భోగా'న్ని సోమవారం నుంచి అందుకున్నారు. నాలుగు రోజుల నాడు ప్రధాని నరేంద్రమోడీ ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించారు. భోగాపురం విమానాశ్రయానికి మన్యవీరుడు అల్లూరి సీతారామ రాజు పేరు పెట్టడంతో ఉత్తరాంధ్రలో గిరివాసులు సైతం ఆ విమానాశ్రయం తమది, తమకోసమే నిర్మించారని చెప్పుకుంటూ ఉత్తేజితులయ్యారు. తొలి విమానం ఇక్కడ్నించి సింగపూర్‌కు బయలుదేరింది. మొదటిగా హైదరాబాద్ నుంచే ఇండిగో విమానం చేరుకుంది. ఈ సందర్భంలో విశాఖవాసులు ఎంతో ఆనందోత్సవాల మధ్య కరతాళధ్వనులతో గగనయానానికి అంకురార్పణ చేశారు. శ్రీకాకుళం నివాసి, సీనియర్ రాజకీయ వేత్త, కేంద్ర మంత్రి ఎర్రంనాయుడు కుమారుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర విమానయాన శాఖా మంత్రిగా ఉండడంతో భోగాపురం విమానాశ్రయ నిర్మాణం వాయువేగంతో పూర్తయిపోయింది. ప్రధాని హస్తవాసి కలిసొచ్చింది. ఎలాంటి అవాంతరాలు లేకుండా తొలి విమానం 'టేకాఫ్' అయ్యింది. ఉత్తరాంధ్ర ప్రజలు సంభ్రమాశ్చర్యాలతో మునిగిపోయారు. ఇన్నాళ్లా వెలితిగా ఉన్న గగనయాన సౌకర్యం నేడు అందుబాటులోకి వచ్చింది. ఈ విమానాశ్రయం ఇప్పుడు 'గేట్ వేఆఫ్ ది ఈస్ట్' భోగాపురం విమానాశ్రయం ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు కోడ్ 'విటిజడ్'తో కార్యకలాపాలు మొదలయ్యాయి. విశాఖ నుంచి ఎయిర్‌పోర్ట్‌కుప్రతిరోజూ 20 ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంచారు. ఎయిర్‌పోర్ట్ భద్రత, బాధ్యతలు సిఐఎస్ఎఫ్‌కు దఖలు పడ్డాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక వసతుల కలబోతగా భోగాపురం ఎయిర్‌పోర్టు ఆవిష్కరణ జరిగింది. ప్రస్తుత విశాఖ పట్టణం ఎయిర్‌పోర్టు నావికాదళం చేతిలో ఉంది. 'రన్ వే'ను పొడిగించేందుకు అదనపు స్థలమేదీ లేదు. రోజుకి అయితే విశాఖపట్టణం ఎయిర్‌పోర్టు మూసివేసినందున ఒక్కసారిగా బావురుమంది. స్థానికంగా ఉపాధి పొందిన స్కిల్డ్ వర్కర్స్ విషణ్ణ వదనాలతో వీడ్కోలు చెప్పారు. 50కిపైగా విమానాల రాకపోకలు సాగిస్తుంటే రద్దీగా ఉన్నప్పుడు 20 లక్షల మంది ప్రయాణికుల ప్రయాణావసరాలను తీరుస్తోంది. అనకాపల్లి విశాఖ భోగాపురం కారిడార్‌లో గణనీయంగా పారిశ్రామికాభివృద్ధి జరుగుతున్న ప్రస్తుత తరుణంలో 'లాజిస్టిక్ హబ్'ను తీర్చిదిద్దే పనిలో పాలకులు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించగలగడం ప్రశంసనీయం. విశాఖ పోర్ట్ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు తీర్చిదిద్దిన లాజిస్టిక్ సౌకర్యాల కారణంగా సముద్ర ఉత్పత్తులు, అరటి, మామిడి ఉత్పత్తులు విదేశాలకు సత్వరమే చేరుకోవచ్చును.కార్గో, హోటళ్లు, ట్యాక్సీలు తదితర ఎన్నో రంగాలకు సంబంధించిన సంస్థల్లో స్కిల్డ్ ఉద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి.ప్రధానంగా ఉత్తరాంధ్ర యువతకు జీవనోపాధికి మార్గం సుగమమవుతుంది. గత వందేళ్లుగా వెనుకబడిన ప్రాంతంగా ఉండి, కేవలం ఇతర ప్రాంతాలకు వలసలకు వెళ్లి జీవనోపాధి సాధించుకుంటున్న ఉత్త రాంధ్ర ప్రజానీకానికి ఈ గ్రీన్‌ఫీల్డ్ కొత్తదారి చూపెడుతోం ది. ఈ ఎయిర్ పోర్ట్‌కు సమీపంలో అరకు వ్యాలీ, బొర్ర గుహలు,లంబసింగి, పాడేరు వంటి పర్యాటక ఆకర్షణీయ ప్రాంతాలున్నందున ఈప్రాంత టూరిజం అభివృద్ధికి దోహదపడుతుంది.ఇప్పటికే విశాఖపోర్టు నుంచి 2025- 06 ఆర్థిక సంవత్సరంలో 5.12 లక్షల మెట్రిక్ టన్నుల సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయని 'ఎంపెడా' గణాంకాలు చెబుతున్నాయి. వాటి విలువ రూ. 20,218 కోట్లు ఉంటుంది. తాజాగా పోర్టుకు సకల హంగులూ ఉన్న భోగాపురం ఎయిర్ పోర్టు జతకలవడంలో వాణిజ్య ఎగుమతి దిగుమతులకు అడ్డే ఉండదు. ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు, స్థానికులకు జీవనోపాధిని ఆశించవచ్చు.

ధర్మాత్ముడైన మనిషి మంచి గంధపు చెట్టు వంటివాడు. తనను నరికే గొడ్డలికి కూడా అది సువాసన ఇస్తుంది.



తులసీదాస్

మానవుడు పక్షిలా ఆకాశంలో ఎగరడం , చేపలా నీటిలో ఈదడం నేర్చుకున్నాడు. కానీ మనిషిగా భూమ్మీద బతకడం నేర్చుకోలేదు.



బెర్ట్రాండ్ రస్సెల్

## ప్రజావాక్కు

### ఆర్టీసీ ఎక్స్ ప్రెస్సుల్లో ఉచితం అవసరం లేదు

మన రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉచిత బస్ ప్రయాణం ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సులకి వర్తింప జేసింది. ధనిక మహిళలకు కూడా ఎక్స్‌ప్రెసుల్లో ఉచిత సౌకర్యం వర్తింప జేస్తుంటే, బస్సులు క్రిక్కిరుస్తున్నాయి.బస్‌డిపోల్లో సీట్లు నిండిపోయి అత్యవసర పనులమీద తర్వాతస్టేజీల్లోటికెట్ కొని ఎక్స్‌ప్రెస్సులు ఎక్కినవారుఎంతోసేపు నిల్చొని గమ్యం చేరే దుస్థితి వచ్చింది. పెరుగతున్న రద్దీ తట్టుకోటానికి అవసరమైన ట్రిప్పులు సంస్థ పెంచకపోవటంతో డబ్బులిచ్చి దెబ్బలుతిన్నట్లుగా వుందివారి పరిస్థితి. కనుక ఈ ఉచిత ప్రయాణాన్ని గతంలో వలె ఆర్డినరీ,పల్లె వెలుగు బస్సులకే కల్పిస్తే, ఆర్టీసీ నష్టాలు కొంత మేరకు తగ్గుతాయి. లేకపోతే పురుష ప్రయాణీకులపై మళ్లీ చార్జీల బాదుడు తప్పదు. ఇక నాన్ స్టాప్ బస్సుల్లో కండక్టర్ లేకుండా డ్రైవర్ ఒక్కడినే పంపించటం క్షేమం కాదు.జీతాలభారం ఎక్కువనిభావిస్తే తాత్కాలిక పద్ధతిపై కండక్టర్లని నియమిస్తే కొందరు పేద నిరుద్యోగులకు జీవనభృతి లభిస్తుంది,డ్రైవర్లకు అదనపుభారం తప్పుతుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### ఎవరికోసం ఈ స్వాతంత్ర్య వేడుకలు?

80 సంవత్సరాల స్వతంత్ర భారత్‌లో ఒక జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని పట్ల అంటరానితనమా సిగ్గుచేటు.ఇదేకదా సనాతనంలక్ష్యం?ఉత్తరాఖండ్‌లో నాలుగు రోజులక్రితం జరిగిన ఒక సభలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మాట్లాడి వెళ్లిన తరువాత, శ్రీరామ సేన బ్యాచ్ ఆప్రాంతాన్ని శుద్ధి చేశారట. ఈ విషయాన్ని ఆయన స్వయంగా రాజ్యసభలో ప్రకటించారు.

ఈరోజు మనం 80వ స్వతంత్ర సభలు జరుపుకున్నాం. ప్రధాని సమాధానం చెప్పాలి. ఈ సనాతనం బ్యాచ్‌ని అరెస్ట్ చెయ్యాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రి

హైదరాబాద్ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి నేటి నుండి అందుబాటులోకి ప్రజలకు సౌకర్యాలు కల్పించనుంది.రాష్ట్రంలో మధ్య తరగతి ప్రజలు నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల అనారోగ్యాల బారిన పడితే ఎలాంటి సంబంధిత వ్యాధులకు అయినా పూర్తి ఉచిత వైద్యం కల్పించనున్నారు. కావున ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

### నిజమైన స్వాతంత్ర్యం, గణతంత్రం ఎప్పుడు?

భారతదేశానికి స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15), గణతంత్ర దినోత్సవం (జనవరి26) అనేవి రెండు కళ్ల లాంటివి. బ్రిటీష్ వారి బానిస సంకెళ్లను తెంచి, దేశ ప్రజలకు స్వేచ్ఛను అందించడం కోసం ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారు.వారు అందించిన ఫలాలనే నేడు మనం అనుభవిస్తున్నాం. స్వాతంత్ర్యం అంటే పరాయి పాలన నుండి విముక్తి. గణతంత్రం అంటే ప్రజలే ప్రభువులుగా రాజ్యాంగబద్ధంగా పరిపాలించుకోవడం.కానీ నేటి పరిస్థితులు చూస్తుంటే ఆ మహనీయుల ఆశయాలు నెరవేరుతున్నాయా? అనే ప్రశ్న తలెత్తుతోంది. నేడు ఎన్నికల్లో ఓట్లను డబ్బులు, ఇతర ప్రలోభాలతో కొనుగోలు చేసి కొందరు ప్రజాప్రతినిధులు చట్టసభల్లోకి అడుగుపెడుతున్నారు. ప్రజలు కూడా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నిజాయితీ గల నాయకులను ఎన్నుకున్నప్పుడే చట్టసభలకు గౌరవం దక్కుతుంది.

- అలహరి వెంకటేష్, నెల్లూరు

### అత్యున్నత ప్రజా వేదిక

ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ కేవలం చట్టాలను ఆమోదించే వేదిక కాదు. దేశాన్ని ప్రభావితం చేసే కీలక అంశాలపై సమగ్ర చర్చ జరిగే అత్యున్నత ప్రజా వేదిక. అయితే ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు ఆశించిన స్థాయిలో ఫలప్రదంగా సాగకపోవడం ఆందోళన కలిగించే పరిణామం. రికార్డు కోసం 12 బిల్లులు ఆమోదమైనప్పటికీ, వాటిపై తగిన స్థాయిలో చర్చజరగకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణం కాదు. ఒక్కో బిల్లుకు సగటున పదిహేనునిమిషాల సమయం మాత్రమే కేటాయించడం చట్టాల నాణ్యతపై సహజంగానే ప్రశ్నలు రేకెత్తిస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కాంట్రాక్టు ఉద్యోగుల వయోపరిమితి పెంచాలి

ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు పబ్లిక్ సెక్టార్, సొసైటీస్, ప్రభుత్వ పరిధిలోనున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ విరమణ వయో పరిమితి 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచియున్నారు. కాని మోనటరీ బెనిఫిట్స్, పెన్షన్ సదుపాయాలు లేక ఈవయసులో కుటుంబ పోషణకు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న ఉన్నత విద్యావంతులు, అనుభవజ్ఞులైనకాంట్రాక్టుఉద్యోగుల వయోపరిమితి విషయంలో మాత్రం ఎన్ని వినతి పత్రాలిచ్చినా! చెవిటి వాని ముందు శంఖం ఊదినట్టు అధికారులుగాని, పాలకులు గాని చలించడం లేదు.

-డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ప్రజాస్వామ్యానికి వన్నె తెచ్చే 'ఓటు' వేయాలి

*చదువులు పెరిగాయి, సాంకేతికత పెరిగింది! అన్ని రకాల అభివృద్ధి పొందుతున్నాం! న్యాయంగా, నీతిగా ఉండాలనే జ్ఞానాన్ని చదువుల ద్వారా పొందిన, పొందుతున్న పౌరులు ప్రజాస్వామ్య పరిధిలో వ్యవహరించాల్సిన వారు, ఎందుకు నైతికతను కోల్పోతున్నారు? వారి ప్రతినిధులను ఎన్నుకోవటంలో ఎందుకు ప్రలోభాలకు లొంగి స్వలాభం చూసుకుంటున్నారు? ఓటర్లకూ బాధ్యత వుంది! ఆ బాధ్యత సక్రమంగా నిర్వహించాల్సిందే! ఆ నిజాన్ని కప్పిపెట్టలేరు! ప్రతి యుగంలోనూ ప్రజలు తమ లక్ష్యం గుర్తించినప్పుడే బాధ్యతతో వ్యవహరిస్తారు! లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేస్తే తమను తామే మోసగించుకొని కష్టాల పాలవుతారు! దారి కోల్పోయి నియంతలకు దారి చూపించిన వారవుతారు! మన దేశానికి చివరి నిముషంలోనైనా సరియైన దారిలో పంపిన చరిత్ర ఉంది! ఆ నిజాన్ని ఈనాటి వారు నిజం చేయాలి!*



రావులపాటి సీతారాంరావు

ఎనభైవ సంవత్సర స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా దేశమంతటా జరుపుకున్ననేపథ్యంలో కొన్ని నిజాలు, పరిణామాలు విశ్లేషించుకోవాల్సిన అవసరం ఏర్పడింది! 80వ సంవత్సరం నిండిన ఈ స్వతంత్ర భారత దేశం సాంకేతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, ప్రజాస్వామ్య దేశంగా ఈ గ్లోబల్ వ్యవస్థలో నిలదొక్కుకున్న మాట నిజం! అయితే కొన్ని లోటుపాట్లు, ఒడిదుడుకులూ, చిన్నపాటి యుద్ధాలు పాకిస్థాన్తో ముగియని వైరం చైనాతో చిటపటలు ఇంకా సాగుతునే వున్నాయి! ఇతర దేశాలతో ముఖ్యంగా మన ఇరుగు పొరుగు దేశాలతో పోల్చుకుంటే మన దేశం ఎంతో మెరుగైన స్థాయిలో వున్న నిజాన్ని ఎవరూ కాదనలేరు! యూరప్ దేశాలతో, దక్షిణ పశ్చిమ ఆసియా దేశాలతో పెద్దగా విభేదాలను ఎదుర్కొన్న పరిస్థితులు లేవు! అక్కడో ఇక్కడో పొరపొచ్చాలు కొన్ని తొంగి చూసినా, పాలకుల సర్దుబాటు చర్యలతో సమసి పోయాయి! బంగ్లాదేశ్ ఒకప్పటి అధినేత షేక్ హసీనా, అల జడులతో తన దేశం వదిలి మన దేశంలో వుండటం, అల నాటి దలైలామా పరిస్థితిని జ్ఞప్తికి తెస్తున్నది! భారత్ కున్న విశాలత్వం ఆశ్రయం కోరిన వారిని అక్కున చేర్చుకొనేతత్వం చాలా తక్కువస్థాయిలో ఇతర దేశాలలో వున్నమాట నిజం!

ఆర్థికంగా భారత్ కొత్త పుంతలలో పయనించేందుకు సిద్ధంగా వుంది! అయితే ఈమధ్య జరిగిన ఇరాన్ ఇజ్రాయిల్, అమెరికా, రష్యా, ఉక్రెయిన్ సంఘర్షణల వల్ల చమురును నిల్వలుగా వుంచుకోవటం భారమైంది. దిగుమతి చేసుకోటానికి ధరలు కొండెక్కాయి. జలసంధి వివాదంతో ఆయిల్ రవాణా చేసే షిప్పుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది! ఆర్థికంగా క్రమేపీ గడ్డు పరిస్థితి అంచనాలకు అందకుండా వుంది! జనాభా పెరుగుదల వల్ల మన దేశం చైనానుసంఖ్యలో అధిగమించింది. కానీ జనాభా పెరుగుదల కూడా ఆర్థికంగా ఉన్నత దశలో దేశం లేనప్పుడు అదీ సమస్యగానే మారుతుంది! నిరుద్యోగ సమస్య నిన్నా,మొన్నా జరిగిన జెన్‌జి ఉద్యమంతో ప్రాథమిక సమస్యగా మారి విద్యా విధానంలో కూడా మార్పు తేవాలనే ఆలోచనను ముందుకు తెచ్చింది! తెలుగు రాష్ట్రాల్లో ఈమధ్య ఉద్యోగాలకు సంబంధించిన అంశం ప్రాముఖ్యతను సంతరించుకున్న నేపథ్యంలో మంచీ చెడుల ప్రసక్తి తేక తప్పదు! రాజకీయానికే ప్రాముఖ్యతను ఇచ్చే పార్టీల హడావిడి, కొన్ని వేలమంది ఉద్యోగస్థులుగా మారిన తరుణంలో ప్రజలు ఏవిధంగాఅర్థం చేసుకుంటారో చూడాలి! ఇలాంటి వాటివల్ల అన్ని రాష్ట్రాలలోకి నిరుద్యోగ సమస్యను ప్రభుత్వాలు చొరవచూపి పరిష్కరించటంలో వెనుకంజ వేసే ప్రమాదం గూడా వుంది! రాజకీయం కాదు ముఖ్యం అనుకొని ప్రజలు, మేధావులు గూడా చొరవచూపి తప్పును తప్పుగా, ఒప్పును ఒప్పుగా చూపించకపోతే నిరుద్యోగ సమస్య మరింత జటిలమవు




తుంది! ఇవన్నీ ఒక ఎత్తు. ప్రజాస్వామ్య పరిధులలో పాలకులు వ్యవహరించాలన్నది మరొక ఎత్తు! పాలక వర్గంలోనివారు ప్రతిపక్ష వర్గంలోని వారు శత్రువులేం కారు! ఎన్నికలలో పోటీ చేసేంతవరకే ప్రత్యర్థులు! ఎన్నికల తర్వాత సమస్యల్లో న్యాయం జరగకపోతే పోరాడాల్సింది ప్రతిపక్ష నాయకులు! పరిష్కరించాల్సింది పాలకులు! అంత వరకే! అంతేగాని, ఫ్యాక్షనిస్టుల మాదిరి మాటల తూటాలు పేల్చుకుంటూ, ఆగర్భ శత్రువుల్లా వ్యవహరించటం ప్రజాస్వామ్యం ఒప్పుకోదు! ఎవరికి ఎక్కువ సంఖ్యలో ఓట్లుపడితే న్యాయబద్ధంగా వారు పాలన సాగించాలి! అంతేగాని అర్థం పర్థం లేకుండా ఓడిన వారు గెలిచిన వారిని 'దిగిపో' అంటే చట్టం ఒప్పుకోదు! ఆ మాత్రం ఇంగిత జ్ఞానంతో అన్ని పక్షాలూ ప్రజాస్వామ్య పాలనలో వ్యవహరించాలి! ఆ నిజాన్ని అందరూ ఒప్పుకోక తప్పదు! అధికారం ఉంది కదా అని ప్రతిపక్షం సహేతుకంగా వ్యవహరిస్తున్నా వారి గొంతు బయట వినపడనీయకుండా చేసినా, చట్టం చూసీచూడనట్లు ఉండొచ్చు కానీ చట్ట సభలల్లో ఆ ప్రవర్తనను ప్రదర్శిస్తే అది ఎవరు చేసినా తీవ్రంగా పరిగణించక తప్పదు! పోతే చట్ట సభలలో శాంతిగా వ్యవహరించటం భద్రతా పరంగా ప్రవర్తన అదుపులో ఉంచుకోక వారు చట్ట సభలల్లో పాల్గొనటానికి అనర్హులు! ఆ నిజం ఒప్పుకోక తప్పదు! సరియైన చర్యలు అవశ్యం తప్పదు! కేవలం చట్ట సభల ప్రతినిధులే కాదు ఈ నిజాన్ని జ్యుడిషియరీ పాలనా యంత్రాంగంకూడా కాదనలేదు! ఈమధ్య కాలంలో న్యాయ వ్యవస్థలు విమర్శలకు తావిస్తున్నాయని విజ్ఞులు భావిస్తున్నారు. న్యాయం చెప్పాల్సిన వారే న్యాయ పరిధులలో ఉండకపోతే కంచే చేను మేసినట్లు భావించక తప్పదు! ఆ నిజాన్ని సంబంధించిన వారు ఒప్పుకోవాల్సిందే! న్యాయ సమ్మతంగా వుండాలి! న్యాయ పరిధిలో వ్యవహరించాల్సిన బాధ్యత వారిమీదే ఉందని గుర్తించాలి. కేవలం ప్రభుత్వ అంగాలనే ప్రతి విషయంలోనూ తప్పు పట్టటం కూడా సరికాదు! ప్రజలు గూడా ఈ ప్రజాస్వామ్య పాలనలో బాధ్యులే! రాజకీయ నైతికత ఈమధ్య కాలంలో ప్రజలు క్రమ క్రమంగా కోల్పోతున్నారు. చదువులేనివారు గ్రామాల్లో వుండే ప్రజలు ఓట్ల విషయంలో ఎన్నికల విషయంలో ఇంతకు మునుపు ఎంతో నీతిమంతులుగా వుండేవారు! ప్రలోభాలకు లొంగి పోకుండా ఓటును పవిత్రంగా చూడటమే కాదు దానిని సక్రమంగా నచ్చిన రీతిలో వాడుకొని ప్రజాస్వామ్యానికి వన్నె తేవటమే కాదు మెరుగులు దిద్దేవారు! ఇప్పుడు ఆ విజ్ఞత ఎందుకు కోల్పోతున్నారు!? చదువులు పెరిగాయి సాంకేతికత పెరిగింది! అన్ని రకాల అభివృద్ధి పొందుతున్నాం! న్యాయంగా, నీతిగా ఉండాలనే జ్ఞానాన్ని చదువుల ద్వారా పొందిన,పొందుతున్న పౌరులు ప్రజాస్వామ్య పరిధిలో వ్యవహరించాల్సిన వారు, ఎందుకు నైతికతను కోల్పోతున్నారు? వారి ప్రతినిధులను ఎన్నుకోవటంలో ఎందుకు ప్రలోభాలకు లొంగి స్వలాభం చూసుకుంటున్నారు? ఓటర్లకూ బాధ్యత వుంది! ఆ బాధ్యత సక్రమంగా నిర్వహించాల్సిందే! ఆ నిజాన్ని కప్పిపెట్టలేరు! ప్రతి యుగంలోనూ ప్రజలు తమ లక్ష్యం గుర్తించినప్పుడే బాధ్యతతో వ్యవహరిస్తారు! లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేస్తే తమను తామే మోసగించుకొని కష్టాల పాలవుతారు!దారి కోల్పోయి నియంతలకు దారి చూపించిన వారవుతారు! మన దేశానికి చివరి నిముషంలో

# సామాజిక న్యాయానికి స్ఫూర్తి సర్దార్ సర్వాయి పాపన్న

డా. బండి సాయన్న గౌడ్

నేటి తరానికి రాజ్యాధికార చైతన్యం' ఆగస్టు 18,2026 మంగళవారం హైదరాబాద్ ట్యాంక్బండ్పై ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. సుమారు 376 సంవత్సరాల క్రితం, 1650 ఆగస్టు 18న తెలంగాణ గడ్డపైఒక మహోన్నత వ్యక్తిత్వం ఆవిర్భవించింది. ఆయనే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. సామాన్య కుటుంబంలోజన్మించి, తన కాలంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను ప్రశ్నిస్తూ, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడిగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. పాపన్న కేవలం ఒక యుద్ధ వీరుడు కాదు. కోటలను జయించిన సైనిక నాయకుడిగా మాత్రమే ఆయనను చూడటం ఆయన చారిత్రక ప్రాధాన్యతను పరిమితం చేయడమే అవుతుంది. గోల్కొండ కోటను ఏలిన బహుజన చక్రవర్తిగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలను సమీకరించి, అప్పటి ఆధిపత్య వ్యవస్థలను సవాలు చేసిన ప్రజా నాయకుడిగా ఆయన తెలంగాణ ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన గాథలో ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా భాగస్వామ్యం, అధికారంలో భాగస్వామ్యం వంటి విలువలు అంతర్లీనంగా కనిపిస్తాయి. 17వ శతాబ్దంలోనే సామాజికంగా వెనుకబడిన, అణగారిన వర్గాల ప్రజలను ఏకం చేసి తన పోరాటానికి పునాది వేసిన పాపన్న, అధికారం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండాల్సిన అవసరం లేదని తన కార్యాచరణద్వారా చాటిచెప్పిన ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారు. మనిషికి గౌరవం ఉండాలి. అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడాలి.అణగారిన వర్గాలకు అవకాశాలు కల్పించాలి. అధికారంలో అందరికీ భాగస్వామ్యం ఉండాలన్నారు. అందుకే నేటికీ బహుజన సమాజానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక చారిత్రక వీరుడు మాత్రమే కాదు, ఆత్మ గౌరవానికి ప్రతీక,సామాజిక న్యాయానికి స్ఫూర్తి, సమానత్వానికి చిహ్నం. గోల్కొండతో సహా అనేక కోటలపై తన ప్రభావాన్ని స్థాపించిన పాపన్న సైనిక ప్రతిభతో పాటుతన కాలంలోని రాజకీయ వ్యవస్థ లను సవాలు చేసిన నాయకుడిగా చరిత్రలో నిలిచారు. ఆయనతో అనుబంధం ఉన్న ఖిలాషాపూర్ కోటను చారిత్రక వారసత్వ కట్టడంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టడం కూడా ఆయన చారిత్రకప్రాధాన్యతకు నిదర్శనం. నేడు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో సామాజిక న్యాయం గురించి విస్తృతమైన చర్చ జరుగుతోంది. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, ప్రజా సంఘాలు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రాతినిధ్యం, వెనుకబడిన వర్గాల అభివృద్ధి వంటి అంశాలను ప్రస్తావి స్తున్నాయి. అయితే సామాజిక న్యాయం కేవలం ఎన్నికల నినాదంగా మిగిలిపోకూడదు. సామాజిక న్యాయం అంటే ప్రతికులానికి సమాన గౌరవం, అవకాశాల్లో సమానత్వం, అధికారంలో తగినప్రాతినిధ్యం, వనరులపై న్యాయమైన వాటా, అణగారిన వారికి ఆత్మ గౌరవంతో జీవించే హక్కు. ఈ విలువలు విధానాల్లో, పరిపాలనలో, బడ్జెట్ కేటాయింపుల్లో, విద్యా-ఉద్యోగ అవకాశాల్లో, రాజకీయ ప్రాతినిధ్యంలో ప్రతిబింబించినప్పుడే సామాజిక న్యాయానికి నిజమైన అర్థంవస్తుంది. బహుజన సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం నేటి తరానికి ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. నిబద్ధత ఉంటే సాధించలేనిది లేదు. పట్టుదలఉంటే మార్పు సాధ్యమే.ఐక్యత ఉంటే చరిత్రను మార్చగలం. ఆత్మగౌరవంఉంటే అన్యాయాన్ని ప్రశ్నించగలం. పాపన్నలో ఉన్న నిబద్ధత, పట్టుదల, పోరాటస్ఫూర్తి, ఆత్మగౌరవం, అధికార భాగస్వామ్య ఆకాంక్షలను నేటితరం అర్థంచేసుకోవాలి. ఇది ఎవరినీ వ్యతిరేకిం చడానికి పిలుపు కాదు.ఇది ఎవరిపైనా ద్వేషాన్ని పెంచడా నికి పిలుపు కాదు. ఇది ప్రజాస్వామ్య పద్ధతుల్లో సమాన హక్కులు, సమానావకాశాలు,సమాన ప్రాతినిధ్యం సాధిం చేందుకు చైతన్యమయ్యే పిలుపు. ఈ ప్రశ్నను ప్రతి బహు జన కుటుంబం, ప్రతి యువకుడు, ప్రతి విద్యార్థి, ప్రతి సామాజిక కార్యకర్త, ప్రతి ప్రజా ప్రతినిధి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. నేటి ప్రజాస్వామ్యంలో 'రాజ్యాధికారం' అంటే కేవలం అధికార కుర్చీని పొందడం కాదు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం, ప్రజల కోసం విధానాలు రూపొందించడం, పరిపాలనలో భాగస్వామ్యం కావడం,విద్య,ఉద్యోగం,వ్యాపారం, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలను సాధించడం ఇవన్నీ ప్రజాస్వామ్య రాజ్యాధికారంలో భాగమే. అందువల్ల బహుజన సమాజం విద్యలో,ఉద్యోగాల్లో, వ్యాపారంలో, రాజకీయాల్లో, పరిపాలనలో, ఆర్థిక రంగంలో తన భాగస్వామ్యాన్ని పెంచుకోవాలి. రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నేటి తరం నిర్ణయాత్మకంగా ముందుకుసాగాలి. రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ, ప్రజాస్వామ్య మార్గంలో చైతన్యంతో, సంఘటితంగా తమ హక్కులను సాధించుకోవాలి. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను స్మరించుకోవడం అంటే కేవలం జయంతి వేడుకలు నిర్వహించడం కాదు. ఆయన ఆశయాలను అర్థం చేసుకోవాలి. ఆయన ఆత్మగౌరవాన్ని ఆచరణలో పెట్టాలి. ●



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

# స్మార్ట్ రేషన్ కార్డు సరే! మరి పౌర సరఫరాలు?



శ్రీశైలం దూడం

పేదవాడి చేతిలోకి వస్తున్న కొత్త స్మార్ట్ ఫుడ్ సెక్యూరిటీ కార్డుకేవలం ప్లాస్టిక్ ముక్క కాదు. అదిఆహార హక్కుకు, ఆత్మగౌరవానికి గుర్తు. ఆగస్టు 15 నుంచి కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభమైంది. క్యూఆర్ కోడ్, వాటర్‌ప్రూఫ్ పీవీసీ, భద్రతా లక్షణాలతో కార్డును ఆధునికీకరించడం స్వాగతించాల్సిందే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా పేదవాడు ఎవరి ముందు చేయి చాచకుండా ఆకలి తీర్చుకునే హక్కుకు ఈ కార్డు ప్రతీక కావాలి. ముఖ్యమంత్రి మరో విషయాన్ని చెప్పారు. గతంలో దొడ్డు బియ్యాన్ని కొందరు లబ్ధిదారులు వినియోగించకుండా ఇతర అవసరాలకు మళ్లించేవారని, ఇప్పుడు 48 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది.నాణ్యమైన బియ్యం పేదల ఇంటి అవసరానికి చేరడం నిజంగా మార్పే అయితే స్వాగతించాలి. కానీ ఆ మార్పు ప్రతి అర్హత కుటుంబం గడప వరకు చేరుతోందా? అన్నదే అసలుపరీక్ష. కార్డుపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు ఉండి ప్రధాని ఫొటో లేకపోవడంపై బీజేపీ ప్రశ్నిస్తోంది. కేంద్రం ఐదుకిలోల ఉచిత ఆహార ధాన్యం అందిస్తోందని, రాష్ట్రం అదనంగా సన్నబియ్యం ఇస్తోందని చెబుతున్నప్పుడు ప్రజలకు కావాల్సింది బొమ్మల గొడవ కాదు. కేంద్రం ఎంత? రాష్ట్రం ఎంత? అన్న స్పష్టమైన లెక్క.భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా కార్డుపై పునరాలోచిస్తే వివాదానికి తెరపడుతుంది. డీలర్ కమిషన్ విషయంలోనూ ప్రభుత్వం తాజా లెక్కలు బయటపెట్టాలి. 2023లో టన్నుకు రూ.1,400కమిషన్ నిర్ణయించినప్పుడు కేంద్రం రూ.450, రాష్ట్రం రూ.950 భరించే విధానం ఉంది. ఇప్పుడు 2026 ప్రస్తుతం డీలర్‌కు ఎంత? కేంద్రం వాటా ఎంత? రాష్ట్రం వాటా ఎంత? బకాయిలెంత? అన్నది పౌరసరఫరాల శాఖ స్పష్టం చేయాలి. ఇతర రాష్ట్రాల్లో డీలర్లకు చెల్లిస్తున్న కమిషన్‌తో పోల్చి తెలంగాణ పరిస్థితినీ ప్రజల ముందుంచాలి. అసలు కనువిప్పు కలిగించాల్సిన సమస్య రేషన్ దుకాణం దగ్గరే ఉంది. వృద్ధుల వేలిముద్రలు పడక గంటల తరబడి మళ్లీ మళ్లీ ప్రయత్నించాల్సి వస్తోంది. వినియోగదారుడికీ, డీలర్‌కీ ఇబ్బందే. స్మార్ట్ కార్డు ఇచ్చి స్మార్ట్ సమస్యలుసృష్టించడం ఎందుకు? వేలిముద్ర విఫలమైతే ప్రతి రేషన్ దుకాణంలో ఐరిస్ స్కానింగ్ సౌకర్యం తప్పనిసరి చేయాలి. సాంకేతిక వైఫల్యం కారణంగా అర్హుడి రేషన్ ఆగకూడదు. ఇంకో మానవీయ ప్రశ్న ఉంది. ఇంటి నుంచి బయటకు వెళ్లలేని వృద్ధ దంపతులు, మంచానికే పరిమితమైన వికలాంగులు, కుటుంబ సభ్యులు అందుబాటులో లేని ఒంటరి వృద్ధులు రేషన్ దుకాణానికి ఎలా వస్తారు? పింఛన్ గడప వద్దకు అందించే విధానం ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో రేషన్‌ను కూడా వారి గడప వద్దకే చేర్చే ప్రత్యేక వ్యవస్థ




ఎందుకు ఉండకూడదు? అధీకృత ప్రతినిధి లేదా ప్రత్యేక మొబైల్ పంపిణీ ద్వారా సరఫరా చేయాలి. కుటుంబ సభ్యులు ఎవరూ అందుబాటులో లేకపోతే ప్రభుత్వం లేదా గ్రామస్థాయి యంత్రాంగం బాధ్యత తీసుకోవాలి. సంక్షేమాన్ని ప్రకటించడం ప్రభుత్వ విజయం కాదు. అది అర్హుడైన చివరి లబ్ధిదారుడి గడప దాటి చేరినప్పుడే ప్రభుత్వపనితీరు కొలవాలి. పౌరసరఫరాల శాఖ దగ్గర మరో లెక్క కూడా స్పష్టంగా ఉండాలి. రాష్ట్రంలో పాత కార్డులు ఎన్ని, కొత్తగా మంజూరైనవి ఎన్ని, తొలగించినవి ఎన్ని, పెండింగ్ దరఖాస్తులు ఎన్ని, కొత్త కార్డుల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు ఎన్ని? అనే గణాంకాలను జిల్లాల వారీగా విడుదల చేయాలి. కార్డు ఇచ్చామని ప్రకటించడం ఒకటైతే, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కార్డు చేరడం మరోటి. సన్న బియ్యం పంపిణీపైనా ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలి. 48 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం ఇస్తున్నప్పుడు నెలకు ఎంత ధాన్యం అవసరం? కొనుగోలు, మిల్లింగ్, రవాణా, నిల్వ, పంపిణీతో కలిపి ప్రభుత్వంపై పడే భారం ఎంత? కేంద్రం అందించే ఐదు కిలోల ధాన్యంతో రాష్ట్రం అందించే అదనపు కిలో ఎలా కలుస్తోంది? ఈ లెక్కలు బయటపెడితే పథకం విలువ మరింత స్పష్టమవుతుంది. రేషన్ వ్యవస్థలో మార్పు అంటే కార్డు రూపం మార్చడం మాత్రమే కాదు. అర్హత గుర్తింపు నుంచి ధాన్యం కొనుగోలు వరకు, గోదాము నుంచి డీలర్ దుకాణం వరకు, అక్కడి నుంచి లబ్ధిదారుడి గడప వరకు ప్రతి దశను పౌరసరఫరాల శాఖ పర్యవేక్షించాలి. నెలవారీగా జిల్లాల వారీగా పంపిణీ, మిగులు, తిరస్కరణలు, బయోమెట్రిక్ విఫలతలు, ఫిర్యాదు ల పరిష్కారంపై ప్రజలకు డ్యాష్‌బోర్డు తరహాలో వివరాలు అందుబాటులో ఉంచాలి. అప్పుడు బొమ్మలపై జరిగే రాజ కీయ వివాదాలకంటే సేవలపై ప్రజల తీర్పే ముఖ్యమవుతుం ది. రేషన్ దుకాణంలో వృద్ధులకు ప్రత్యేక క్యూలు, వికలాం గులకు ప్రాధాన్యత, యంత్రం పనిచేయని రోజుల్లో ప్రత్యా మ్నాయ ధృవీకరణ వంటి ఏర్పాట్లుకూడా తప్పనిసరి కావా లి. డీలర్‌ను కూడా సమస్యల మధ్య ఒంటరిగా వదిలేయ కూడదు. వేలిముద్రలు పడకపోయినా, నెట్‌వర్క్ పనిచేయకపోయినా, యంత్రం మొరాయించినా వినియోగదారుడి ఆగ్రహాన్ని డీలరే ఎదుర్కొంటాడు. అందుకే న్యాయమైన కమిషన్‌తో పాటు పరికరాల నిర్వహణ, ఇంటర్నెట్, విద్యుత్‌వంటి సాంకేతిక సమస్యలకు ప్రభుత్వం ప్రత్యేక బాధ్యత తీసుకోవాలి. ప్రజల హక్కు పొందడానికి మధ్యవర్తి అవసరం లేని వ్యవస్థను నిర్మించాలి. ఫిర్యాదు చేస్తే సమయపరిమితిలో పరిష్కారం చూపాలి. తప్పిదం జరిగితే బాధ్యులపై చర్య ఉండాలి. పేదవాడి చేతిలోని కార్డు ఆకలి ముందు పనిచేస్తుందా? అన్నదే ప్రభుత్వానికి అసలు పరీక్ష. కేంద్రం తన వాటా చెప్పాలి. రాష్ట్రం తనవాటా చెప్పాలి. డీలర్ కమిషన్ చెప్పాలి. సన్నబియ్యం వ్యయం చెప్పాలి. కార్డు తయారీ ఖర్చు చెప్పాలి. అప్పుడు ప్రజలే ఎవరి పాత్ర ఎంతన్నది నిర్ణయిస్తారు. వేలిముద్ర విఫలమైతే ఐరిస్ రావాలి. గడప దాటలేని వృద్ధుడి గడపకే రేషన్ చేరాలి. అప్పుడే స్మార్ట్ కార్డు నిజమైన ఆత్మగౌరవ పత్రం అవుతుంది. లేకపోతే

MN 5 PAGE-GNTffff :MN 5 PAGE-GNT 01/01/2001 09:55 Page 1




# గుంటూరు వార్త

## ప్రజల ఫిర్యాదులు పునరావృతం కాకుండా
# శాశ్వత పరిష్కారించాలి

**నగర కమిషనర్ కె.మయూర్ అశోక్**

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పిజిఆర్ఎస్ కు ప్రజల నుండి అందే ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కరించి, అవి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ నగర పాలక సంస్థ విభాగాధిపతులను ఆదేశించారు. ఫిర్యాదుల పై తక్షణ స్పందన ఉండాలన్నారు. అర్జీల్లో ఏదైనా సమస్య పరిష్కారానికి సాంకేతిక




సోమవారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను నేరుగా స్వీకరించారు. నగర ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పిజిఆర్ఎస్ ఇతర వేదికల ద్వారా ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కార పురోగతిపై విభాగాధిపతులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారు సంతృప్తి చెందేలా పనులు జరగాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పారిశుధ్యం, డ్రైనేజ్ సమస్యలు, త్రాగునీటి సరఫరా మరియు వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురైతే, ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి వివరించి, ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ ద్వారా 37 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 7, ఇంజనీరింగ్ విభాగం 17, రెవెన్యూ విభాగం 8, ప్రజారోగ్య విభాగం 2, ఉపా సెల్ విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 2 ఫిర్యాదులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కిషోర్, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఏసి తిరుపతి నాయుడు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

# న్యాయ విద్యార్థులు మేధో సంపత్తిని మెరుగుపర్చుకోవాలి

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మేధోసంపత్తి కారణంగా మన ఆలోచనకి ఊహించనంత ధనార్జనతో పాటు చట్టపరమైన రక్షణ కూడా లభిస్తుందని ప్రముఖ అంతర్జాతీయ స్థాయిలో అనేక సంస్థలకు అధిపతిగా వ్యవహరించిన శివకుమార్ ప్రత్యేక అతిథిగా ప్రసంగించారు. భౌతిక, మేధోపరమైన ఆస్తులకు ఉన్న తేడాలను విశదీకరించారు.



న్యాయవాది శివకుమార్ గోపీనాథమ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో న్యాయ విద్యార్థులు మేధోసంపత్తిని మెరుగుపర్చుకోవాలని యువ న్యాయ విద్యార్థులకు సూచించారు. ఏఎన్యులోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ లీగల్ స్టడీస్ విభాగంలో సోమవారం ఆచార్యత్వ దృక్పథంతో మేధోసంపత్తి పరిచయం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అమెరికా వంటి దేశాల్లో న్యాయవిద్య పూర్తిచేసుకుని అలాగే మన దేశ వ్యాపారాలలో మేధోసంపత్తి అనేది ఎంత ముఖ్యమైనపాత్ర పోషిస్తుందో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.విజయలక్ష్మి, విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, డాక్టర్ రమాకోటి రెడ్డి, రామకృష్ణ బాబా,పి. కుమారి, గోపీనాథన్, చెన్నారావు, దినకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# కుళ్లిన స్థితిలో యువకుడి మృతదేహం లభ్యం

**తెనాలి ఆగస్ట్ 17,(ప్రభాతవార్త):** తెనాలి ఐతానగర్ లెక్చరర్స్ కాలనీలో కుళ్ళిపోయిన స్థితిలో మృతదేహం కలకలం రేపింది .ఇది హత్యా? ఆత్మహత్యా? ఇతర కారణాలా?అనేది తెలియాల్సి ఉంది.పోలీసుల కథనం ప్రకారం,పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐతానగర్ లెక్చరర్స్ కాలనీలో కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమవడంతో కలకలం రేగింది.లెక్చరర్స్ కాలనీ వద్ద ప్లాట్లు వద్ద రెల్లు గడ్డి తొలిగించే క్రమంలో కుళ్ళిన దశలో ఉన్న మగ శవాన్ని స్థానికులు గుర్తించారు. ఆదివారం రాత్రి సుమారు 10:30 సమయంలోసమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు.మృతుడు వయస్సుసుమారు 20 ఏళ్ళు ఉండొచ్చని



పోలీసులు భావిస్తున్నారు .దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని పోలీసులు మూటకట్టి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సిఐ రవీంద్రబాబు తెలిపారు.మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సివుంది. ఈ ఘటనపై హత్య జరిగిందా? లేక ఇతర కారణాలతో మృతి చెందాడా? అనే కోణాల్లో టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడి గుర్తింపు కోసం టు టౌన్ సిఐ, ఎస్సై లలిత్ కుమార్ వివరాలు సేకరిస్తున్నారు.

# 25వ రోజుకు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల దీక్షలు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్17, ప్రభాతవార్త:** ఏఎన్యులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల బృందం చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి తమ సమస్యల పరిష్కారం కోసం 26రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామన్నారు. వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ గతంలో ఆమోదించిన యూజిసి పే




26వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలేదీక్షల్లో అసోసియేషన్ అధ్యక్ష్య, ఉపాధ్యక్షులు డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ పి.రవి, కోశాధికారి డా. తౌసిఫ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఎం.గోపీకృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సునీత, డాక్టర్ పుణ్యశేఖర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ విజయ్కిషోర్ తదితరులు పాల్గొన్నారు. స్కేల్ను వెంటనే మాకు వర్తింప చేయాలన్నారు. మా సేవలను ప్రభుత్వ ఉత్వర్వ్యుల ప్రకారం చర్చించి తమ సర్వీసులను క్రమబద్ధీకరించి మాకు న్యాయం చేయాలని విన్నవించారు. తమ వేతనాల పెంపుకోసం నియమించిన కమిటీ సిఫార్సులను అమలుచేయాలని విజ్ఞప్తిచేశారు.

# జూడా సమ్మె అత్యవసర దశకు..

## సేవలకు పీజీ వైద్యుల విరామం

**చర్చలు విఫలం..**
**మూడో దశలోకి రాష్ట్రవ్యాప్త సమ్మె...**
**గుంటూరులో 15 మందితో నాలుగో రోజు రిలే నిరాహార దీక్ష**
**జూడా ఆందోళనకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంఘీభావం..**

**గుంటూరు మెడికల్ ,ఆగస్టు 17:(ప్రభాతవార్త )**

పీజీ వైద్యులకు సముచితమైన ఉపకార వేతనం పెంపుతోపాటు ఇతర న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మె సోమవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. మూడో దశ ఆందోళన తొలిరోజు కావడంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో జూనియర్ వైద్యులు అత్యవసర సేవల నుంచి కూడా వైదొలిగారు.ఇప్పటివరకు అత్యవసరం కాని వైద్య సేవలను మాత్రమే నిలిపివేసిన జూనియర్ వైద్యులు అత్యవసర వైద్య సేవలను యథావిధిగా అందించారు. అయితే ఆగస్టు 11న ప్రభుత్వ అధికారులతో జరిగిన చర్చలు విఫలం



కావడంతోపాటు, తదుపరి చర్చలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పిలుపు రాకపోవడంతో మూడో దశ ఆందోళనకు శ్రీకారం చుట్టారు.

**గుంటూరులో కొనసాగిన ఆందోళ..**

గుంటూరు వైద్య కళాశాలలో అంతర్గత వైద్య శిక్షణార్థులు, పీజీ వైద్యులు, ప్రత్యేక వైద్య విభాగాల పీజీ వైద్యులు, సీనియర్ నివాస వైద్యులు సమ్మెలో పాల్గొన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల పర్యవేక్షకుల కార్యాలయం సమీపంలో ఆందోళన కొనసాగించారు.

సమ్మెలో భాగంగా చేపట్టిన స్వచ్ఛంద రిలే నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరుకుంది. సోమవారం 15 మంది పీజీ వైద్యులు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు దీక్షలో పాల్గొన్నారు.

**జూనియర్ వైద్యులకు వైద్యుల సంఘం మద్దతు**

జూనియర్ వైద్యుల ఆందోళనకు భారత వైద్యుల సంఘం గుంటూరు విభాగం ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. ఆందోళన శిబిరాన్ని సందర్శించిన వారిలో మాజీ అధ్యక్షుడు, మాజీ వైద్య మండలి సభ్యుడు డాక్టర్ నాగళ్ల కిశోర్, గుంటూరు విభాగం అధ్యక్షుడు డాక్టర్ సేవా కుమార్, కార్యదర్శి, జీర్ణకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ సాయి కృష్ణ, చెవి-ముక్కు-గొంతు వైద్య నిపుణుడు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నరాల వైద్య నిపుణుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు డాక్టర్ రాజేంద్ర ఉన్నారు.

జూనియర్ వైద్యులు తమ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న పోరాటానికి వైద్య సమాజం ఐక్యంగా అండగా నిలవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. సముచితమైన ఉపకార వేతనం పెంపు కోసం జూనియర్ వైద్యులు చేస్తున్న డిమాండ్కు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

జాతీయ వైద్య మండలి నిబంధనల ప్రకారం ఎంఎస్సీ, పీహెచ్డీ అర్హత కలిగిన అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని వారు కోరారు. వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంపును వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. వైద్యులపై దాడులను అరికట్టడంతోపాటు అనర్హుల వైద్య చర్యలను నిరోధించే చర్యలను మరింత బలోపేతం చేయాలని కోరారు.

**సృజనాత్మక నిరస..**

ఆందోళనలో భాగంగా సోమవారం కళలు, చిత్రలేఖన కార్యక్రమాన్ని నిర్వహించారు. జూనియర్ వైద్యులు తమ డిమాండ్లు, నిరసన భావాలను చిత్రాలు, కళారూపాల ద్వారా వ్యక్తం




చేశారు.ఆందోళన తీవ్రతరం కావడంతో రోగులకు కలుగుతున్న అసౌకర్యానికి జూనియర్ వైద్యుల సంఘం విచారం వ్యక్తం చేసింది. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు వస్తే స్నేహపూర్వకంగా, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సంఘం ప్రకటించింది. ప్రభుత్వం జూనియర్ వైద్యుల డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని కోరింది. సమస్య పరిష్కారమై సమ్మె విరమించి, తిరిగి పూర్తి స్థాయిలో రోగులకు వైద్య సేవలు అందించే అవకాశం లభించాలని ఆకాంక్షించింది.

# రేపల్లె ఆర్డీవోకు సత్కారం

**రేపల్లె, ఆగస్టు 17, ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా ఉత్తమ ఆర్డీవోగా అవార్డు అందుకున్న రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవిని సోమవారం ఘనంగా సత్కరించారు.రెవెన్యూ పరిపాలనలో ఉత్తమ సేవలు అందించినందుకు ఉత్తమ రెవెన్యూ డివిజనల్ అధికారిగా జిల్లా కలెక్టర్ వినోద్కుమార్ చేతుల మీదుగా అవార్డు,ప్రశంసా పత్రం అందుకున్న శ్రీదేవిని ఆర్డీవో కార్యాలయం ఉద్యోగులు సన్మానించారు.జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో డిఎవో కరుణ్కుమార్,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# నగరంలో వ్యాపార దుకాణాలపై ప్రజారోగ్య విభాగం అధికారులు దాడులు

**-నిషేధిత ప్లాస్టిక్ వినియోగించే వ్యాపారాల నుంచి భారీ అపరాధ రుసుము వసూలు**

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 17,ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో ప్రజారోగ్య, పర్యావరణ పరిరక్షణకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం పూర్తి స్థాయిలో అమలులో ఉందని, ప్రజారోగ్య విభాధిపతులు ఎస్ఎస్ లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ అపరాధ రుసుంని స్వచ్ఛ యాప్ ద్వారా విధించాలని నగర కమిషనర్ మయూర్ అశోక్ స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ ఆదేశాల మేరకు సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ ఆధ్వర్యంలో ప్రజారోగ్య అధికారులు పట్నం బజార్, లాలాపేట, కోరేటేపాడు, బృందావన్ గార్డెన్స్ వంటి వివిధ ప్రాంతాలతోపాటు అన్ని వార్డ్ ల్లోని 98 దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలను అడ్డుకొని,42 కేజీల ప్లాస్టిక్ ని సీజ్ చేసి, వారికి రూ.27 వేలు అపరాధ రుసుం విధించారు.గుంటూరు కార్పొరేషన్ పరిధిలో సోమవారం (17వ తేదీ) నుండే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్ అమలులో ఉందని, విక్రయదారులు, వ్యాపార సముదాయాల యజమానులు వినియోగాన్ని ఆపివేయాలని ఆదేశించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంపై గత నెల రోజుల నుండి ప్రచార సాధనాల్లో ప్రచారం చేయడం, సచివాలయాల పరిధిలో కరపత్రాలు పంచి షాప్ లు, నివాసాల వారికి అవగాహన కల్గించడం జరిగిందన్నారు. ఇక నుండి నగరంలోని దుకాణాలు, వాణిజ్య సంస్థలు, వ్యాపారులు, వీధి వ్యాపారులు, వ్యక్తులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ను వినియోగించినా, విక్రయించినా లేదా పంపిణీ చేసినా నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘన చేసిన దుకాణదారులకు 2 విడతలు అపరాధ రుసుం విధించినప్పటికీ, స్పందన లేకుంటే వారి ట్రేడ్ లైసెన్స్ ని రద్దు చేయడంతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వార్డు స్థాయిలో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృంద సభ్యులు తమ వార్డు పరిధిలోని నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ యూనిట్లు, గోదాములు, హోల్సేల్ మార్కెట్లు, రిటైల్ దుకాణాలు, వీధి వ్యాపారులు, ఇతర వాణిజ్య సంస్థలను ప్రతిరోజూ తనిఖీలు చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి భంగం కల్గించే ప్లాస్టిక్ సంచులకు బదులుగా పర్యావరణహిత సంచులను ప్రజలు వినియోగించాలని కోరారు. నగరంలో ఎక్కడైనా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కల్గిన కవర్లు మరియు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలను గుర్తిస్తే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 08632345103 కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

# అకడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

**రేపల్లె, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండలంలోని లంకెవానిదిబ్బ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ,మోళ్ళగుంట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోషల్,రేపల్లె పట్టణం లోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూలులో తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులలో అకడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని రేపల్లె మండల విద్యాశాఖ అధికారి సురేష్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ లోపు రేపల్లె మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.


**పత్రికా ప్రకటన**

నా క్లయింట్లు అయిన గుంటూరు జిల్లా, పొన్నూరు పట్టణము, (1) 27వ వార్డు నివాసి పఠాన్ గౌసియా, భర్త : గాలీబ్ఖాన్,(2) 29వ వార్డు నివాసి అయిన పఠాన్ రీహానా, భర్త : నసీర్ఖాన్ మరియు (3)29వ వార్డు నివాసి అయిన షేక్ నూర్జహన్, భర్త: షేక్ మహమూద్ ల నుండి సంజాయిషీ పొంది యావన్మందికి ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా ఈ దిగువ ఆస్తిని నా క్లయింట్లు గుంటూరు జిల్లా, పొన్నూరు పట్టణం, 27వ వార్డు నివాసి లేటు షేక్ మస్తాన్ కుమార్తె అయిన షేక్ ఖాదర్ మస్తాని నుండి ప్రతిఫలానికి కొనదలచినవారు. సదరు ఆస్తి కొనుగోలుపై ఎవ్వరికైనా ఏమైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నచో ఈ రోజు నుండి 10 రోజులలోపు ఈ దిగువ తెలిపిన చిరునామాకు తెలియపరచగలరు. ఈ 10 దినముల గడువు దాటిన తరువాత సదరు ఆస్తిని నా క్లయింట్లు నిశ్చిం ఆస్తిని పరిగణించి రిజిష్టర్డు దస్తావేజు ద్వారా కొనుగోలు చేసెదరు. ఈ రోజు నుండి 10 దినముల తరువాత వచ్చిన ఆక్షేపణలు, అభ్యంతరాలు పరిగణలోనికి తీసుకొనబడవని ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

షెడ్యూలు : గుంటూరు డి, పొన్నూరు సబ్రి, పొన్నూరు మున్సిపాలిటీ, 22వ నెంబరు బ్లాకులో, ఇటికంపాడు ఏరియాలో డి.నెం.362/8లో య. 0.86 సెంట్లలో,, తూర్పు: మున్సిపల్ రోడ్డు : 36 1/2 లింకులు దక్షిణము : షేక్ ఇలాస్ గారి ఇంటి స్థలము : 74 లింకులు పడమర : లేటు పినపాల రాఘవదాసు స్థలము : 36 1/2 ఉత్తరము: కరిముల్లా వగైరాల స్థలము : 73 లింకులు ఈ హద్దుల మధ్య 0.02 3/4 సెంట్లు (రెండు ముప్పాతిక సెంట్లు ) స్థలము యావత్ యాక్సెంట్ హక్కులతో సహా.

**బొనిగల అంకమ్మరావు**
అడ్వకేట్, పొన్నూరు. సెల్: 9866673301



**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
RACPC తెనాలి, పి.బి.నెం.17, కొత్తపేట, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522201.

**డిమాండ్ నోటీసు**
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు

(I) ఋణగ్రహీత చిరునామా: శ్రీ సంకటి బ్రహ్మ రెడ్డి, తండ్రి: శ్రీనివాస రెడ్డి, డి నెం.18-80, జంగమహేశ్వరపురం, గురజాల, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522415. మరొక చిరునామా: సాయి భగవాన్ రెసిడెన్సీ, ఫ్లాట్ నెం.D-5, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522509.
NPA: EB-HOME LOAN A/c No.38281435144, EB-SBI SURAKSHA A/c No.38298411511

(II) బకాయి మొత్తం : తేది.10.08.2026 నాటికి రూ.28,69,468/- (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల అరవై తొమ్మిది వేల నాలుగు వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) + పైన పేర్కొన్న మొత్తానికి కాంట్రాక్టువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీతో కలిపి ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥వి వాటితో కలిపి చెల్లించవలెను.

(III) డిమాండ్ నోటీసు తేది : 10.08.2026 NPA తేది : 09.08.2026

**స్థిరాస్తి వివరములు**
శ్రీ సంకటి బ్రహ్మరెడ్డి, తండ్రి: శ్రీనివాస రెడ్డి గారి పేరున ఉన్న ఆస్తి రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. 912/2019, తేది.27-02-2019 న పెదకాకాని (S.R.O.) వద్ద రిజిస్టర్డ్ చేయబడినది:
షెడ్యూల్-A: గుంటూరు జిల్లా, పెదకాకాని సబ్-జిల్లా, గుంటూరు కొత్త మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, అగతవరపాడు గ్రామ డి నెం.85/A/B నందు విస్తీర్ణం 1113.2 చ॥గ॥ల స్థలం మరియు "సాయి భగవాన్ రెసిడెన్సీ". హద్దులు: తూర్పు: ఎస్కె. సత్తార్ మరియు ఇతరుల ఆస్తి, 80-00 అ॥లు, దక్షిణం: గడ్డం మునల రెడ్డి గారి ఆస్తి, 139-00 అ॥లు, పడమర: 40 అ॥ల వెడల్పు గల రోడ్డు, 65-00 అ॥లు, ఉత్తరం: ఎస్కె. ఖాసిమ్ మరియు ఇతరుల ఆస్తి, 138-03 అ॥లు.
ఈ హద్దుల యందు మొత్తం విస్తీర్ణం 1113.2 చ॥గ॥లు లేదా 930.76 చ॥మీ॥లులోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటా 56.60 చ॥గ॥లు లేదా 47.32 చ॥మీ॥లులోని స్థలం.
షెడ్యూల్-B: A-షెడ్యూల్ నందు మొత్తం విస్తీర్ణం 1113.2 చ॥గ॥లు లేదా 930.76 చ॥మీ॥లులోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటా 56.60 చ॥గ॥లు లేదా 47.32 చ॥మీ॥లు స్థలంలోని "సాయి భగవాన్ రెసిడెన్సీ" నాలుగవ అంతస్తులోని ఫ్లాట్ నెం.D-5 తో ఫ్లాట్ కలదు. హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై & కామన్ కారిడార్, ఉత్తరం: ఓపెన్ టు స్కై.
ఈ హద్దుల యందు "సాయి భగవాన్ రెసిడెన్సీ" నాలుగవ అంతస్తులోని ప్లింత్ ఏరియా 1117 చ॥అ॥లులోని ఫ్లాట్ నెం.D-5 తో ఫ్లాట్ అన్ని సౌకర్యాలు, సాధారణ మరియు ఉమ్మడి హక్కులు, ఈజిమెంట్స్, సదుపాయాలు మొదలైన వాటితో సహా మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు కేటాయించబడిన పార్కింగ్ ఏరియాలో ఒక కార్ పార్కింగ్ స్థలం కలదు.

పైన చెప్పబడిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పొన్నూరు బ్రాంచ్, పొన్నూరు, గుంటూరు జిల్లా వారి నుండి ఋణము పొందియున్నారు. సదరు ఋణమునకు పైన ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనలనుసరించి సకాలంలో చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నిబంధనల ప్రకారం నిరర్థక ఖాతాగా పరిగణించబడినది. బ్యాంకువారు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించిన డిమాండ్ నోటీసులు తిరిగి వచ్చినందున/ ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరల నోటీసు జారీచేయడమగుచున్నది. కావున మీరు పైన పేర్కొన్న మొత్తములను ఈ పత్రికా ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా వడ్డీ & ఇతర ఖర్చులతో కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంకుకు చెల్లించవలసిన బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది : 10.08.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : తెనాలి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


# ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు

**గుంటూరు క్రైమ్,ఆగస్టు17,ప్రభాతవార్త:**

ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ ద్వారా అందే ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి, బాధితులకు



న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ 143 ఫిర్యాదులను అదనపు ఎస్పీ రమణమూర్తి,ఇతర పోలీస్ అధికారుల ద్వారా స్వీకరించి, ఒక్కో వినతిని పరిశీలించారు.ప్రతి ఫిర్యాదుపై నిష్పాక్షి కంగా విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందిన ఫిర్యాదులను వెంటనే ఆన్లైన్ విధానంలో సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి,నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించారు.

ఫిర్యాదు పరిష్కారమైన అనంతరం సంబంధిత ఫిర్యాదుదారునికి సమాచారం అందించి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాతే పిటిషన్ను ముగించాలని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలకే పరిమితం కాకుండా, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతతో, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు,దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియల్లో జిల్లా పోలీస్ సిబ్బంది సహకారం అందించి,తమ సమస్యలను సులభంగా తెలియజేసే అవకాశం కల్పించారు.ఈ సందర్భంగా గుంటూరులోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్, సాయినగర్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు,వృద్ధులు,నిరుపేదలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని పేర్కొంటూ ట్రస్ట్ ప్రతినిధులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రమణమూర్తి,ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం, పిజిఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్ తోపాటు ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# నవులూరు పుట్ట వద్ద నాగ పంచమి ప్రత్యేక పూజలు

**మంగళగిరి, ఆగస్ట్ 17, ప్రభాతవార్త :**

నవులూరు శ్రీ నాగేంద్రస్వామి వారి పుట్ట తోట క్షేత్రంలో నాగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం శ్రీ స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు స్వామివారికి భక్తిశ్రద్ధలతో పాలాభిషేకం నిర్వహించి, టెంకాయలు కొట్టి, పుట్టలో పాలు పోసి చలిమిడి, వడపప్పు, చిమ్మిరి, పొంగళ్ళు, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళగిరి పట్టణ



పరిసర ప్రాంతాలతో పాటు విజయవాడ, గుంటూరు పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నాగేంద్రస్వామివారిని దర్శించుకుని పూజ నిర్వహించారు. దీంతో పుట్ట తోట భక్తులతో కళకళలాడింది.

18 PLD 6ff.qxd:18 PLD 6.qxd 01/01/2001 10:01 Page 1



## కొండవీడు కొండలపై పురాతన శివాలయానికి పునర్వైభవం

**యడ్లపాడు, అగస్టు 17, ప్రభాతవార్త :** చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన కొండవీడు కొం డలపై పురాతన శివాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఆలయ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. చారిత్రక కట్టడాల ప్రామాణికతకు భంగం కలగకుండా భారీ రాళ్లతో సంప్రదాయ పద్ధతిలో నిర్మాణ పనులు చేపడుతున్నారు. పురాతన శిల్పకళను కాపాడుతూ ఆలయానికి పూర్వ వైభవం



తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.35 లక్షల నిధులను మంజూరు చేసినట్లు పురావస్తు శాఖ అధికారులు తెలిపారు. నిధుల వినియోగంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చారిత్రక నిర్మాణ శైలికి అనుగుణంగా పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. స్థానికుల కథనం ప్రకారం శ్రీకృష్ణదేవరాయల పరిపాలనా కాలంలో కొండవీడు ప్రాంతంలోని అనేక ఆలయాలు ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉండేవని చెబుతున్నారు. అప్పట్లో ఈ శివాలయం కూడా భక్తులతో కళకళలాడుతూ ఒక వెలుగు వెలిగిందని పెద్దలు గుర్తుచేస్తున్నారు. కాలక్రమంలో నిరక్ష్యానికి గురైన పురాతన ఆలయానికి ప్రస్తుతం పునర్నిర్మాణ పనులు జరుగుతుండటంతో స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక కొండవీడు ప్రాంతంలోని మరిన్ని పురాతన ఆలయాలు, కట్టడాలను కూడా గుర్తించి సంరక్షించాలని వారు కోరుతున్నారు. శివాలయ పునర్నిర్మాణం పూర్తయితే కొండవీడు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## మృతుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎస్సై, సిఐ

**దుర్గి, ఆగస్ట్ 17,ప్రభాతవార్త** దుర్గి మండలం ఓబులేసునిపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన హత్య ఘటన నేపథ్యంలో సోమవారం కారంపూడి సీఐ ఆవుల భాస్కర్, దుర్గి ఎస్సై బి. గోపాల్ పోలీసు సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని స్థానిక ప్రజలతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులను, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హత్యకు గురైన కొమ్ము ఇమాన్యుయేల్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. గ్రామంలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పోలీసు



శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా పోలీసులకు సహకరించాలని సీఐ ఆవుల భాస్కర్, ఎస్సై బి. గోపాల్ సూచించారు.

## ఇళ్లను కేటాయించండి.. లేదా కట్టి ఇవ్వండి!

### మిలటరీ స్థలంలో నివాసం ఉంటున్న పేద కుటుంబాల ఆవేదన

**సత్తెనపల్లి (ఆగస్టు 17, ప్రభాతవార్త):** ఇళ్లను కేటాయించాలని, లేదంటే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు సుగాలి కాలనీకి చెందిన పేద కుటుంబాలు కోరుతున్నాయి. సుగాలి కాలనీలో 1985 నుంచి నివాసం ఉంటున్న సుమారు 60 పేద కుటుంబాలను 12 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఖాళీ చేయించి, ఆ ప్రాంతంలో జిల్లా పరిషత్ హైస్కూల్ నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. అక్కడ నివసించిన కుటుంబాలకు స్థానిక మిలటరీ స్థలంలో నివాస స్థలాలు కేటాయించి, త్వరలోనే నూతన ఇళ్లు నిర్మించి ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం టిడ్కో ఇళ్లను మంజూరు చేసి రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని హామీ ఇచ్చినప్పటికీ వివిధ



కారణాలతో నిర్మాణం ఆలస్యమైందని తెలిపారు. ప్రస్తుతం టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 12 ఏళ్లుగా కేటాయించిన స్థలాల్లో కనీస వసతులు లేకుండా జీవిస్తున్నామని తెలిపారు. ఇళ్ల చుట్టూ సరైన వసతులు లేకపోవడంతో రాత్రివేళల్లో పాములు వస్తున్నాయని, బయటకు వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోయారు. ఇప్పటికే టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయినందున విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులతో పాటు మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లను వెంటనే కేటాయించాలని జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కోరారు. అర్హత ఉన్నప్పటికీ కొందరి పేర్లు లబ్ధిదారుల జాబితాలో లేకపోవడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అర్హులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. మిగిలిన స్థలంలో అవసరమైన అదనపు టిడ్కో ఇళ్లను నిర్మించి, ఇళ్లు లేని అర్హులైన కుటుంబాలకు కూడా కేటాయించాలని కోరారు. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించి టిడ్కో ఇళ్లను త్వరితగతిన లబ్ధిదారులకు అందించి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## వైభవంగా పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి కళ్యాణమహోత్సవం

### ఘనంగా కొనసాగుతున్న 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు

**సత్తెనపల్లి (ఆగస్టు 17, ప్రభాతవార్త):** సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని రాజుపాలెం మండల కేంద్రంలో కొలువుదీరిన పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 14వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కళ్యాణమహోత్సవాన్ని అంగరంగ వైభవంగా



నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుపాలెం, బెల్లంకొండ తదితర మండలాల్లోని గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పుణ్యదంపతులు స్వామివారి కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వేంకట రమ సుబ్బారావు దంపతులు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం పౌరాణిక నాటకాలు, కోలాట ప్రదర్శనలు, పాట కచేరీలు, స్వామివారి సంకీర్తనలు, అన్నమాచార్య సంకీర్తనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### 19న గరికపాటి నరసింహారావు ప్రవచనం

ఈ నెల 19వ తేదీన ఆలయ ప్రాంగణంలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పొత్తూరి వేంకట రమ సుబ్బారావు దంపతులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ఐదు వేల మందికి అన్నదానం

స్వామివారి కళ్యాణమహోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణం అనంతరం పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. భక్తులు కోలాట ప్రదర్శనలతో స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వేంకట రమ సుబ్బారావు దంపతులు తెలిపారు.

## పాత ఇనుప సామాను దుకాణంలో అగ్ని ప్రమాదం

### దగ్ధమైపోయిన ప్లాస్టిక్ వస్తువులు 1,50,000నష్టం

**కారంపూడి అగస్టు 17, ప్రభాతవార్త :** 'మండల కేంద్రమైన కారంపూడిలోని నాగు లేరు సమీపంలో ఉన్న పాత ఇనుప సామానుకోట్లో సోమ



వారం అగ్ని ప్రమాదం జరిగింది. షేక్ నాగూర్ భాషకు చెందిన ఇనుప సామాను కొట్లో ప్లాస్టిక్ వస్తువులు, ఇనుప సామాన్లు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించారా, లేక విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ అయిందా అనేది తెలియ రాలేదు. సామానుకోట్లో ప్లాస్టిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. దట్టమైన పొగలతో కూడిన మంటలు ఒకసారిగా ఎగిసిపడ్డాయి. చుట్టుపక్కల ఉన్నవారు మంటలను అదుపులోనికి తెచ్చే ప్రయత్నం చేశారు. పిడుగురాళ్ల అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్ని ప్రమా దంలో సుమారు లక్షన్నర రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగింది. పాత ఇనుప సామాను కొట్టు సమీపంలో గృహాలు, వ్యాపార సంస్థలు, మల్లె తోటలు ఉన్నాయి.



### గృహాల మధ్య ఇనుప సామాను కోట్లు ప్రభుత్వాలు మతులు నిల్...

"పాత ఇనుప సామాను కోట్లు గృహాల మధ్య యజమానులు ఏ రాటు చేశారు. గ్రామాలలో రైతుల పొలాల్లో మోటార్లు, పైపులు చోరీకి పాల్పడిన వ్యక్తులు పాత ఇనుప సామాను కోట్లలో అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. పట్టణానికి చివరగా ఉండవలసిన ఇనుప సామాను కోట్లు గ్రామ నడిబొట్టులో ఉండటంతో సంబంధిత అధికా రులు పట్టించుకోనట్లు తెలుస్తుంది. లక్షల్లో వ్యాపారం చేస్తున్న వ్యాపారులు కనీసం ఎలాంటి అనుమతులు లేకుండా తమ వ్యాపారాలను కొనసాగి ంచుకు ంటున్నారు. పోలీస్ శాఖ కూడా ఇనుప సామాను కోట్లపై మెగా పెట్టిన దాఖలాలు కనపడలేదు. చోరీలకు పాల్పడిన వ్యక్తులు ఇనుప సామాను కోట్లలోనే అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరంలో ఇనుప సామాను కొట్లో ప్రమాదం జరిగి ఆస్తి నష్టం, ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు కలుగజేసుకొని పాత ఇనుపు సామాను కోట్లపై నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు."

## డ్వాక్రా మహిళలను మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### రూ.35 లక్షల వరకు రుణాల పేరుతో మోసం
### అధికారుల పర్యవేక్షణపై తీవ్ర ఆరోపణలు
### వెంటనే న్యాయం చేయకపోతే ఆందోళనకు దిగుతాం
### వ్యవసాయ కార్మిక సంఘం

**అచ్చంపేట ఆగస్టు 17 (ప్రభాత వార్త):** డ్వాక్రా మహిళలను నమ్మబలికి వ్యక్తిగత, ముద్ర రుణాల పేరుతో సుమారు రూ.35 లక్షల వరకు రుణాలు తీసుకుని మోసం చేసిన యానిమేటర్ సల్మాన్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత మహిళలకు వెంటనే న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాధిత డ్వాక్రా మహిళలతో కలిసి వెలుగు కార్యాలయ అధికారులను కలిశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి. రవిబాబు మాట్లాడుతూ జానీ గ్రూప్, తిరుమల, మక్కా మదీనా, ప్రియాంక, అజ్మీత్, శివసాయి తదితర డ్వాక్రా సంఘాల సభ్యులను నమ్మబలికి యానిమేటర్ సల్మాన్ రుణాలు తీసుకుని మోసం చేశారని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వి. రాణి మాట్లాడుతూ డ్వాక్రా పొదుపు మూడు నెలలు చెల్లించకపోతే ఖాతా బ్లాక్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు సకాలంలో పర్యవేక్షణ చేయలేదని ఆరోపించారు. సభ్యులకు నోటీసులు ఇచ్చి అప్రమత్తం చేసి ఉంటే ఇంత పెద్ద మోసం జరిగేది కాదన్నారు. బాధిత మహిళలకు వెంటనే న్యాయం చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం అచ్చంపేట మండల కార్యదర్శి కత్తుల గోపికృష్ణ రెడ్డి మాట్లాడుతూ బాధిత మహిళల్లో చాలామంది వలస కూలీలుగా జీవిస్తున్నారని తెలిపారు. స్థానిక శివసాయి గ్రూపు కమిటీ సభ్యురాలు గౌరీ పార్వతి ద్వారా సుమారు 16 ఏళ్లుగా డ్వాక్రా పొదుపు, రుణాల చెల్లింపులు యానిమేటర్ ద్వారా కొనసాగుతున్నాయని, ఇదే నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని గత మూడేళ్లుగా



మోసం జరిగినట్లు ఆరోపించారు. ఉమ్మడి డ్వాక్రా రుణం చెల్లించలేదనే కారణంతో సభ్యులకు ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా వారి వ్యక్తిగత గోల్డ్ లోన్ల విషయంలో చర్యలు తీసుకోవడం అన్యాయమని ఆయన అన్నారు. ఈ వ్యవహారంపై బ్యాంకు, సంబంధిత అధికారుల బాధ్యతను కూడా పరిశీలించాలని డిమాండ్ చేశారు. వెలుగు కార్యాలయ సీసీ బాజీ, అకౌంటెంట్ సుజాత మాట్లాడుతూ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే జిల్లా స్థాయి అధికారులను పిలిపించామని తెలిపారు. వరుస సెలవుల కారణంగా కొంత ఆలస్యం జరిగిందని, కొద్ది రోజుల్లో సమస్య పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని బాధిత మహిళలు, ప్రజా సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. అనంతరం బాధిత డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని, మోసానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అచ్చంపేట తహసీల్దార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మెమొరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు టి. హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు బద్దునాయక్, కొండూరు రాజు, మహిళా సంఘం నాయకురాలు సంధ్య, డ్వాక్రా సభ్యులు కుంభ మల్లేశ్వరి, కుంభ శివపార్వతి, కొణిదెల తిరుమల, శిలం మల్లేశ్వరి తదితర బాధిత మహిళలు పాల్గొన్నారు.

## పిల్లల విద్య పై మమకారం.. సేవలో క్రీస్తు మార్గం

### బొల్లెద్దు విమలమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా నిరుపేద మహిళలకు చీరల పంపిణీ

**సత్తెనపల్లి (ఆగస్టు 17, ప్రభాతవార్త):** పిల్లల చదువుపై ఎంతో మమకారం చూపిన బొల్లెద్దు విమలమ్మ విద్యతోనే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆకాంక్షించేవారని పలువురు వక్తలు గుర్తు చేసుకున్నారు. ఆమె ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం మధ్యాహ్నం సత్తెనపల్లిలో బొల్లెద్దు కిషోర్ అధ్యక్షతన ఆదరణ కూడిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విమలమ్మకు చదువుపై ఎంతో ఆసక్తి ఉండేదని, అదేవిధంగా దేవుని ప్రేమను మాటల్లో కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా చూపించడమే నిజమైన క్రైస్తవ జీవన విధానమని ఆమె నమ్మేవారని కొనియాడారు. ఆమె భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆమె చూపిన ప్రేమ, చేసిన సేవా కార్యక్రమాలు, సమాజం పట్ల ఉన్న బాధ్యత ఎప్పటికీ నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు దేవుడు ధైర్యం, మనోబలం ప్రసాదించాలని కోరారు. తొలుత సీయోను లూథరన్ చర్చి పాస్టర్లు పి.



స్వరూప్‌కుమార్, జి. దయానందం ప్రార్థనలు నిర్వహించి ఆదరణ కూడికను ప్రారంభించారు. ఈ సందర్భంగా లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది దాసరి జ్యాన్‌రాజ్ పాల్, నాయకులు కోడిరెక్క దేవదాస్ మాట్లాడి నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొల్లెద్దు కిషోర్, చర్చి సభ్యులు కేబీఆర్‌జే ప్రసాద్, ఎస్. మృత్యుంజయరావు, కోయాలముడి క్రీస్తుదాస్, చుక్క సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులపై దాడులను తీవ్రంగా ఖండించిన సత్తెనపల్లి బార్ అసోసియేషన్

### న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి

**సత్తెనపల్లి (ఆగస్టు 17, ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలుచోట్ల న్యాయవాదులపై వరుసగా జరుగుతున్న దాడులను సత్తెనపల్లి బార్ అసోసియేషన్ తీవ్ర ంగా ఖండించింది. న్యాయవాదులపై దాడులను నిరసిస్తూ



సోమవారం బార్ అసోసియేషన్ కార్యవర్గం ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. సత్తెనపల్లి తాలూకా న్యాయస్థాన ప్రాంగణంలోని న్యాయదేవత విగ్రహం వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో సమావేశమై నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల అనంతపురం బార్ అసోసియేషన్ సభ్యుడైన న్యాయవాది గౌతమ్ కృష్ణను అనంతపురం సీఐ దుర్భాషలాడి దాడికి యత్నించడాన్ని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. అలాగే ఆదివారం సత్తెనపల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు, ముప్పాళ్ల గ్రామానికి చెందిన న్యాయవాది గద్దల చిన్న కోటయ్యపై జరిగిన మూకుమ్మడి దాడిని ఖండించారు. దాడికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడులు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. న్యాయవాదులకు రక్షణ కల్పించే విషయంలో ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సత్తెనపల్లి (ఆగస్టు 17, ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సత్తెనపల్లి జర్నలిస్టులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.



సుబ్బారావు, పల్నాడు జిల్లా కమిటీ ఆదేశాల మేరకు సత్తెనపల్లి యూనియన్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రవాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ (జూరిబీమ)లో నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి బకాయిలు ఉన్నాయనే కారణంతో కొన్ని ఆసుపత్రుల్లో జూరిబీమ కార్డులను అనువతించకపోవడంతో జర్నలిస్టులు ఆరోగ్య ప్రయోజనాలు పొందలేకపోతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో జర్నలి స్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. రెండేళ్లు గడిచినా ఇళ్ల స్థలాల అంశంలో పురోగతి లేదని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ సదుపాయం కల్పించాలని, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న తరహాలో రాష్ట్రంలోనూ జర్నలిస్టుల పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. జర్నలిస్టులపై జరుగుతున్న భౌతిక దాడులు, బెదిరింపులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి పట్టణానికి చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆర్థిక చేయూత

**పెదకూరపాడు(ఆగస్టు 17, ప్రభాతవార్త):** పెదకూరపాడు మండలం కన్నెగండ్ల గ్రామానికి చెందిన రాజవరపు ప్రసన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతోంది. ఆమె హాస్టల్ ఫీజు కోసం రూ.30,000 చెక్కును అందజేశారు. అలాగే ఉండవల్లి గ్రామానికి చెందిన షేక్ నాగూర్ బాజీ అనే ఇంజనీరింగ్ విద్యార్థికి బస్ ఫీజు నిమిత్తం రూ.15,000 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎన్. సరోజ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు గ్రూప్1, గ్రూప్2 వంటి పోటీ పరీక్షలకు కూడా సిద్ధమై మంచి ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఫౌండేషన్ అందిస్తున్న సహకారాన్ని జీవితంలో గుర్తుంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో స్నేహహస్తాలు ఫౌండేషన్ ప్రతినిధులు మన్నెం భద్రయ్య, తాయి కరిముల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ జట్టుకు తిమ్మాపురం విద్యార్థులు ఎంపిక



**యడ్లపాడు, అగస్టు 17, ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు జడ్‌పిహెచ్‌ఎస్ తిమ్మాపురం విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 16న రొంపిచర్ల జడ్‌పిహెచ్‌ఎస్‌లో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ సెలక్షన్ ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచిన తిమ్మాపురం పాఠశాల విద్యార్థులు డి అభిషేక్, బి ప్రవీణ్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ 11, 12, 13 తేదీల్లో విజయనగరం జిల్లా బొబ్బిలిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ వెంకటాద్రి నాయుడు, పీఈటీ వి వేమారెడ్డి, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను



అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## అంజుమన్ కమిటీ అధ్యక్షునిగా మోదిన్‌సా ఉపాధ్యక్షునిగా బుడేసా

**కారంపూడి అగస్టు 17, ప్రభాతవార్త :** "కారంపూడి మండలం అంజుమన్ కమిటీ నూతన కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. అధ్యక్షునిగా షేక్ మోదిన్ సా



ఉపాధ్యక్షునిగా షేక్ బుడేసాలను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మోదిన్ సా మాట్లాడుతూ కమిటీ అభివృద్ధికి, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో అంజి మన కమిటీ అభివృద్ధికి పనిచేస్తానని అన్నారు. ఈ సమావేశంలో షేక్ నూరు, కాసిం, షేక్ హారీష్, రుస్తుందా ర్ సలీం, సిపిఐ సైదా, దా దు, సయ్యద్ అహ్మద్, తండా సైదా, గౌస్, అబ్బాస్, పోకిరి జానీ తదితరులు పాల్గొన్నారు.

## పట్లవీడు రామాలయానికి రూ.40 లక్షల శ్రీవాణి ట్రస్టు నిధులు

**వెల్దుర్తి అగస్టు 17, ప్రభాతవార్త :** :పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గంలోని పట్లవీడు గ్రామ శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి వారి ఆలయ



అభివృద్ధికి శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ .40 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ లయ కమిటీ అభ్యర్థన మేరకు మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి సిఫారసులతో దేవాదాయ శాఖ ఈ నిధులను మంజూ రు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ ప్రక్రి యలో పంగులూరు పుల్లయ్య సలహా మేర కు, కుర్రి శివారెడ్డి ప్రోత్సాహంతో, అలాగే ప్రభుత్వ అధికారులు, ఆలయకమిటీ సమన్వయ ంతో కీలక పాత్ర పోషించాయని పేర్కొ న్నా రు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డికి ఆలయ కమిటీతో పాటు పట్లవీడు గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బ త్తు ల ఏడుకొండలు (బీసీ కొండలు) వెల్లడించారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఎల్‌నినో ప్రభావం నుంచి రైతులను ఆదుకునేందుకు
# ప్రభుత్వం చర్యలు
### అసెంబ్లీ సమావేశాల్లో చీఫ్‌విప్,వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ

**వినుకొండ, ఆగస్ట్17,ప్రభాతవార్త:** ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో సమగ్ర చర్యలు చేపట్టిందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్,వినుకొండ ఎమ్మెల్యే జీవీ



ఆంజనేయులు తెలిపారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో వర్షాభావ పరిస్థితులు,రైతుల సంక్షేమం,సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో జీ.వీ మాట్లాడారు. వర్షపాతం లోటు ప్రభావం రైతులపై పడకుండా సాగునీరు,విద్యుత్,విత్తనాలు,వంటల బీమా,ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం వంటి అంశాల్లో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కరువు పరిస్థితులు ఏర్పడిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే పరిస్థితిని అంచనా వేసి రైతులను రక్షించడమే ప్రభుత్వ విధానం అని స్పష్టం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించడం వల్ల కృష్ణా జలాలను రాయలసీమ అవసరాలకు వినియోగించే అవకాశం ఏర్పడిందని జీవీ తెలిపారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు న్యాయం చేయాలన్న దూరదృష్టితోనే చంద్రబాబు ప్రభుత్వం పట్టిసీమను అమలు చేసిందని పేర్కొన్నారు.గత వైసీపీ ప్రభుత్వం పట్టిసీమ పథకాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ వర్షాభావ పరిస్థితుల్లోనూ రైతులకు సాగునీటి భరోసా కల్పిస్తోందని తెలిపారు.రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. భూగర్భ జలాల పెంపు,నీటి సంరక్షణ,సాగునీటి లభ్యత పెంపు కోసం విస్తృత స్థాయిలో జల సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. విద్యుత్ డిమాండ్‌లో సవాళ్లు ఉన్నప్పటికీ వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ సరఫరా కొనసాగిస్తూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు నష్టపోకుండా వరికి ప్రత్యామ్నాయంగా జొన్న,మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో పంటల బీమా వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. బీమా బకాయిలు,నిర్వహణ లోపాల కారణంగా రైతులకు అందాల్సిన రక్షణ దెబ్బతిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యలను పరిష్కరించి రైతులను తిరిగి పంటల బీమా పరిధిలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రైతులు పంటల బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా కీలక పాత్ర పోషిస్తుందని అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ సహకారం అందుతుందని వివరించారు. గత వైసీపీ పాలనలో కరువు పరిస్థితుల సమయంలో రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని జీవీ ఆంజనేయులు విమర్శించారు. పంట నష్టాలు,ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు సకాలంలో సహాయం అందలేదని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం విత్తనం నుంచి పంట విక్రయం వరకు సాగునీటి నుంచి విద్యుత్ వరకు పంటల బీమా నుంచి గిట్టుబాటు ధర వరకు ప్రతి దశలో రైతులకు అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం నిరంతర పని చేస్తోందని జీ.వీ పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 93 అర్జీలు
### అర్జీలను అందుకున్న కలెక్టర్ కృతిక శుక్లా

**నరసరావుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ ప్రజా ఫిర్యాదుల వేదికకు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధ్యక్షత వహించి ప్రజల నుంచి అర్జీలను



స్వీకరించారు. మొత్తం 93 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని నిబంధనల ప్రకారం నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించి, బాధితులకు తగిన న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే, రెవిన్యూ క్లినిక్ లో 21 అర్జీలు అందాయి. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డీఎస్సీ పై విమర్శలు సరికాదు
### - ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త ::** ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన సందర్భంగా చేపట్టిననమ్మకం-అభివృద్ధి-సంక్షేమం డోర్‌టు డోర్ కార్యక్రమం సోమవారం సాయంత్రం నరసరావుపేట పట్టణంలోని 19వ వార్డులో కొనసాగింది. రామిరెడ్డిపేటలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ కార్యక్రమాన్నినిర్వహిస్తున్నామని, 34వ వార్డు నుంచి ప్రారంభమైన కార్యక్రమం ప్రస్తుతం 19వ వార్డుకు చేరుకుందని చెప్పారు. రానున్న 15 రోజుల్లో మిగిలిన వార్డుల్లోనూ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు.డీఎస్సీ పై విమర్శలు సరికాదుడీఎస్సీ నియామకాలపై వైసీపీ



అరవింద బాబు పాల్గొన్నారు.ఎమ్మెల్యే వార్డులోని పలు వీధుల్లో గడపగడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏదైనా కారణంతో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందకపోతే వారి సమస్యను పరిష్కరించే బాధ్యతను కూటమి నాయకులు, కార్యకర్తలు తీసుకుంటున్నారని తెలిపారు.గత నెల 17వ తేదీ నుంచి నరసరావుపేట పట్టణంలో డోర్‌టు డోర్ చేస్తున్న విమర్శలను ఎమ్మెల్యే ఖండించారు. డీఎస్సీ ప్రక్రియను ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిందని, కష్టపడి అర్హత సాధించిన అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. ఉద్యోగాలు పొందిన వారిని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ అంశంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సముచితంగా స్పందించారని తెలిపారు.రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. భోగాపురం విమానాశ్రయం, అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు, సీడ్ యాక్సిస్ రోడ్ల వంటి అభివృద్ధి పనులను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి పరిష్కరించేందుకు డోర్‌టు డోర్ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు తెలిపారు.

## పిజిఆర్‌ఎస్‌కు 87 ఫిర్యాదులు

**నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 17 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. పిజిఆర్ఎస్ లో ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, పలు



మోసాలకు సంబంధించిన సమస్యలు, బెదిరింపులు, ఆక్రమణలు వంటి పలు అంశాలకు సంబంధించిన 87 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం పట్ల ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో విచారణ వేగవంతం చేసి, చట్ట ప్రకారం వారికి న్యాయం చేయాలని పోలీస్ అధికారులకు అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి సూచించారు.

## కాసు శేషమ్మ మృతి
### ఎమ్మెల్యే అరవింద బాబు నివాళి

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 ప్రభాతవార్త ::** మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి, డా. కాసు ప్రసాద్ రెడ్డి, కాసు వెంకటరాజ గోపాల్ రెడ్డి మాతృమూర్తి కాసు శేషమ్మ ఆదివారం సాయంత్రం మృతి చెందారు.విషయం తెలుసుకున్న నరసరావుపేట ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు కాసు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి నివాసానికి చేరుకుని శేషమ్మ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాసు శేషమ్మ మృతి పట్ల ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ సంతాపంతెలియజేసారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబంతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.అనంతరం కాసు వెంకట కృష్ణారెడ్డి, డా. కాసు ప్రసాద్ రెడ్డి, కాసు వెంకటరాజ గోపాల్ రెడ్డి తదితర



కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.శేషమ్మ మృతి పట్ల ఎమ్మెల్యే అరవింద బాబు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## కాసు శేషమ్మ చిత్రపటానికి డాక్టర్ గోపిరెడ్డి నివాళి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 ప్రభాతవార్త :: మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి మాతృమూర్తి కాసు శేషమ్మ ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కాసు కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా శేషమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శేషమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాసు కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## అంగ రంగ వైభవంగా పుష్కరణి నిర్మాణానికి శంకుస్థాపన

**చిలకలూరిపేట, ఆగస్టు17, ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా, చిలకలూరిపేట, కొమ్మరవల్లిపాడు లో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహా స్వామివారి దేవాలయం లో అంగ రంగ వైభవంగా పుష్కరణి నిర్మాణానికి శంకుస్థాపన నియోజకవర్గ జనసేన పార్టీ యువ నాయకులు మండలి చరణ్ తేజ నేతల మీదగా నిర్వహించబడిందిచిలకలూరిపేట 25వ వార్డులోని శ్రీ లక్ష్మీ సహిత నరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా చక్రస్నానానికి కోనేరు కొరత ఉందని తెలుసుకున్న జనసేన పార్టీ యువనాయకుడు మండలనేని చరణ్ తేజ, స్వామి వారి సౌకర్యార్థం తన సొంత నిధులతో కోనేరు నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కోనేరు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ బ్రాహ్మణులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి భూమిపూజను శాస్త్రోక్తంగా నిర్వహి ంచారు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారి చక్రస్నానానికి



అవసరమైన కోనేరు నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం పట్ల మండలనేని చరణ్ తేజను పలువురు అభినందించారు. భక్తుల సౌకర్యం, ఆలయ అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో జనసేన పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్, దేవస్థానం ఈఓ అశోక్ కుమార్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి మహిళా నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు చిలకలూరిపేట పోలీసుల కౌన్సెలింగ్

**చిలకలూరిపేట, ఆగస్టు17, ప్రభాతవార్త :** నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని సూచన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవు పల్నాడు అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఐపీఎస్ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్యక్రమం రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగినవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ సత్ప్రవర్తనతో జీవిస్తూ



సమాజంలో బాధ్యతాయుతంగా ఉండాలని సూచన నేరాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే కౌన్సెలింగ్ నిర్వహణ

## డీఎస్సీ దుష్ప్రచారం పై వైకాపా ఆత్మవిమర్శ చేసుకోవాలి : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు17, ప్రభాతవార్త**

నిజం ఎప్పటికైనా అబద్ధాన్ని ఓడిస్తుందన్న సత్యాన్ని డీఎస్సీ 2025 టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ నిరూపించింది. ఉపాధ్యాయుల ర్యాలీ భారీస్థాయిలో విజయవంతమైన నేపథ్యంలో మెగా డీఎస్సీ పై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్న జగన్.. వైసీపీ నేతలు ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆదివారం విజయవాడ నడిబొడ్డున ఉపాధ్యాయులు కదం తొక్కితే.. నిత్యం మీడియాలో, సోషల్ మీడియాలో పనిగొట్టుకొని డీఎస్సీపై సంకుచిత విమర్శలు చేసే గొడ్డలిపార్టీ నాయకులు తోక ముడిచారు. పాఠాలు చెప్పే తమతో గుణపాఠం చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దన్న ఉపాధ్యాయుల హెచ్చరికల్ని వైసీపీ బేఖాతరు చేస్తే, భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అధికారంలో ఉన్నప్పుడే జగన్ కు ... టీచర్లు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. సీపీఎస్ రద్దు చేస్తానని మాటతప్పిన జగన్ కు ఉపాధ్యాయులు ఆనాడే ముచ్చెమటలు పట్టించారు.

**ఉపాధ్యాయుల ఆత్మగౌరవ ర్యాలీ డీఎస్సీపై ప్రజావాణిని బలపరిచింది..**

ఆదివారం నాటి ఉపాధ్యాయుల ఆత్మగౌరవ ర్యాలీ.. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై ప్రజావాణిని బలపరిచింది. తన హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ అక్రమాలపై నోరు విప్పే ధైర్యం జగన్ కు లేదు. పరీక్ష పత్రాల మూల్యాంకనం ముసుగులో తానుచేయించిన అక్రమాలపై ప్రజా ప్రభుత్వం తనను ఏకిపారేస్తుందన్న భయంతోనే జగన్ అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నాడు. ప్రజలు తిరస్కరించిన ప్రతిపక్ష హోదాపై జగన్ మంకుపట్టు పట్టడం.. హోదా ఇస్తేనే సభకు వస్తామని పిడివాదనం చేయడం ఆయనలోని పిరికితనానికి నిదర్శనం. గతంలో చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తానని ప్రగల్భాలు పలికిన జగన్.. .నేడు దానికోసమే చంద్రబాబును వేడుకునే దుస్థితికి దిగజారాడు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించలేని జగన్ అసమర్థతను కళ్లారా చూసినందునే 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీని ఏహోదాకు పనికిరాని పార్టీగా తేల్చారు. ఏపీ ప్రభుత్వం, ప్రధానాధికారులు డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు లేవని ఆధారాలతో సహా స్పష్టం చేసినా, తమ పార్టీ నేతలు డీఎస్సీ అక్రమాలపేరుతో



వేసిన పిల్ (ప్రజా ప్రయోజన వ్యాజ్యాల్ని) లను న్యాయస్థానాలు తిరస్కరించినా వైసీపీనేతలు పదేపదే అదే అంశాన్ని రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**డీఎస్సీ పై జగన్ వైఖరి ప్రజాస్వామ్యానికే హానికరం.**

నిరుద్యోగులు, విద్యార్థుల్లో ఉన్న ఆవగింజంత అసంతృప్తికి ఆజ్యంపోసి, రాష్ట్రంలో చిచ్చు పెట్టాలన్న జగన్ కుట్ర రాజకీయాల్ని డీఎస్సీ 2025 ఉపాధ్యాయులు చిదిమేశారు. డీఎస్సీపై జగన్ వైఖరి ముమ్మాటికీ ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. లోకేశ్ రాజీనామా డిమాండ్ తో ప్రజల్లో గొడ్డలిపార్టీ ప్రతిష్ట పెంచాలనుకున్న జగన్ ప్రయత్నాలు ఆదిలోనే నీరుగారిపోయాయి. చింతచచ్చినా పులుపు చావదన్నట్టు ప్రజలు గత ఎన్నికల్లో జీవితాంతం గుర్తుండిపోయేలా బుద్ధిచెప్పినా.. జగన్ కుట్రలు, కుతంత్రాలు, నీతిమాలిన రాజకీయాలు మానడం లేదు. జగన్ కు ఏమాత్రం ప్రజా సమస్యలపై, రాష్ట్రభవిష్యత్ పై చిత్తశుద్ధి ఉంటే.. అసెంబ్లీకి వచ్చి తన గళం వినిపించాలి. తాను లేవనెత్తే ప్రతి అంశానికి ప్రభుత్వం సమాధానం ఇచ్చేలా చూస్తానని, స్వయంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడే భరోసా ఇస్తున్నా.. గౌరవ సభలో అడుగుపెట్టడానికి జగన్ వణికిపోతున్నాడు. " అని ప్రత్తిపాటి ఆదివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే రైతుకు ఆదాయం

**యడ్లపాడు, ఆగస్టు 17,పభాతవార్త :** ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని పొందడంతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే. అమల కుమారి అన్నారు.నరసరావుపేట డివిజన్‌లోని యడ్లపాడు మండలం యడ్లపాడు గ్రామంలో రైతు కొండ మాధవి సాగు చేస్తున్న ప్రకృతి



వ్యవసాయ పొలాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సాగు విధానం, అంతర పంటల పెంపకం, పంటల స్థితిగతులను పరిశీలించారు.అమల కుమారి మాట్లాడుతూ.. ప్రధాన పంటతో పాటు చిక్కుడు, ఆకుకూరలు, బెండ, గోరుచిక్కుడు, మునగ వంటి అంతర పంటలను సాగు చేయడం ద్వారా ఒకే పొలం నుంచి ఏడాది పొడవునా వివిధ రకాల దిగుబడులు పొందవచ్చన్నారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరడంతో పాటు కుటుంబానికి పోషకాహారం లభిస్తుందని తెలిపారు.రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించి, భూమిలో సేంద్రియ పదార్థాన్ని పెంచుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆమె సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో పంటల వైవిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనే సామర్థ్యం కూడా పెరుగుతుందని వివరించారు.కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి సౌజన్య లక్ష్మి, ఐసీఆర్‌పీ ప్రసన్న, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సాయి తదితరులు పాల్గొన్నారు.

## కంచర్ల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు17, ప్రభాతవార్త :** చిలకలూరిపేట పట్టణంలోనీ కుమ్మర కాలనీ నందు టి.యన్.టి.యు.సి నాయకులు, కంచర్ల శ్రీనివాసరావు అమ్మ కంచర్ల మహాలక్ష్మి మృతిచెందిన విషయం తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి వారి భౌతికదేహానికి నివాళ్ళు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించినా మాజీమంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు.



## సుప్రియ స్పిన్నింగ్ మిల్ క్వార్టర్స్‌లో వలస కార్మికుడి ఆత్మహత్య

**యడ్లపాడు, ఆగస్టు 17,పభాతవార్త :** పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామంలోని సుప్రియ స్పిన్నింగ్ మిల్ క్వార్టర్స్‌లో వలస కార్మికుడు ఉరివేసుకుని మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం పూరి జిల్లా బ్రహ్మగిరి మండలం పంపసపాడు గ్రామానికి చెందిన గంగా బెహారా (36) సుమారు రెండేళ్లుగా సుప్రియ స్పిన్నింగ్ మిల్‌లో కార్మికుడిగా పనిచేస్తూ, మిల్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయనకు మద్యం సేవించే అలవాటు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు.ఆగస్టు 16న రోజంతా మద్యం సేవించి విధులకు వెళ్లకుండా గదిలోనే ఉన్నట్లు సమాచారం. అదే రోజు రాత్రి అతని ముగ్గురు పిల్లలు సమీపంలోని పరిచయస్తుల క్వార్టర్స్‌లో ఉండటంతో గంగా బెహారా తన గదిలో ఒంటరిగా ఉన్నాడు.ఆగస్టు 17న ఉదయం సుమారు 10 గంటల సమయంలో డ్యూటీకి పిలిచేందుకు టైం కీపర్ గది తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చింది. తలుపు తెరిచి చూడగా గంగా బెహారా ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు.సమాచారం అందుకున్న



యడ్లపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతికి గల కారణాలను పరిశీలిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ఉత్తమ సేవ ప్రశంసా పత్రం అందుకున్న శ్రీనివాసులు

**పెదకూరపాడ( ఆగస్టు 17 ప్రభాతవార్త ):** మద్యపాన నిషేధం, ఆబ్కారి స్టేషన్ అమరావతి పెదకూరపాడు పరిధిలో సబ్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న వి. శ్రీనివాసులు కి కలెక్టర్ శుక్ల మంత్రి మనోహర్ నాయుడు చేతులమీదుగా ఉత్తమ సేవలకు గాను ప్రశంసా పత్రాన్ని స్వాతంత్ర దినోత్సవం నాడు అందించారు. నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా శ్రీనివాసులు తమ విధి నిర్వహణ నిర్వర్తించారని, ప్రతి విషయాన్ని సౌమ్యంగా తీసుకుని ప్రజలకు ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన విధులు నిర్వహిస్తూ ముందుకు సాగుతూ ఉన్న శ్రీనివాసులను సిబ్బంది అభినందించారు. ఉత్తమ సేవా పత్రం అందుకున్నందుకుగాను సిబ్బంది ఆయనకు స్టేషన్లో సత్కరించారు.



## కాసు కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి రజిని

**చిలకలూరిపేట, ఆగస్టు17, ప్రభాతవార్త :** మాజీ మంత్రివర్యులు కాసు కృష్ణారెడ్డి మాతృమూర్తి, మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి నాయనమ్మ శ్రీమతి కాసు శేషమ్మ స్వర్గస్తులు కావడంతో, ఈరోజు హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి పార్థివదేహాన్ని దర్శించి నివాళులు అర్పించిన మాజీ మంత్రి వర్యులు శ్రీమతి విడదల రజిని. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు



MN 8 PAGE-BPTfff:MN 8 PAGE-BPTfff 01/01/2001 09:39 Page 1



# బాపట్ల జిల్లా వార్త



## ఏపీఓఎస్ఎస్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

**బాపట్ల, ఆగస్టు17, ప్రభాతవార్త, ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి (ఎస్ఎస్సీ), ఇంటర్మీడియట్ కోర్సుల్లో 202627 విద్యా సంవత్సరానికి ప్రవేశాల గడువును పొడిగించడం జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గతంలో నిర్ణయించిన గడువును సెప్టెంబరు 15వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. జిల్లాలోని ఏపీఓఎస్ఎస్ అధ్యయన కేంద్రాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్దేశిత గడువులోగా దరఖాస్తులు సమర్పించి ప్రవేశాలు పొందాలన్నారు. ఏపీఓఎస్ఎస్ ద్వారా సాధారణ విద్యకు దూరమైన వారు, చదువును మధ్యలో నిలిపివేసిన వారు తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించే అవకాశం ఉందన్నారు. 2026 27 విద్యా సంవత్సరానికి ప్రవేశ ప్రక్రియ జూన్ 12న ప్రారంభమైన జిల్లాలోని అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి సెప్టెంబరు 15లోగా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.

## పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి



**రేపల్లె, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ప్రభుత్వ పెన్షన్ల కోసం సచివాలయాలలో ఈ నెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం కార్యదర్శి జి.వి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త అనగాని శివప్రసాద్ సూచనల ప్రకారం వార్డు, గ్రామంలోని అర్హులు పెన్షన్ల దరఖాస్తులను అందజేయాలని కోరారు. మండల పార్టీ, గ్రామ, వార్డు తెదేపా అధ్యక్షులు స్వీకరించిన దరఖాస్తులను సచివాలయాల్లో అందజేయాలని జి.వి.నాగేశ్వరరావు సూచించారు.

## విగ్రహాల శిలాఫలకాల పై పేర్లు తొలగించాలి.!

- బాపట్ల మున్సిపల్ కమిషనర్‌కు మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ లేఖ
- రాజకీయాలు మారిపోతే ఆనవాళ్లు తొలగిస్తారా?
- గతంలో ఉన్న విధంగానే పేర్లతో శిలాఫలకాలు పునరుద్ధరించాలని విజ్ఞప్తి

బాపట్ల, ఆగస్టు17, ప్రభాతవార్త, ప్రతినిధి:

బాపట్ల పట్టణంలోని ప్రసిద్ధ గడియార స్తంభం (క్లాక్ టవర్) కూడలి వద్ద నూతనంగా పునఃస్థాపించిన మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు విగ్రహానికి సంబంధించిన శిలాఫలకాలపై ఉన్న నాయకుల పేర్లను తొలగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది. గతంలోఉన్న విధంగానే దాతలు, నాయకుల పేర్లతో కూడిన శిలాఫలకాలను యథాతథంగా ఏర్పాటు చేయాలని బాపట్ల మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బాపట్ల పురపాలక సంఘ కమిషనర్‌కు సోమవారం ఒక లేఖ రాశారు.



**రూ.10 లక్షల సొంత నిధులతో విగ్రహాల ఏర్పాటు:**

గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా తొలగించబడిన మహనీయుల విగ్రహాలను తిరిగి అదే స్థానంలో ప్రతిష్ఠించేందుకు తాను తీవ్రంగా నిరసన తెలిపానని మాజి ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. విగ్రహాల పునఃస్థాపనకు మొదటి నుంచీ కృషి చేశానన్నారు. 2014-19 మధ్య కాలంలో తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన సమయంలో, సుమారు రూ.10 లక్షల సొంత నిధులను వెచ్చించి విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ పునఃస్థాపన ప్రక్రియలో అప్పటి జిల్లా మంత్రి, పార్లమెంట్ సభ్యుడు, మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు మరియు పార్టీ సీనియర్ నాయకులు ఎంతో సహకరించారని పేర్కొన్నారు.

**వ్యక్తిగత గుర్తింపు కోసం కాదు... చరిత్రను కాపాడటానికే!:**

విగ్రహాల ఏర్పాటు లేదా పునఃస్థాపన వంటి కార్యక్రమాలు కేవలం వ్యక్తిగత ప్రాచుర్యం కోసం కాదని, ఆయా మహనీయుల సేవలను భవిష్యత్ తరాలకు అందించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. పాలకులు మారినప్పుడల్లా గతంలో జరిగిన మంచి కార్యక్రమాల ఆనవాళ్లను, చరిత్రను తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించిన ప్రజాప్రతినిధుల సేవలను గుర్తించడం ప్రజాస్వామ్య సాంప్రదాయమన్నారు. ఇటువంటి చర్యలు బాపట్ల ప్రజల మనోభావాలను దెబ్బతీస్తాయని ఆయన అవేదన వ్యక్తం చేశారు.

**శిలాఫలకాలను యథాతథంగా పునరుద్ధరించాలి**

గతంలో విగ్రహాల దాతలుగా, నిర్మాణ బాధ్యులుగా ఉన్న ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకుల పేర్లు సముచితంగా నమోదు కావాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. విగ్రహాల ఏర్పాటు వెనుక ఉన్న నిజమైన చరిత్ర, వాటి కోసం శ్రమించిన ప్రజాప్రతినిధుల వివరాలు రాబోయే తరాలకు తెలియాలంటే పాత శిలాఫలకాలే ప్రామాణికమని పేర్కొన్నారు. కాబట్టి, ఇది పాలకులు తెలియక చేసిన తప్పు అయితే వారిని సవరించాల్సిన బాద్యత ఖచ్చితంగా ఉందన్నారు. అటువంటి చర్యలుబాపట్ల ప్రగతి నిరోదకకాలన్నారు. బాపట్ల ప్రజల మనోభావాలను, చారిత్రక నేపథ్యాన్ని గౌరవిస్తూ... కమిషనర్ తక్షణమే స్పందించి తొలగించిన పేర్లతో కూడిన శిలాఫలకాలను యథాతథంగా పునఃస్థాపించాలని ఆయన కోరారు.

## ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో అధికారులు పనిచేయాలి : కలెక్టర్

**బాపట్ల, ఆగస్టు17, ప్రభాతవార్త, ప్రతినిధి: :** ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులకు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని వీక్షణ సమావేశ మందిరంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మరియు గ్రామీణ పేదలకు నిర్మూలన సంస్థ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి మాట్లాడుతూఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతికుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసే లక్ష్యంగా వివిధ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాలను లబ్ధిదారులకు అందజేసి వారిని ఆర్థికంగా అభివృద్ధి పరచడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 12,690 మంది మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరుచుటలో ప్రభుత్వం లక్ష్యాలు నిర్దేశించిందన్నారు. జిల్లాలో త్రైమాసకమునకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు కాకుండా సంవత్సరమునకు నిర్దేశించిన లక్ష్యాలను ప్రాతిపదికగా తీసుకొని లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. శ్రీనిధి, ఉన్నతి, పి ఎం ఎఫ్ ఎం ఏ, పి ఎం ఈ జి పి, పథకాలను లబ్ధిదారులకు అందజేసి వారి అభివృద్ధికి దోహదపడాలని, వివిధ పథకాల ద్వారా రుణాలను పొందిన లబ్ధిదారుల నుండి సకాలంలో రుణాలు వసూలు చేయుటకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భాగస్వామ్యంతో నిర్వహించే వ్యాపారంలో లబ్ధిదారుల ఎంపిక చేయకపోవుటకు కారణాలపై ఆయన అధికారులను ఆరా తీశారు. భాగస్వామ్యం గ్రౌండ్ చేయడంలో చురుకుదనం చూపాలని ఆయన ఏపిఎం మరియు డిపిఎంలను ఆదేశించారు. ఈ భాగస్వామ్య వ్యాపారాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాపట్ల లో వీధి తినుబండారాల దుకాణాల ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఎ పి డి సింగయ్య, మెప్మా పీడీ ఆనంద పాల్, వీక్షణ సమావేశం ద్వారా డిపియం లు, ఎపియం లు మరియు తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు పాలన చూసి అసహ్యించుకుంటున్న ప్రజలు

### -మేరుగ నాగార్జున

**రేపల్లె, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పరిపాలన చూస్తుంటే ప్రజలే రాజకీయాలను అసహ్యించుకునే స్థాయికి తీసుకువెళుతున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున విమర్శించారు. సోమవారం ప్రముఖ వ్యాపారవేత్త, వైకాపా సీనియర్ నేత మోపిదేవి శ్రీనివాసరావు నివాసంలో



ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయకపోగా కోట్లాది రూపాయలు అప్పులు తెస్తూ ఎందుకు ఎవరికి ఖర్చు చేస్తున్నారో చెప్పలేని పరిస్థితిలో కూటమి పాలన కొనసాగుతున్నదన్నారు. అభివృద్ధిలో ఆఖరి నుంచి మూడో స్థానంలో ఉంటే అఘాయిత్యాలు, పరిపాలనలో అవకతవకల వ్యవహారంలో దేశంలోనే రెండు, మూడు స్థానాలలో ఆంధ్రప్రదేశ్ ఉందని ఆయన ఆరోపించారు. ఏ సెక్టార్ చూసినా జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో అభివృద్ధికి బాటలు వేసారని గుర్తు చేశారు. గణనీయమైన విద్యాభివృద్ధి నెరవేరిందన్నారు. చంద్రబాబు పాలనలో అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు ఇస్తే నేటి కూటమి పాలకులు తల్లికి వందన పథకం కింద రూ.6-9 వేలకు మించి ఇవ్వడంలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు నిలిచిపోయిం దన్నారు. డిఎస్సీలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆయన విమర్శించారు. రైతుల సంక్షేమం గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో రైతులకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడటానికి కూటమి ప్రభుత్వ అస్తవ్యస్థ పాలనే అందుకు నిదర్శనమన్నారు. నారుమళ్ళు పోసుకున్న రైతులు వరినాట్లు చేపట్టేందుకు నీటి సమస్య ఏర్పడిందని చెప్పారు. దివంగత మాజీ సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో రైతుల సంక్షేమం నెరవేరిందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే రైతులకు కరువు వస్తుందనేది వాస్తవమేనన్నారు. ఏనాటి నుండో ఇలాగే జరుగుతున్న విషయం రాష్ట్ర ప్రజలకు తెలియంది కాదన్నారు. రైతులకు క్రాప్ హాల్‌డే తీసుకోవాలని చెప్పడం చూస్తుంటే ప్రభుత్వ అసమర్థపాలనను తేటతెల్లం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. రైతుల భూములకు నీరివ్వకుంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో రెవెన్యూ శాఖ మంత్రిగా మూడు, నాలుగు స్థానాల ప్రగతిబాటలో ఉన్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో చెప్పించుకుంటే సరిపోదని రేపల్లె నియోజకవర్గంలోని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో వ్యవహరించాలని రేపల్లె ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు హితవుపలికారు. రాష్ట్రం కంటే ముందు రేపల్లె నియోజకవర్గంలోని సమస్యల గురించి అనగాని సత్య ప్రసాద్ పట్టించుకోవాలని నాగమోహన్ కృష్ణ సూచించారు. సాగునీటి సమస్యను పట్టించుకోని పక్షంలో రేపల్లె నియోజకవర్గంలోని రైతులు అనగాని సత్యప్రసాద్‌ను తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు మోపిదేవి శ్రీనివాసరావు, గూడపాటి శ్రీనివాసరావు, బేతపూడి కోటేశ్వరరావు

## చిత్తశుద్ధితో పనిచేయాలి

**నిజాంపట్నం, ఆగస్టు 17, ప్రభాతవార్త ః** ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపిడిఓ నాగలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సిబ్బంది, పంచాయితీ కార్యదర్శుల, పంచాయితీ రాజ్ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో



అలసత్వం వహిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు.

పంచాయితీ, మండల పరిషత్ ఎన్నికలు జరగనున్నందును బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం జిల్లా ఉత్తమ ఎంపిడిఓగా ఎంపికైన నాగలక్ష్మిని పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది అభినందించి, సత్కరించారు.

## వైఎస్ఆర్ పార్టీని గొడ్డలి పార్టీతో పోల్చడం తగదు : మోపిదేవి

**రేపల్లె, ఆగస్టు 17, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ నాయకులు, పాలకులు విచక్షణారహితంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గొడ్డలి పార్టీతో పోల్చడం తగదని వైకాపా రేపల్లె సీనియర్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వైకాపా బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ, వైకాపా నాయకుడు గూడపాటి శ్రీనివాసరావులు మర్యాదపూర్వకంగా మోపిదేవి శ్రీనివాసరావును



కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె ఎమ్మెల్యే, మంత్రి అనగాని సత్యప్రసాద్ సైతం వైఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించిన ముఖ్యమంత్రిగా ప్రజాదరణ పొందిన నందమూరి తారకరామారావును వెన్నుపోటు పొడిచి తెదేపాను దక్కించుకున్న నారా చంద్రబాబు నాయుడు గతాన్ని మరిచిపోయారా అని ఆయన ప్రశ్నించారు. సాక్షాత్తూ ఎన్టీరామారావే తన అల్లుడు వెన్నుపోటు పొడిచాడని బహిరంగంగా విమర్శించిన వైనాన్ని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఇంకా మరిచిపోలేదని శ్రీనివాసరావు గుర్తు చేశారు. ప్రజల అవసరాల కోసం పోరాటాలు చేసే పంథాలో వైకాపా ముందుకు సాగుతున్నదని చెప్పారు. ఎన్టీరామారావును మానసికంగా అంతమొందించిన పార్టీ చంద్రబాబు సారథ్యంలో కొనసాగుతున్న తెలుగుదేశం పార్టీ కాదా అని అయన ప్రశ్నించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల సంక్షేమ పథకాలు అమలయ్యాయని ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మోపిదేవి స్పష్టం చేశారు.

## పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

### -24 మంది ప్రతిభావంతులకు రూ. 3.43 లక్షల మెరిట్ స్కాలర్‌షిప్‌లు పంపిణీ

**బాపట్ల, ఆగస్టు17, ప్రభాతవార్త, ప్రతినిధి:** ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని, నిరంతర కృషి, పట్టుదలతో ముందుకు సాగితే అనుకున్న విజయాలను సులభంగా సాధించవచ్చని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు.. 202425 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన బాపట్ల జిల్లా పోలీసు



సిబ్బంది పిల్లలకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ వెల్ఫేర్ విభాగం నుంచి మంజూరైన మెరిట్ స్కాలర్‌షిప్‌ల చెక్కులను సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ నుంచి రూ.3.43 లక్షల విలువైన మెరిట్ స్కాలర్‌షిప్‌లను మొత్తం 24 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు అందజేశామన్నారు. ఈ స్కాలర్‌షిప్ కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, విద్యార్థుల కష్టానికి, ప్రతిభకు లభించిన గుర్తింపు అని కొనియాడారు.

**పోలీస్ సంక్షేమ నిధి స్కాలర్‌షిప్‌ల వివరాలు:పదో తరగతి పూర్తయిన వారు: 8 మంది**

ఇంటర్మీడియట్ చదువుతున్న వారు: 8 మందిబీటెక్ (ఇంజనీరింగ్): 6 మందిఎంబీబీఎస్ / నీట్ సాధించిన వారు: 2 మందిమొత్తం లబ్ధిదారులు: 24 మంది (మొత్తం ఆర్థిక సాయం: రూ. 3.43 లక్షలు)

**తల్లిదండ్రుల శ్రమకు గుర్తింపు:**

పోలీసు సిబ్బంది రాత్రింబవళ్లు విధుల్లో నిమగ్నమై, పండుగలు, సెలవులు సైతం త్యాగం చేస్తూ సమాజానికి సేవలందిస్తుంటారన్నారు. ఎంతటి పని ఒత్తిడి ఉన్నప్పటికీ తమ పిల్లల చదువుల పట్ల శ్రద్ధ చూపుతూ, వారిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేందుకు శ్రమిస్తున్న పోలీసు తండ్రులను, కుటుంబాలను




ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కేవలం మంచి మార్కులు, ఉద్యోగం మాత్రమే విజయానికి కొలమానాలు కావు. సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా, నైతిక విలువలతో ఎదగడం అత్యంత ముఖ్యమన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఈఆఫీస్ పోలీసు సిబ్బంది సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందన్నారు. సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కార్యాలయం చుట్టూ తిరిగే పనిలేకుండా స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా ఈఆఫీస్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. పోలీస్ స్టేషన్ల నుంచే నేరుగా ఈఆఫీస్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే తక్షణమే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, అడ్మిన్ ఆర్ఐ మోలుద్దీన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శాశ్వత పరిష్కారం చూపాలి : ఎస్పీ ఉమామహేశ్వర్

### పోలీస్ కార్యాలయంలోప్రజా సమస్యల పరిష్కార వేదిక

**బాపట్ల, ఆగస్టు17, ప్రభాతవార్త, ప్రతినిధి: :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలు పదే పదే పునరావృతం కాకుండా బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీఉమామహేశ్వర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజల నుంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ, అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో నిర్దిష్ట గడువులోగా సమగ్రంగా విచారించి బాధితులకు తగిన న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. పిజిఆర్ఎస్ అర్జీలపై తీసుకున్న చర్యల నివేదికను వెంటనే జిల్లా కార్యాలయ పీజీఆర్ఎస్ విభాగానికి పంపాలన్నారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ఏమాత్రం నిరక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ సీఐ కె.శ్రీనివాసరావు తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పెదగొల్లపాలెం జెడ్పి హై స్కూల్ విద్యార్థినుల ప్రతిభకు పంజాబ్ నేషనల్ బ్యాంకు ఉపకారవేతనాలు పంపిణీ

**కర్లపాలెం, ఆగస్టు17, ప్రభాతవార్త. :** 80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా లాడ్లీ శిక్ష ప్రోత్సాహ యోజన పథకం క్రింద పంజాబ్ నేషనల్ బ్యాంక్ బాపట్ల బ్రాంచ్ వారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల




కర్లపాలెం మండలంలోని పెద్ద గొల్లపాలెంను ఎంపిక చేసుకుని ఏడు నుంచి పది తరగతులు చదువుతున్న నలుగురు ప్రతిభావంతులైన విద్యార్థినులకు 3000, 5000 రూపాయల చొప్పున స్కాలర్షిప్ ను అందించడం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఐ. జగదీష్ మాట్లాడుతూ బాలికలు చక్కగా చదువుకోవాలని స్వసక్తితో ఎదగాలని బాల్యవివాహాలు వద్దని సందేశం ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుభాషిణి , ప్రత్తిపాటి , శ్రీనివాసరావు బాపూజీ ఆదంబీ, హేమలత ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మేనేజర్ గారికి కృతజ్ఞతలు తెలియజేసి, బ్యాంక్ సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు.

## ఐటిఐ కళాశాలలో అడ్మిషన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలి

**నిజాంపట్నం, ఆగస్టు 17, ప్రభాతవార్త ః** జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో చేరాలనుకునే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, నిజాంపట్నం, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ పి ఉమామహేశ్వరిదేవి కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ సాయంత్రం 4గంటలలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మొదటి, రెండవ విడత కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన ఖాళీలలో చేరుటకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లోని రిజిస్ట్రేషన్ ఫారాన్ని డౌన్లోడ్ చేసుకుని, అప్లికేషన్ కాపీని అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ రెండు జతలు, అభ్యర్థి పాస్‌పోర్టు ఫొటోలు 2 తీసుకుని సాయంత్రం 6గంటలలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈనెల 20న అన్ని ప్రభుత్వ ఐటిఐలలో కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 8074516183, 8978624156ను కార్యాలయ పనివేళలలో సంప్రదించాలన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**రేపల్లె, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొమ్మూరు సత్యం కోరారు. సోమవారం జర్మలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియుడబ్ల్యూజె) 1957 ఆగస్టు 17వ తేదీ ఏర్పడి నేటికి 70వ సంవత్సరంలోకి ప్రవేశించిందన్నారు. ఏడు దశాబ్దాలుగా పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, వృత్తి ప్రమాణాల పెంపుదల, వర్కింగ్ జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రతపై ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని గుర్తుచేశారు. ఈ సంవత్సరం పొడవునా ప్లాటినం జూబిలీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఎపియుడబ్ల్యూజె యూనియన్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందని సత్యం చెప్పారు. అలాగే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పందించే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తున్నట్లు తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (డబ్ల్యూజెహెచ్ఎస్) అమలులో నెట్‌వర్క్ ఆస్పత్రులలో జర్నలిస్టుల ఆర్థిక ప్రయోజనానికి ఆటంకంగా మారిన ఇబ్బందులను నివారించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుండి బకాయిలు ఉన్నాయనే కారణం చూపుతూ నెట్‌వర్క్ ఆస్పత్రులలో డబ్ల్యూజెహెచ్ఎస్ కార్డును అనుమతించడంలేదన్నారు. కొన్ని ప్రాసెస్‌లకు కూడా కార్డు వర్తించని పరిస్థితి నెలకొందన్నారు. ఇటువంటి లోటుపాట్లను సవరించి డబ్ల్యూజెహెచ్ఎస్‌ను మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ఈ పథకం అమలులో చోటుచేసుకుంటున్న రోజువారీ సమస్యల పరిష్కారానికి సమాచార శాఖ, ఎన్టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో త్రైపాక్షిక పర్యవేక్షక



యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు నివేశన స్థలాలిస్తామని కూటమి ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన కోరారు. కూటమి రెండేళ్ళ పాలనలో నివేశన స్థలాల వ్యవహారంపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు మినహా ఆచరణకు నోచుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. 2018-19లో ఎన్నికల ముందు ప్రకటించిన హౌసింగ్ పథకం అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ఇళ్ళ స్థలాల విషయమై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. మిగిలిన రాష్ట్రాలలో మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పరంగా పాత్రికేయ ఫించన్ పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జర్నలిస్టుల భద్రతకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని సత్యం కోరారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వాగోలు బాబూరావు, ఎపిడబ్ల్యూజెఎస్ ప్రెస్ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ రాచాబత్తుని శ్రీనివాసరావు, జర్నలిస్టులు కనపర్తి వెంకయ్య, పి.శ్రీను, కె.వరప్రసాద్, నాగబాబు, వెంకీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

18-8Pg5_18-8Pg5.qxd 17/Aug/26 10:26 PM Page 1



# ప్రజాప్రతినిధులపై 4,192 కేసులు

## 326 మంది ఎంపిలు, 14 మంది సిఎంలపై క్రిమినల్ కేసులు

## తెలంగాణ సిఎం రేవంత్‌పై 89, బెంగాల్ సిఎంపై 29, కర్ణాటక సిఎంపై 19

### సుప్రీంకోర్టుకు అమికస్ క్యూరీ నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** రాజకీయాల్లో నేరపూరిత ధోరణులపై సుప్రీంకోర్టుకు సమర్పించిన ఒక నివేదిక ప్రకారం, లోక్‌సభలోని 543 మంది సభ్యులలో 251 మందిపై, రాజ్యసభలోని 233 మంది సభ్యులలో 75 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఎంపిలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో 'అమికస్ క్యూరీ'గా నియమితులైన సీనియర్ న్యాయవాది విజయ్ హన్సా రియా సుప్రీంకోర్టులో సమర్పించిన అఫిడవిట్‌లో ఈ వివరాలు వెల్లడించారు. పార్లమెంటు సభ్యులు, శాసనసభ సభ్యులపై మొత్తం 4,000కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. దేశంలోని 28 రాష్ట్రాలకు గాను 14 రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమపై తీవ్రమైన నేరాలతో సహా క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారని ఆ అఫిడవిట్ తెలిపింది.

ఆ గణాంకాల ప్రకారం, తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిపై 89 కేసులు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి (29 కేసులు), కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ (19 కేసులు) ఉన్నారు. కేసుల విచారణ వేగంగా జరిగేలా సుప్రీంకోర్టు, హైకోర్టులు పర్యవేక్షి స్తున్న ప్పటికీ, 2018 నుండి ఎంపిలు, ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల సంఖ్య దాదా పు ఒకే స్థాయిలో కొనసాగుతోందని హన్సా రియా కోర్టుకు నివేదించారు. వివిధ హైకోర్టుల నుండి సమాచారాన్ని సేకరించిన అమికస్, 2025లో 1,243 క్రిమినల్ కేసుల పరిష్కారం జరిగిందని, అదే సమయంలో 1,050 కొత్త కేసులు నమోదయ్యాయని సుప్రీంకోర్టుకు తెలిపారు.

మాజీ, ప్రస్తుత ఎంపిలు/ఎమ్మెల్యేలపై మొత్తం 4,192 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన కోర్టుకు వివరించారు. "అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదికను ప్రస్తావిస్తూ సమర్పించిన అఫిడవిట్ ప్రకారం, లోక్‌సభలోని 543 మంది సభ్యులలో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 170 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు (ఐదేళ్ల లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడే అవకాశం ఉన్నవి) నమోదయ్యాయి.

అలాగే, రాజ్యసభలోని 233 మంది సభ్యులలో 75 మంది (33 శాతం) పై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 40 మంది (18 శాతం)పై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి.

అలహాబాద్ హైకోర్టు నుండి నివేదిక అందకపోవడంతో ఉత్తరప్రదేశ్ మినహా, వివిధ హైకోర్టులు సమర్పించిన నివేదికల విశ్లేషణను కూడా ఆ సీనియర్ న్యాయవాది దాఖలు చేశారు. న్యాయవాది స్నేహ కలిత ద్వారా దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం, కేరళకు చెందిన 20 మంది ఎంపిలలో 19 మంది (95 శాతం) క్రిమినల్ ఆరోపణలను ఎదుర్కొంటున్నారు, వీరిలో 11 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయి.

తెలంగాణకు చెందిన 17 మంది ఎంపీలలో 14 మంది (82 శాతం) పై క్రిమినల్ ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఒడిశాలో 76 శాతం (21 మందిలో 16 మంది), జార్ఖండ్‌లో 71 శాతం (14 మందిలో 10 మంది), తమిళనాడులో 67 శాతం (39 మందిలో 26 మంది) ఎంపిలపై కేసులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బీహార్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి ఇతర ప్రధాన రాష్ట్రాల్లో దాదాపు 50శాతం మంది ఎంపిలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

హర్యానా (10 మంది ఎంపిలు), ఛత్తీస్‌గఢ్ (11 మంది ఎంపిలు) రాష్ట్రాల్లో ఒక్కొక్క ఎంపిపై మాత్రమే క్రిమినల్ ఆరోపణలు ఉన్నాయి. పంజాబ్‌లో 13 మందిలో ఇద్దరు, అసోంలో 14 మందిలో ముగ్గురు, ఢిల్లీలో ఏడుగురిలో ముగ్గురు, రాజస్థాన్‌లో 25 మందిలో నలుగురు, గుజ రాత్‌లో 25 మందిలో ఐదుగురు, మధ్యప్రదేశ్‌లో 29 మం దిలో తొమ్మిది మంది ఎంపిలపై క్రిమినల్ ఆరోపణలు ఉన్నాయి.

ఎంపిలు/ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అత్యున్నత న్యాయస్థానం పర్యవేక్షణ అవసరమని 'అమికస్ క్యూరీ' పేర్కొన్నారు. ఎంపిలు/ఎమ్మెల్యేల కేసుల విచారణను ప్రత్యేక కోర్టులు మాత్రమే చేపట్టాలని, ఆ కేసుల విచారణ పూర్తయిన తర్వాతే ఇతర కేసులను చేపట్టాలని ఆయన కోరారు. అన్ని జిల్లాల ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జీలు, ప్రత్యేక కోర్టులకు సాధారణ కోర్టు విధులను కేవలం విచారణ.

సుమోటో రిట్ పిటిషన్లలో, హైకోర్టులు న్యాయపరంగా నెలవారీగా విచారణ పురోగతిని పర్యవేక్షించాచాలి. అలాగే, అభియోగాలు నమోదు చేసిన తేదీ నుండి ఏడాదిలోపే పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను వేగంగా ముగించేలా చూడాలి అని అమికస్ న్యాయవాది తెలిపారు. మూడేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులను హైకోర్టులు సూమోటాగా పర్యవేక్షి ంచి, ప్రతి కేసు లోనూ సమర్థవంతమైన ఉత్తర్వులు జారీ

# ఒమన్ జోక్యం చేసుకుంటే బాంబులతో ధ్వంసం చేస్తాం

## యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్,ఆగస్టు 17:** ఇరాన్ నౌకలపై అమెరికా విధించిన దిగ్బంధనానికి ఒమన్ అడ్డుపడితే ఆ దేశంపై బాంబులతో దాడి చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్‌పై ఒత్తిడి పెంచేందుకే హర్ముజ్ జలసంధిలో నౌకలపై దిగ్బంధనం విధించినట్లు ఆయన తెలిపారు. ఒమన్ మా చర్యలకు అడ్డుగా వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్‌పై విధించిన దిగ్బంధనం ఆ దేశంపై ఒత్తిడి పెంచుతోందని చెప్పారు. అయితే ఇరాన్‌తో వివాదానికి ముగింపు పలికేందుకు తన వద్ద ఎలాంటి కాలపరిమితి లేదని, తాను తొందర పడటం లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లొంగి పోతున్నట్లు తెల్ల జెండా ఎగురవేయాలి అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) అధికారులతో అమెరికా చర్చలు జరుపుతున్న విషయాన్ని కూడా ఆయన ధ్రువీకరించారు. వారు మంచి పోకర్ ఆటగాళ్లు కానీ వారు చనిపోతున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు. నాకు ఎలాంటి కాలపరిమితి లేదు. నేను తొందరపడటం లేదు. అమెరికా మధ్యంతర ఎన్నికలకు నా ఆలోచనలకు ఎలాంటి సంబంధం లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌కు అణ్వా యుధం ఉండకూడదు ఇరాన్ అణ్వా యుధాన్ని సమకూర్చుకోవడాన్ని తాను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోనని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్‌కు ఏ విధంగానూ, ఏ రూపంలోనూ అణ్వాయుధం ఉండకూడదు. ఇదే మొదటి లక్ష్యం ఎప్పటికీ ఇదే మొదటి లక్ష్యంగా ఉంటుందని తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, హర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలకు సంబంధించిన మార్గ పటంపై ఒమన్‌తో అవగాహనకు వచ్చినట్లు ఇరాన్ ప్రకటించింది. దీనికి సంబంధించిన వివరాలను ఖరారు చేసి, సంయుక్త ప్రకటన విడుదల చేసేందుకు ఇరు దేశాలు కసరత్తు చేస్తున్నాయి. నౌకల రవాణా మార్గానికి సంబంధించిన మ్యాప్‌పై అవగాహన కుదిరింది. మ్యాప్‌తో పాటు సంయుక్త ప్రకటనను కలిపి ఒక ప్యాకేజీగా ఖరారు చేయాలని మేము ముందుగానే నిర్ణయిం చుకున్నాం. ఆ ప్రక్రియ కొనసాగుతోందని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తెలిపారు. హర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలను ఎలా నిర్వహించాలన్న అంశంపై ఇరాన్, ఒమన్ దేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే నౌకలు ఇరాన్‌కు సమీపంలోని మార్గం ద్వారా హోర్ముజ్‌లోకి ప్రవేశించి, ఒమన్‌కు సమీపంలోని మార్గం ద్వారా బయటకు వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం.



# రాహుల్‌గాంధీకి సుప్రీంలో ఊరట

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హైకోర్టు తీర్పుపై సుప్రీంస్టే



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** రాహుల్ గాంధీకి ఇది ఒక పెద్ద ఊరట. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఆరోపణలపై అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. హైకోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ పూర్తయ్యే వరకు, కాంగ్రెస్ నాయకుడిపై ఉన్న ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ముందుకు తీసుకెళ్లవద్దని అలహాబాద్ హైకోర్టును సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడికి సంబంధించిన ఈ కేసులో, తన ఆదేశాల మేరకు హైకోర్టుకు ఎలాంటి నివేదిక దాఖలు చేయవద్దని సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లను కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, గాంధీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలను పరిగణనలోకి తీసుకుని, హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కర్ణాటక నివాసి ఎస్. విఘ్నేష్ శిశిర్‌తో పాటు సిబిఐ, ఇడిలకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరిగే తేదీ వరకు ఈ కేసు తదుపరి విచారణను వాయిదా వేయాలని ధర్మాసనం అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులోని ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, ఇది ఆదాయానికి మించిన ఆస్తుల కిందకు వస్తుందని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వి రాజు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తీవ్రంగా స్పందించిన ధర్మాసనం, 'ఆరోపణలు అంత తీవ్రమైనవే అయితే, దర్యాప్తు సంస్థలు ఇన్నాళ్లు ఎందుకు ఊరుకున్నాయి? దర్యాప్తు లేదా విచారణ ప్రారంభించడానికి కోర్టుల నుంచి ఒత్తిడి లేదా ఆదేశాలు వచ్చే వరకు ఎందుకు వేచిచూశాయి? చట్టప్రకారం మీకున్న స్వయంప్రతిపత్తి అధికారాలతో సొంతంగా ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ సిబిఐ, ఇడి, కేంద్రంపై సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

# డైరెక్టర్ సుధా కొంగరకు ఊరట


**చెన్నై, ఆగస్టు 17:**ప్రముఖ సినీ దర్శకురాలు సుధా కొంగరకు మద్రాస్ హైకోర్టులో భారీ ఊరట లభిం చింది. బాకీ ఉన్న రూ.8.39 కోట్లు నాలుగు వారాల వ్యవధిలో సుధా కొంగరకు ఇవ్వాలని 'డాన్ పిక్చర్స్' సంస్థను ఆదేశించింది. నిర్ణీత గడువులోగా చెల్లించకపోతే, ఆ నిర్మాణ సంస్థ భవిష్యత్తులో నిర్మించే చిత్రాల ద్వారా వచ్చే లాభాల నుంచి ముందుగా సుధా కొంగర బాకీని తీర్చాల్సి ఉంటుందని పేర్కొంది. మద్రాస్ హైకోర్టు తీర్పుతో సుధా కొంగర ఊపిరి పీల్చుకున్నారు. శివకార్తికేయన్, శ్రీలీల జంటగా ఆమె దర్శకత్వంలో తెరకెక్కిన 'పరాశక్తి' చిత్రం పొంగల్ కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైన సంగతి తెలిసిందే. సినిమా పరాజయం కావ డంతో, నిర్మాణ సంస్థ 'డాన్ పిక్చర్స్' సుధా కొంగరకు ఇవ్వాల్సిన రూ.8.39కోట్ల పారి తోషికాన్ని ఎగ్గొట్టడంతో ఆమె న్యాయం కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

# షెహజాద్‌భట్టి ఉగ్రనెట్‌వర్క్ భగ్నం: అమిత్‌షా

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న షెహజాద్ భట్టి నెట్‌వర్క్‌పై భద్రతా బలగాలు భారీ దాడులు నిర్వహించాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం తెలిపారు. దేశవ్యాప్తంగా 14రాష్ట్రాల్లో సమన్వయంతో చేపట్టిన ఆపరే షన్లలో 200 మందికి పైగా నెట్‌వర్క్ కార్య కర్తల ను అరెస్టుచేసి, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విధ్వంసక చర్యలకు ఉగ్రవాద సంస్థ చేసిన కుట్రలను భగ్నంచేసినట్లు ఆయన వెల్లడించారు.

# ఎగ్జామ్ స్కాంలను సరిదిద్దండి..లేదంటే నిరసనకు దిగుతా

## మోడీ ప్రభుత్వానికి బాబా రాందేవ్ హెచ్చరిక



**హరిద్వార్, ఆగస్టు 17:** భారతీయ జనతా పార్టీకి వీర విధేయుడుగాభావించే యోగా గురు బాబా రామ్‌దేవ్ తాజా వ్యాఖ్యలు నెట్టింటసంచ లనంగా మారాయి. విద్య, నియామక పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేస్తున్న ఆందోళనలకు రామ్‌దేవ్ మద్దతుగా నిలవ డమేకాదు, ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృ త్వంలోని కేంద్ర సర్కార్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేయడం విశేషం. కేంద్రం త్వరగా ఈ 'ఘప్లా'(స్కామ్‌లను) ను సరిదిద్దకపోతే, ఈ ఆందోళన మరింత తీవ్ర రూపం దాల్చవచ్చని, ప్రభుత్వం ఈ సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని హితవు పలికారు. లేకపోతే తాను కూడా నిరసన చేపట్టాల్సి రావ చ్చునని వ్యాఖ్యానించారు. 80వస్వాతంత్ర్య దినో త్సవం సందర్భంగా హరిద్వార్‌లోని పతంజలి యోగపీఠ్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వానికి కీలక హెచ్చరికలు చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యా యులు, నీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సౌక ర్యాల కొరతపై విద్యార్థులు నిరసన గురించి ప్రస్తా వించారు. ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక ప్రక్రియపై అవినీతి, ధనబలం ప్రభావం చూపుతున్నాయని కూడా ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగ ఇంటర్వ్యూలలో అవినీతి 99 శాతం వరకు ఉందని రామ్‌దేవ్ మండిపడ్డారు. రాజకీయ కారణాలతో లేదా కులం పేరుతో ఒకరిపై ఒకరు ద్వేషం, కక్ష పెంచుకునే వారిని ఖండిస్తున్నా అని అన్నారు. పరస్పర శత్రుభావంతో నిలబడటం ఎంత దారుణమని బాబా రామ్‌దేవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేయాల్సిందే: సుప్రీం

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** కావేరి నదీ జలాలను తమిళనాడుకు విడుదల చేసే అంశంలో కావేరి నీటి నిర్వహణ ప్రాధికార సంస్థ (సిడబ్ల్యుఎంఎ) జారీ చేసిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని కర్ణాటక ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. తమకు కేటాయించిన నీటిని కర్ణాటక విడుదల చేయడం లేదని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా తాము ఇప్పటికే నీటిని విడుదలు చేస్తున్నా నమని, సోమవారం ఉదయం నాటికి 12 వేల క్యూసెక్కులకుపైగా నీటిని విడుదలు చేస్తున్నట్లు కర్ణాటక ప్రభుత్వం ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చింది. ఇరుపక్షాల వాదనల అనంతరం సిడబ్ల్యుఎంఎఆదేశాలనుఖచ్చితంగా అనుసరించాలని కర్ణాటకను ఆదేశించింది. అలాగే నీటి సరఫరాకు సంబంధించిన పరిస్థితులను తాము నిశితంగా పర్యవేక్షిస్తామని, నీటి విడుదలకు సంబంధించిన తాజా నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 24కి వాయిదా వేసింది.


# అయోధ్య విరాళాల దుర్వినియోగం కేసు సిట్ నివేదిక బహిర్గతం చేసేందుకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** అయోధ్యరామమందిర విరాళాల దుర్వినియోగం, చోరీ ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి తన మునుపటి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన 'సిట్' (ప్రత్యేక దర్యాప్తు బృందం) నివేదికను బహిర్గతం చేయాలని ఆదేశించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. "ప్రస్తుతానికి నివే దికను బహిర్గతం చేయాలని ఆదేశించలేము.. దీనిపై తర్వాత పరిశీలిస్తాము.. ప్రస్తుతం మా దృష్టి కేవలం సిట్ దర్యాప్తుపైనే ఉంది.. అది తార్కిక ముగింపునకు చేరాలి" అని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. "సిట్‌ని తామే ఏర్పాటు చేశాము. అది మాకు జవా బుదారీగా ఉంటుంది. అది మాకు నివేదిక సమ ర్పించాల్సి ఉంటుంది. ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా కలిగి ఉన్న ఈ సిట్, తన స్థితిగతుల నివే దికను (స్టేటస్ రిపోర్ట్) సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు సమర్పిస్తుంది. అయితే, ఆ నివేదికను ముందుగా తాము పరిశీలిస్తాము. దానిని అన్ని పక్షాలకు విడుదల చేయాలా వద్దా అని నిర్ణయిస్తాము" అని ధర్మాసనం పేర్కొంది. సిట్ నివేదికను 3 వారాల్లోగా సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది.

# దీమాగి నక్సల్స్ అంటే వీళ్లే..

## ప్రధాని వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి రిజిజు వివరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ప్రధాని నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చేసిన దిమాగీ నక్సల్స్ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. అసలు దిమాగీ నక్సల్ అంటే ఎవరనే ప్రశ్నలు ప్రతిపక్షాల నుంచి వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. ఆ పదంతో ఎవరిని ఉద్దేశిస్తున్నారో మూడు అంశాల ద్వారా వివరించారు. మావోయిస్టులకు మద్దతు ఇస్తూ రాజ్యాంగాన్ని తిరస్కరించేవారిని 'దిమాగీ నక్సల్స్‌గా పరిగణించవచ్చని రిజిజు చెప్పారు. ఇక, వేర్పాటువాదులకు మద్దతు ఇచ్చేవారు,



ఆర్టికల్ 370కి అనుకూలంగా నిలిచేవారు రెండో వర్గంలోకి వస్తారని పేర్కొన్నారు. దేశ సమైక్యతకు ముప్పు కలిగించే ఆలోచనలను ఆయన ఈ అంశాలతో ముడిపెట్టారు. ఈశాన్య రాష్ట్రాలను దేశంలోని మిగతా ప్రాంతాల నుంచి వేరు చేయాలని కోరుకునేవారు మూడో వర్గమని రిజిజు అన్నారు. సిలిగురి కారిడార్‌ను చికెన్ నెక్‌గా పిలుస్తారు. పశ్చిమ బెంగాల్‌లోని ఈ ఇరుకైన మార్గమే ఈశాన్య ప్రాంతాలకు దేశంలోని మిగతా ప్రాంతాలతో ప్రధాన అనుసంధానం. దీన్ని విడదీయాలని కోరుకునే వారి గురించి రిజిజు ప్రస్తావించారు. ఆగస్టు 15న ఎర్రకోట నుంచి ప్రసంగించిన మోడీ అడవుల్లో సాయుధ నక్సలిజాన్ని అణచివేశామని చెప్పారు. అయితే మావోయిస్టు భావజాలం మరో రూపంలో కొనసాగుతోందని హెచ్చరించారు. అధికార వ్యవస్థలోకి చొరబడిన అలాంటి భావజాలాన్ని గుర్తించి ఒంటరి చేయాలని పిలుపునిచ్చారు. మోడీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత పి. చిదంబరం స్పందిస్తూ తాను దిమాగీ నక్సల్‌గా గర్విస్తున్నానని అన్నారు.



## ఉక్రయిన్‌పై రష్యా క్షిపణి దాడి

# లక్ష్మీమిట్టల్ స్టీల్ ప్లాంట్ ధ్వంసం

## ఇద్దరి మృతి, పలువురికి తీవ్రగాయాలు

**కీవ్, ఆగస్టు 17:** భారత సంతతి బిలియనీర్ లక్ష్మీ మిట్టల్‌కు చెందిన స్టీల్ ఫ్యాక్టరీపై క్షిపణి దాడి జరిగింది. ఉక్రెయిన్‌లోని క్రివి రిహ్‌నగరంలో ఆర్సెలార్ మిట్టల్ మైనింగ్ అండ్ మెటలర్జికల్ కాంప్లెక్స్ పైకి రష్యా నుంచి క్షిపణి దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, 14 మంది కార్మికులు గాయపడ్డారు. ఈ దాడి కారణంగా కోర్ ఎనర్జీ, బ్లాస్ట్ ఫర్నేస్ కార్యకలాపాలు దెబ్బతినడంతో ఉత్పత్తి పాక్షికంగా నిలిచిపోయింది. రష్యా-ఉక్రెయాన్ యుద్ధం ప్రారంభమై నాలుగేళ్లు దాటింది. మధ్య మధ్యలో దాడులు కాస్త తగ్గినా ఇటీవల తీవ్రరూపం దాల్చాయి. రష్యాలోని సైనిక పరిశ్రమలు, ఇంధన సదుపాయాలను కీవ్ లక్ష్యంగా చేసుకుంటోంది. దీంతో పుతిన్ ప్రభుత్వం ఇంధన కొరతతో సతమతమవుతోంది. ఇదిలా ఉండగా ఆదివారం రష్యా వ్యాప్తంగా వందల డ్రోన్లతో ఉక్రెయిన్ విరుచుకు పడింది. ఈ దాడుల్లో ఆరుగురు మృతి చెందారు. యుద్ధం ప్రారంభం నుంచి ఉక్రెయిన్ నిర్వహించిన అతిపెద్ద గగనతల దాడుల్లో ఇదీ ఒకటి. రాత్రికి రాత్రే దాదాపు 822 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేశామని మాస్కో అధికారులు వెల్లడించారు. రష్యా సంపన్న మహిళ తత్యానా కిమ్‌కు చెందిన వైల్డ్ బెర్రీస్ సంస్థపై ఈ దాడుల ప్రభావం తీవ్రంగా ఉంది. ఇదొక ఆన్‌లైన్ రిటైలర్ సంస్థ. ఉక్రెయిన్ వరుసదాడులలో ఈ కంపెనీ వేర్‌హౌస్‌లు మంటల్లో చిక్కుకున్నాయి. దీనికి ప్రతిగా ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. ఈ క్రమంలో జరిగిన క్షిపణి దాడిలో లక్ష్మీ మిట్టల్ ఫ్యాక్టరీ మంటల్లో చిక్కుకుంది. ఈ దాడిని కంపెనీ ధ్రువీకరించింది. లక్ష్మీ మిట్టల్ సంస్థ ఉక్రెయిన్‌లోనే అతిపెద్ద స్టీల్ ఉత్పత్తిదారుగా ఉంది. మరోవైపు, రష్యా దాడుల ప్రభావం రాజధాని కీవ్‌లో కూడా కని పించింది. నగరంలోని అతిపెద్ద బుక్ మార్కెట్‌లో మంటలు చెలరేగాయి. పుతిన్ సేనల దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తంచేశారు. పౌర సదుపాయాలపై రష్యా దాడులు చేస్తోందని ఆరోపించారు.

# బిజెపి సోషల్ మీడియా విభాగం కన్వీనర్‌గా దీపక్ మాస్కే



**న్యూఢిల్లీ,ఆగస్టు 17:** రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ తన జాతీయ బృందంలో కీలక మార్పులు చేసింది. ఇందులో భాగంగా దీపక్ మాస్కేను పార్టీ సోషల్ మీడియా విభాగం కన్వీనర్‌గా నియమించింది. ఆయనకు సహాయకులుగా ప్రీతి గాంధీ, శివానంద ద్వివేది, అలోక్ భట్, అరుణ్ యాదవ్‌లను సోషల్ మీడియా కోకన్వీనర్లుగా నియమించింది. బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జ్‌గా చాలాకాలంగా పనిచేసిన అమిత్ మాలవీయ కొత్త బృందాన్ని అభినందించారు. సోషల్ మీడియా విభాగం అధిపతిగా తన స్థానంలో దీపక్ మాస్కే బాధ్యతలు స్వీకరించనున్నారని ఆయన తెలిపారు. దీపక్ మాస్కే జీతో పాటు కోకన్వీనర్లుగా నియమితులైన ప్రీతి గాంధీ, శివానంద ద్వివేది, అలోక్ భట్, అరుణ్ యాదవ్‌లకు ప్రత్యేకంగా అభినందనలు. గత దశాబ్ద కాలంగా వీరందరితో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది. వారి నాయకత్వంలో బీజేపీ డిజిటల్ కమ్యూనికేషన్ మరిన్ని మైలురాళ్లను చేరుకుంటుందని, ప్రజా చర్చను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దుతుందని నమ్ముతున్నాను" అని మాలవీయ పేర్కొన్నారు.

# జార్ఖండ్‌లో నిరసనకారులతో చర్చించండి


## సీఎం హేమంత్ సోరెన్‌కు రాహుల్‌గాంధీ లేఖ



**రాంచి, ఆగస్టు 17:** జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పం దించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను కలిసి వారి సమస్యలను వినాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కోరారు. ఈ మేరకు ఆగస్టు 14న సోరెన్‌కు రాహుల్ గాంధీ లేఖ రాశారు.

# సంక్షిప్త వార్తలు

## ఇరాన్‌పై అణుదాడికి అమెరికా సిద్ధం!



**వాషింగ్టన్, ఆగస్టు 17:** అమెరికా కాంగ్రెస్ మాజీ సభ్యురాలు, రిపబ్లికన్ పార్టీ నాయకురాలు మర్జోరీ టేలర్ గ్రీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అణ్వా యుధాలను నియంత్రించడమే తమ లక్ష్యమని అగ్ర రాజ్య అధ్యక్షుడు ట్రంప్ బయటకు చెప్తున్నప్పటికీ ఇరాన్‌పై అణుదాడులు ప్రారంభించడానికి రహస్యంగా సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నారు. త్వరలో ఈ అణుదాడులు చేయడానికి ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారులు వ్యూహాత్మక సమావేశాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అణుదాడుల వల్ల ప్రపంచం మొత్తం సంఘర్షణలోకి, ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## 1.6 లక్షల మంది ఫాలోయ్యర్లు.. ఆ వెంటనే అదృశ్యం



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** దిమాగీ నక్సల్ పార్టీ పేరుతో ఉన్న ఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ఒక్కసారిగా తెరపైకి వచ్చి, కేవలం ఒక్కరోజులోనే 1.6లక్షలకు పైగా ఫాలోవర్లను సంపాదించింది. అయితే ఎంతవేగంగా వెలుగులోకి వచ్చిందో అంతే వేగంగా అదృశ్యమైంది. ఈ ఖాతాలో మొత్తం 62 పోస్టులు ఉండగా, సుమారు 35 మందిని ఫాలో అవుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్‌లో సమాచారం కనిపించింది. ఖాతా ఈ నెలలోనే ప్రారంభమైనట్లు వివరాలు వెల్లడించాయి. ఖాతా యూజర్‌నేమ్‌ను ఒకసారి మార్చినట్లు కూడా లాగ్‌లో నమోదైంది. అయితే ఈ ఖాతాను ఎవరు నిర్వహించారనే వివరాలు మాత్రం వెల్లడికాలేదు.

## ఉజ్జయిని దేవాలయంలో తొక్కిసలాట: పలువురికి గాయాలు

**ఉజ్జయిని, ఆగస్టు 17:** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జెయినిలో ఉన్న దేవాలయంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. దైవ దర్శనానికి భక్తులు పోటెత్తడంతో ఈ ఘటన జరిగింది. పోలీసులు స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మధ్యప్రదేశ్, ఉజ్జెన్‌లో ప్రసిద్ధ మహాకాళేశ్వర ఆలయ ప్రాంగణంలోనే శ్రీహరసిద్ధి మాతా శక్తిపీఠ్ టెంపుల్, శ్రీబడా గణేష్ మందిర్ పరిధిలో సోమవారం ఉదయం ఈ ఘటన జరిగింది. ఇక్కడే నాగచంద్రేశ్వర ఆలయం కూడా ఉంది. శ్రావణ సోమవారం కావడంతో నాగచంద్రేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. అక్కడ ఏదో విద్యుత్ షాక్ తగిలింది అనే ప్రచారం జరగడంతో ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది.

## బీర్‌భుమ్ హోటల్‌లో అగ్నిప్రమాదం: ఐదుగురు సజీవదహనం



**కోల్‌కత్తా, ఆగస్టు 17:** పశ్చిమ బెంగాల్‌లో ఒక హోటల్‌లో జరిగిన ఈ ప్రమాదంలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన బీర్భూమ్ జిల్లా, తారాపీట్ లోని ఒక హోటల్‌లో సోమవారం వేకువజామున జరిగింది. కస్టమర్లు, సిబ్బంది గాఢనిద్రలో ఉండగా, ఉదయం 4.00 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. తారాపీట్ ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక కేంద్రం. ఇక్కడి దేవాలయానికి భక్తులు భారీగా వస్తుంటారు. ఈ రోజు చివరి శ్రావణ సోమవారం కావడంతో భక్తులు భారీగా వచ్చారు.

## ఎల్పీజీ ఇకేవైసి గడువు 23వరకూ పొడిగింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:**ఎల్పీజీ కనెక్షన్ వినియోగదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చే వార్త అందించింది. ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయడానికి నిర్దేశించిన గడువును ఈనెల 16 నుంచి ఆగస్టు 23 వరకు పొడిగించారు. సర్వర్ సమస్యల వల్ల లేదా సమయం లేక ఇప్పటివరకు ధృవీకరణ పూర్తి చేసుకోని వారికి ఇది నిజంగా శుభవార్త. అయితే ఈ గడువు పెంపు కొంత వెసులుబాటును ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయి సాంకేతిక అవస్థల వల్ల పౌరుల ఇబ్బందులు పూర్తిస్థాయిలో తొలిగిపోలేదు. గడువు పొడిగించినప్పటికీ సర్వర్ సమస్యలు వినియోగదారులను తీవ్రంగా వేధిస్తున్నాయి.

## ప్రశ్నపత్రాల లీకేజిలపై 50 మందికిపైగా సిబ్బంది తొలగింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల్లో అవకతవకల పై కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండడంతో జాతీయ పరీక్షల ఏజెన్సీ ఎన్టీయే కీలక చర్యలు చేపట్టింది. పరీక్షా విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసే చర్యల్లో భాగంగా 50 మందికిపైగా సిబ్బందిని తొలగించింది. సంస్థలోని కీలక స్థానాల్లో నిపుణులను నియమిస్తున్నది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ప్రకటన వెలువరించింది.

MN 10 final:MN 10 final 01/01/2001 09:41 Page 1



# భక్తిశ్రద్ధలతో గరుడ పంచమి వేడుకలు

**పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త:** టెంపుల్ సిటీగా ప్రసిద్ధిగాంచిన స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయ ప్రాంగణంలో కొలువై ఉన్న అతిపెద్ద ఏకశిలాగరుత్మంతస్వామివారికి గరుడ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. తొలుత అర్చకస్వాములు వివిధ రకాల అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు మాట్లాడుతూ శ్రావణ మాసంలో శుక్ల పక్షం ఐదవ రోజున(పంచమి)జరుపుకునే పండుగనే గరుడ పంచమి అంటారన్నారు. శ్రీ మహావిష్ణువు దివ్య వాహనమైన గరుడ దేవుని పూజకు అంకితం చేయబడిన పవిత్రమైన పర్వదినమన్నారు. ఈ రోజున గరుడుని ఆరాధించడం వల్ల సర్ప దోషాలు తొలగిపోతాయన్నారు. విషభయాలు, అనారోగ్యాలు దూరమై కుటుంబానికి రక్షణ లభిస్తుందని భక్తుల విశ్వాసమన్నారు. గరుడ ఆరాధన వల్ల కాలసర్ప దోషాలు, కుజ దోషాల ప్రభావం తగ్గి, సర్పాల వల్ల ఎలాంటి హాని జరగదని భక్తుల విశ్వాసమన్నారు. గరుడుని రెక్కల శబ్దం సామవేద మంత్రాల ఉచ్చారణతో సమానమని చెప్పారు. గరుడ పంచమినాడు గరుడ మంత్రాలు పఠించడం వల్ల ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయన్నారు. ఈ సందర్భంగా హోమాలు, పుష్పయాగాలు, రాత్రికి స్వామివారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుప్తా, సభ్యులు కత్తుల రవికిరణ్, శ్రీలక్ష్మి, వాసంతి, విజయలక్ష్మి, రాంబాబు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీనియర్ అసిస్టెంట్ వట్టికూటి వాసు, సిబ్బంది తదితరులు ఏర్పాట్లు చేశారు.



# ఎస్సీల సంక్షేమాన్ని గాలికొదిలేసిన ఎంపీలు, ఎమ్మెల్యేలు

## -మాల యువసేవ రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య

**పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 25మంది ఎమ్మెల్యేలు, దేశ పార్లమెంట్‌లో నలుగురు పార్లమెంట్ సభ్యులు ఉండి కూడా



రాష్ట్రంలోని ఎస్సీ సామాజిక వర్గ సంక్షేమాన్ని గాలికొదిలేశారని ప్రముఖ న్యాయవాది, మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య ధ్వజం చేశారు. పాత పొన్నూరులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం రాత్రి మాల యువ చైతన్య సదస్సు జరిగింది. సదస్సులో చైతన్య మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గం ఓట్లతో గెలుపొంది ఎస్సీ సామాజిక వర్గానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చకుండా వారు మాత్రం పదవులు అనుభవిస్తున్నారని ఆరోపణ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో సబ్‌ప్లాన్ నిధుల మీద, అదే విధంగా నిర్వీర్యం అవుతున్న పథకాలపై చర్చలేవనెత్తకపోతే బానిసలుగా గుర్తించి, రాబోయే రోజుల్లో ఎస్సీ సామాజికవర్గం ఎమ్మెల్యేల, ఎంపీల ఇళ్ళను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. మాల యువ చైతన్య సభలు రాష్ట్ర వ్యాప్తంగా జరగాలని తాము కోరుకొంటున్నామన్నారు. ఎస్సీ సామాజిక వర్గంలో ప్రశ్నించే తత్వం రావాలని, అప్పుడైనా మన సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలకు చలనం వస్తుందేమో చూద్దామన్నారు. రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎస్సీ సామాజిక వర్గం గురించి ఆలోచించకపోవడం శోచనీయమన్నారు. వీసికె రాష్ట్ర నాయకుడు ఎం.జె.విద్యాసాగర్ మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎంతో మంది ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఉన్నప్పటికీ ఆ సామాజిక వర్గం అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎస్సీ సామాజికవర్గం అభివృద్ధికి ఇప్పటికైనా ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించాలని, లేకపోతే రాబోయే రోజుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన మామిడి సునీల్ మాట్లాడుతూ మాల యువ చైతన్య సదస్సులు రాష్ట్ర వ్యాప్తంగా జరిగినట్లయితే ఈ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వానికి కూడా తెలిసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సులో ఇండియన్ లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మద్దు అంకమ్మ, ఎంఆర్‌పిఎస్ అశోక్, ఎడ్ల రత్నరాజు, పెదపూడి సుధాకర్, రేగులగడ్డ వాసు, డి.పృథ్వీ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో పుట్టుకతో అంధత్వంతో పుట్టి కష్టపడి సచివాలయ ఉద్యోగం సాధించిన గొట్టిపాటి సునీతను ఘనంగా సత్కరించారు.

# విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

## -ఏపిడబ్ల్యూజె పొన్నూరుశాఖ అధ్యక్షుడు మహమ్మద్ షరీఫ్

**పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త:** విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి గురువులు బోధిస్తున్న పాఠ్యాంశాల పట్ల శ్రద్ధ పెట్టాలని ఎపిడబ్ల్యూజె పొన్నూరుశాఖ అధ్యక్షుడు మహమ్మద్ షరీఫ్ సూచించారు. ఏపిడబ్ల్యూజె 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన సేవా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి తల్లి,తండ్రి, గురువు, దైవాన్ని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో శ్రమిస్తే తప్పకుండా లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. సీనియర్ జర్నలిస్టు ధూళిపాళ్ళ శ్రీధర్ మాట్లాడుతూ వార్తాపత్రికలు సమాచారాన్ని అందిస్తూ, నిజాలను వెలికి తీయడంతోపాటు భాషా ప్రచారానికి ఉపయోగపడతాయన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రతి నిత్యం వార్తా పత్రికలను చదవడం ద్వారా భాషపై పట్టు సాధించవచ్చన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలను, సమస్యలను వెలికితీయడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు చురుగ్గా పనిచేస్తున్నాయన్నారు. అనంతరం నేతాజీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బోధనోపకరణ సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో విలేఖరులు పెరవలి చలపతిరావు, మొహమ్మద్ జిలాని, సత్తార్, అనీల్, గేరా సురేష్, సిలార్‌బాషా, ధూళిపాళ్ళ రవి తదితరులున్నారు.



# విజ్ఞాన్స్ లారాలో ఘనంగా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ప్రారంభం

## -3వేల మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం


**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 17,ప్రభాతవార్త:** విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణాన్ని కల్పించడంతో పాటు, ఆధునిక మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం,



వడ్లమూడిలోని విజ్ఞాన్స్ లారా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) మరో ముందడుగు వేసింది. సంస్థలో నూతనంగా నిర్మించిన విజ్ఞాన్స్ లారా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య సతీమణి లావు నిర్మల, విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి సోమవారం ఘనంగా ప్రారంభించారు. పూజా కార్యక్రమాల అనంతరం వారు నూతన భవనంలోని వివిధ విభాగాలను, తరగతి గదులు, పరిపాలనా సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి మరింత సౌకర్యవంతమైన, సాంకేతికతతో కూడిన ఆధునిక వాతావరణాన్ని అందించేందుకు ఈ నూతన భవనాన్ని నిర్మించారు. నూతన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో సుమారు 75 తరగతి గదులను ఏర్పాటు చేశారు. డిజిటల్ టెక్నాలజీతో కూడిన స్మార్ట్ బోర్డులు, సెంట్రలైజ్డ్ ఏసీ సదుపాయం, ప్రతి విద్యార్థికి తరగతి గదిలోనే కంప్యూటర్ అందుబాటులో ఉండేలా ఆధునిక సౌకర్యాలను సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా భవనాన్ని రూపొందించారు. ఆధునిక తరగతి గదులు, పరిపాలనా విభాగాలు, విద్యార్థుల అవసరాలకు అనుగుణమైన వివిధ సౌకర్యాలను ఇందులో ఏర్పాటు చేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ఆధునిక మౌలిక వసతులను కల్పిస్తూ, వారికి మరింత సౌకర్యవంతమైన, సాంకేతికతతో కూడిన విద్యా వాతావరణాన్ని అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని లారా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్ తెలిపారు. నూతన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి పరిపాలనా సేవలు మరింత సులభతరం కావడంతో పాటు, విద్యా కార్యకలాపాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రత్తిపాడు, ఆగస్టు 17, ప్రభాతవార్త : గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నియోజకవర్గ అధ్యక్షులు, సెక్రెటరీ జోగి ఆనంద్ బాబు, జెట్టి పరమేశ్వరావు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రారంభంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు, పాత్రికేయులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య



కేంద్రంలోని వైద్యుల సమక్షంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ..జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఏపీయూడబ్ల్యూజే 69 ఏళ్లుగా చేస్తున్న కృషిని కొనియాడారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషిచేసే సంఘం ఏదైనా ఉందంటే అది ఒక్క ఏపీయూడబ్ల్యూజే సంఘమేనని వివరించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజల ముందుకు తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. జర్నలిస్టులైన మనం వృత్తి విలువలను కాపాడుకుంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎలికెత్తి చాటడంలో విలేకరులు నిర్వహిస్తున్న పాత్ర ఎంతో కీలకమని వెల్లడించారు. సమాజానికి నిజాలను అందించే ప్రయాణంలో పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఏపీయూడబ్ల్యూజే 70 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జర్నలిస్టుల ఐక్యతకు, సంఘం సాధించిన ప్రగతికి నిదర్శనమని యూనియన్

**సీనియర్ పాత్రికేయులకు ఘన సత్కారం.**

**ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ.**

ప్రతినిధులు సంతోషం వ్యక్తంచేశారు. భవిష్యత్తులోనూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘటితంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, నివేశన స్థలాలు మంజూరు, అర్హులైన ప్రతి ఒక్కరికి విలేకరులకు అక్రిడి టేషన్ కార్డులను మంజూరు, ఇన్సూరెన్స్ సౌకర్యం, జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేట్



పాఠశాలలు, కళాశాలలో ఫీజు రాయితీ కల్పించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నియోజకవర్గంలోని ఐదుగురు సీనియర్ పాత్రికేయులు ఎడ్లూరి రమణ (వార్త), రాజుపాలెం కోటేశ్వరరావు(దీక్ష), ఉండవల్లి నమః శివయ్య (మనసులో మాట), రామిశెట్టి అదేశ్వరరావు (విశాలాంధ్ర), కొచ్చర్ల వెంకటరత్నం (రాయల్ దినపత్రిక) లను శాలువా, బోకే, మోమెండో, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జోగి ఆనంద్ బాబు (హెచ్‌ఎం టివి), జెట్టి పరమేశ్వరరావు (ఆంధ్రప్రభ), మస్తాన్ (బిగ్ టీవీ), సుబ్బారావు (10టీవీ), శ్రీను (భారత్ టుడే), ప్రత్తి జయపాల్ (సాక్షిఛానల్), రామకృష్ణ (6టివి), వీరభద్రం (మహా న్యూస్), పనకల శ్రీనివాస్ రావు (స్వతంత్ర టీవీ), ఎండి షరీఫ్ (రాజ్ న్యూస్), శివ (ప్రజాశక్తి), పెద్దింటి అశోక్ (బిఆర్కె), బివిఎస్ రాజు, సురేష్ (ఈనాడు), వెంకటసుబ్బయ్య (ఎన్ టివి), అంజిరెడ్డి, సురేంద్ర (కెమెరామేన్), తదితర పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించిన కెఎల్‌యు విద్యార్థులు

**తాడేపల్లి , ఆగస్టు 17, ప్రభాతవార్త :** యూనివర్సిటీ - సెంటర్ ఫర్ ఎక్స్టెన్షన్ యాక్టివిటీస్ (సి ఇఎ) ఆధ్వర్యంలో "సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన"కార్యక్రమాన్ని సోమవారం నాడు మంగళగిరి మండలంలోని నూతక్కి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, వ్యక్తిగత సమాచార భద్రత, ఆన్లైన్ మోసాలను గుర్తించే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్ సైబర్ నేరాలపై మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్లైన్ సేవల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, నకిలీ వెబ్సైట్లను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, పాస్వర్డ్ లు, ఒటిపి వంటి గోప్యమైన సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. ప్రొఫెసర్ ఇన్చార్జ్ పి. శ్రీకాంత్ రెడ్డి సైబర్ నేరాలపై మాట్లాడుతూ, ప్రజలు ఆన్లైన్ లావాదేవీలు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తెలియని లింకులపై క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్లను డౌన్లోడ్ చేయడం, గుర్తుతెలియని వ్యక్తుల సూచనల మేరకు డబ్బు పంపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని వివరించారు. సైబర్ మోసానికి గురైనప్పుడు భయపడకుండా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి.ఇ.ఎ. వాలంటీర్లు గ్రామ ప్రజలకు సైబర్ భద్రతకు సంబంధించిన ముఖ్యమైన సూచనలు తెలియజేశారు. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్వర్డ్ ఉపయోగించడం, గోప్యతా సెట్టింగ్లను సక్రమంగా నిర్వహించడం, అనుమానాస్పద సందేశాలు మరియు కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో సైబర్ నేరాల నివారణ, డిజిటల్ భద్రత



మరియు బాధ్యతాయుతమైన ఆన్లైన్ వినియోగంపై అవగాహన పెరిగింది. సి.ఇ.ఎ. వాలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికీ సమన్వయ కర్తగా సి.ఇ.ఎ. కోఆర్డినేటర్ డా. ఎస్. వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, డాక్టర్ కె. రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్. పవన్ కుమార్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్చార్జి డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, అడ్వైజర్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, అసోసియేట్ డీన్ డాక్టర్ శాంతి శ్రీ నిర్వాహకులను అభినందించారు.

# అట్టహాసంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**తెనాలి ఆగస్ట్17(ప్రభాతవార్త):** తెనాలిలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపియుడబ్ల్యూజె) 70వ ఆవిర్భావ దినోత్సవ




వేడుకలు ఘనంగా నిర్వహించారు.సోమవారం ఉదయం తెనాలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఈ కన్వెన్షన్ హాల్ నందు ఏపియుడబ్ల్యూజె 70 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తెనాలి సంఘ నాయకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా యూనియన్ జండాను సీనియర్ కామ్రేడ్ బిల్లిముంత కృష్ణ ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సభకు యూనియన్ తెనాలి నియోజకవర్గ అధ్యక్షులు, ఐజెయు సభ్యులు చందు సుబ్బారావు అధ్యక్షత వహించగా, యడ్ల లింగయ్య కాలనీలో నివసిస్తున్న 30 మంది పేద పిల్లలకు నూతన వస్త్రాలు,మిఠాయి బాక్సులు అందచేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ఎన్. మీరా,కె.రాంబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విజిల్ ఫౌండేషన్ కోశాధికారి తుమ్మల కిషోర్ కుమార్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. అధ్యక్షులు చందు సుబ్బారావు, కార్యదర్శి ఎం గోపీచంద్, కోశాధికారి దీపాల తారక సాయినాథ్, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొని వారి చేతుల మీదుగా సీనియర్ పాత్రికేయులు బొల్లిముంత కృష్ణ, చొప్పర సుధాకర్, శ్యామల ప్రసాదరెడ్డి, సి.హెచ్ రాజగోపాల్, ఏవీ రమణ లను శాలువా, మొమెంటోతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, ఏపీయుడబ్ల్యూజె ఆధ్వర్యంలో ఎప్పుడు తన కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించారు సంఘ సభ్యుల అభ్యున్నతి కోసం యూనియన్ ఎంతగానో కృషి చేస్తుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెనాలి కమిటీ ఉపాధ్యక్షుడు టి శరత్ బాబు, సహాయ కార్యదర్శులు బత్తుల కమలాకర్, కంకిపాటి రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శి సిద్దెల సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**కొల్లిపర, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొల్లిపర మండల తహశీల్దార్ సిద్ధార్థ కోరారు.సోమవారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెండు అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా సిద్ధార్ధ మాట్లాడుతూఅర్జీలను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి సోమ వారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి అధికారులంతా విధిగా హాజరు కావాలని చెప్పారు.ప్రజల నుండి వచ్చే సమస్యలు తెలుసుకుని సకాలంలో పరిష్కరించేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడివో కిషోర్‌కుమార్,డిప్యూటీ ఎంపిడివోలు భార్గవ్,దానయ్య,హౌసింగ్ ఎఇ పద్మావతి,ఆర్ఐ వంశీకృష్ణ,ఎపివో వెంకయ్య, ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 17(ప్రభాతవార్త):** ప్రతీ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (గ్రీవెన్స్) కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.స్వీకరించిన



అర్జీలను సంబంధిత విభాగాధిపతులకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా పంపించారు.ప్రధానంగా,ఇంజనీరింగ్ సెక్షన్ కు సంబంధించి,చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన సురేష్,ఒకటో లైన్ పరిమి డొంక రూట్ నందు కొత్త సిసి రోడ్డు వేయవలసినది గా చేసిన వినతి, నాజర్ పేట నుండి,నందివెలుగు శివకుమార్, సత్యనారాయణ వారి వీది నందు కొత్త కరెంటు స్తంభం వేయవలసినదిగా చేసిన వినతి,అప్పల నరసమ్మ అనే మహిళ,సిరి బిర్యానీ వారు అర్ద రాత్రి రెండు గంటల వరకు హోటల్ నడుపుతూనారని చేసిన వినతి,చెంచుపేట ఇందిరా నగర్ కాలనీ నందు ఉన్న స్కూల్ లోపల వాటర్ ట్యాంక్, టాయిలెట్, డోర్ లకు రిపేరు కొరకు చేసిన వినతి.ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారు.

# దీర్ఘకాలిక రోగులు ఆరోగ్య సూత్రాలను పాటించాలి

**కొల్లిపర, ఆగస్టు 17, ప్రభాతవార్త:** విధిగా దీర్ఘకాలిక రోగులు ఆరోగ్య సూత్రాలను పాటించాలని వైద్యాధికారి ప్రియాంక చెప్పారు.సోమవారం మండలంలోని పిడపర్తిపాలెంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.రోగులకు అవసరమైన సలహాలు, సూచన లిచ్చారు.ఈ సందర్భంగా ప్రియాంక ప్రసంగిస్తూ వైద్యుల సలహా ప్రకారం దీర్ఘకాలిక రోగులు మందులను వాడుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం వలన దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించేందుకు వీలుంటుందన్నా రు.ప్రతి నెలా నిర్వహించే ఎఫ్‌పిసి క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్య సదుపాయం లభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.గ్రామీణ ప్రజలు మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సుబానీ,డిఇవో బొమ్ము కోటిరెడ్డి,ఆశా కార్యకర్తలు ప్రసన్న,హైమావతి తదితరులు పాల్గొన్నారు.



# సురేష్ ఈఎన్టీ క్లినిక్ నందు అధునాతన పరికరాలు ఏర్పాటు

**తెనాలి ఆగస్ట్ 17(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని సురేష్ ఈఎన్టీ క్లినిక్ జోన్ నందు సోమవారం అధునాతన పరికరాలు ఏర్పాటు చేశారు.ముఖ్య అతిధులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ జి. కోటేశ్వరప్రసాద్,గుమ్మడి సరోజ్ బాబు,కోళ్ల జైరాజ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సురేష్ ఈఎన్టీ క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ పి.సురేష్ వ మా ట్లా డు తూ , తెనాలి పట్టణంలో మొట్టమొదట సారిగా వర్టిగో కి సంబంధించి ఆధునాతన పరికరములు ఏర్పాటుచేయటం జరిగిందని,వీటివల్ల కళ్ళు తిరగటం,తలతిరగటం, లాంటి సమస్యలతో పాటు, వర్టిగో కు సంబంధించి అన్ని రకముల పరీక్షలు నిర్వహించి చికిత్స అందించబడుతుందని డాక్టర్ సురేష్ బాబు తెలిపారు.



# న్యాయవాది ఇంటిపై దాడి కేసులో ఇద్దరు మైనర్లు అరెస్టు

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 17,(ప్రభాతవార్త):** న్యాయవాది ఇంటిపై దాడి చేసిన కేసులో ఇద్దరు మైనర్ల ను తెనాలి తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం తెనాలి పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద ఉదయం 9 గంటల సమయంలో ఇద్దర మైనర్లను అదుపులోనికి తీసుకొని విచారించగా,ఆగస్ట్ 9వ తేదీ మధ్యాహ్నం కొవెవరం గ్రామంలోని న్యాయవాది హుస్సేన్ ఇంటిపై దాడి చేసిన కేసులో నిందితులుగా నిర్ధారించి, ఐతనగర్, సోమసుందర పాలెం గ్రామాలకు చెందిన ఇద్దరు మైనర్లను అదుపులోనికి తీసుకుని గుంటూరు జువెనైల్ కోర్ట్ నందు హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఇద్దరు మైనర్లను 14 రోజులు జువైనల్ హోమ్ నందు వారి అదుపులో ఉంచమని ఆదేశించారు.అనంతరం వారిని విజయవాడ జువైనల్ అబ్జర్వేషన్ హోంకు తరలించామని,తెనాలి గ్రామీణ పోలీసులు తెలిపారు.

# ఆర్టీసి కండక్టర్ రహీం సాహెబ్‌కు అక్షర శ్రీ బిరుదు ప్రదానం

**పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త:** పొన్నూరు ఆర్టీసి డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న షేక్ రహీం సాహెబ్‌కు విశ్వ సాహితీ కళావేదిక అక్షర శ్రీ బిరుదును ప్రదానం చేసింది. తాడేపల్లి గూడెంలోని గమిని ఫంక్షన్ హాలులో విశ్వసాహితీ కళావేదిక ప్రథమ వార్షికోత్సవం జరిగింది. తెలుగు భాషా సాహిత్యాభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్న రహీమ్ సాహెబ్‌కు ఈ సత్కారాన్ని అధికార భాషా సంఘం ఛైర్మన్ త్రివిక్రమరావు, ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసి డిపో మేనేజర్ మోహన్‌కృష్ణ యాదవ్, తోటి ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు రహీంసాహెబ్‌ను ఘనంగా అభినందించారు.




# తెనాలి పట్టణంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 17(ప్రభాతవార్త):** చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా తెనాలి పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్, ఆపరేషన్స్ సబ్‌డివిజన్, తెనాలి టౌన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. మంగళ వారం ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు ఆరుగంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.విద్యుత్ సరఫరా నిలిచే ప్రాంతాలు,సుల్తానాబాద్, ఆలపాటినగర్,సుగాలి కాలనీ,సరళ నగర్,జెఎంజె కాలేజీ రోడ్,డాక్టర్స్ కాలనీ,ఈటీ కాలనీ,ఎరుకలకాలనీ,భాస్కర్ రావు దిబ్బ, ఏకలవ్య వీధి,పాలాద్రి కాలవ రోడ్ మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగించే పనులు జరుగుతున్నందున ఈ అంతరాయం తప్పదని అధికారులు తెలిపారు.కావున వినియోగదారులు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ కోరారు.



# రహదారి అభివృద్ధి పనులకు హద్దులు ఏర్పాటు చేయాలి

**రేపల్లె, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రేపల్లె మండలంలోని తుమ్మల వరకు రహదారి విస్తరణలో భాగంగా రహదారికి ఇరువైపులా మార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ చిన అరవపల్లి ప్రజలు సోమవారం రేపల్లె రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీ అందజేశారు. ముందుగా ఆర్అండ్‌బి అధికారులు మార్కింగ్ ఏర్పాటు చేసి హద్దులుగా ఏర్పాటు చేసిన పుల్లలను కొందరు తీసివేశారని,మరలా అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరారు.సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో బి.శ్రీదేవి హామీనిచ్చారు.



## ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎండి జఫరుల్లా

-ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నిక
-61ఓట్ల ఆధికత్యంతో జఫరుల్లా గెలుపు
-భారీబందోబస్తు నిర్వహించిన అర్బన్ పోలీసులు

**పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త:** ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటి ఎన్నిక సోమవారం అత్యంత ఉత్కంఠభరితంగా, భారీ పోలీసు బందోబస్తు మధ్య జరిగింది. ఈ ఎన్నికలు రిటర్నింగ్ అధికారి ఎంఎం ఖుద్దూస్ పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఓట్ల లెక్కింపు జరిగింది. మొత్తం 326ఓట్లకు గాను 286మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జఫరుల్లాకు-168ఓట్లు రాగా, మరొక అభ్యర్థి తాళ్ళపల్లి శ్రీనుకు-107ఓట్లు, శ్రీధర్‌కు-6ఓట్లు వచ్చాయి. మరో ఐదు ఓట్లు చెల్లలేదు.



అధ్యక్షునిగా ఎన్నికైన జఫరుల్లా చేత ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంఎం ఖుద్దూస్ ప్రమాణస్వీకారం చేయించి డిక్లరేషన్‌ను అందజేశారు. అర్బన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన జఫరుల్లా మాట్లాడుతూ తనపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించిన ప్రతి సభ్యునికి కృతజ్ఞతలు తెలిపారు. ఆటో నగర్ ఏర్పాటుకు, కార్మికుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా జఫరుల్లాను పలువురు యూనియన్ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు అభినందించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త:** పొన్నూరు రూరల్ సెక్షన్ పరిధిలోని 11కెవి టౌన్ ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌లో లైన్లపైకి వచ్చిన చెట్లకొమ్మలను తొలగించేందుకు మంగళవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ బోరుగడ్డ అశోక్‌కుమార్ తెలిపారు. చింతలపూడి మెయిన్‌రోడ్డు, మొవ్వా ఫంక్షన్ హాలు, ఇండస్ట్రియల్ ఏరియా, తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించాలని అశోక్‌కుమార్ కోరారు.

## కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రఘువీరాతో దిలీప్ భేటి

**పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ పీసీసీ అధ్యక్షుడు నీలకంఠాపురం రఘువీరారెడ్డితో పొన్నూరు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ భేటి అయ్యారు. ఈ సందర్భంగా స్వర్గీయ జక్కా శ్రీనివాసరావు పార్టీ అభివృద్ధికి చేసిన సేవలను రఘువీరారెడ్డి గుర్తు చేశారు. జక్కా శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. జక్కా సేవలు అభినందనీయమన్నారు. ప్రస్తుతం జక్కా లేని లోటు తీర్చలేనిదన్నారు.



నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. పార్టీ బలోపేతానికి నిబద్ధతతో పనిచేయాలన్నారు. బిజెపి అరాచకాలను, అక్రమాలను ప్రజల్లో ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు రఘువీరెడ్డి పిలుపునిచ్చారు. రఘువీరెడ్డిని కలిసినవారిలో కంతెటి ఎలమంద, దాసు, ఏడుకొండలు, యాదవ్, రేవంత్ తదితరులున్నారు.

## జనసేన పార్టీ సీనియర్ నేత కంకణాల శంకర్ కు ఘన సత్కారం

**మంగళగిరి, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మెగాస్టార్ చిరంజీవి మెగా స్టార్ చిరంజీవి అభిమానుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకే రూ.5 లక్షల బీమా పాలసీ అందజేస్తున్నట్లు అఖిల భారత చిరంజీవి



అభిమానుల సంఘం అధ్యక్షులు రవణం స్వామి నాయుడు అన్నారు. జిల్లాలో గత కొన్ని సంవత్సరాల నుంచి రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు కరోనా సమయంలో బాధితుల సహాయార్థం ఆక్సిజన్ బ్యాంక్ సేవలను అందించిన రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు కంకణాల శంకర్ ను ఘనంగా సత్కరించి రూ. 5 లక్షల బీమా ను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో స్వామి నాయుడు మాట్లాడుతూ మెగా స్టార్ చిరంజీవి వెండి తెరపైనే కాదు నిజజీవితంలోనూ తన ఉదారతలో అందరివాడు అనిపించుకుంటున్నారని కొనియాడారు. తెలుగు సినీ పరిశ్రమలో ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుండి భరోసా కల్పించిన మెగాస్టార్ తాజాగా తనను మూడు దశాబ్దాలుగా నమ్ముకున్న అభిమానులకు పెద్దన్నగా నిలవడం అభినందనీయమన్నారు. ఒకప్పుడు రక్తం దొరక్క ఇబ్బంది పడుతున్న కాలంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్ స్థాపించి లక్షలాదిమందికి ప్రాణదాతగా నిలిచిన మెగాస్టార్ చిరంజీవి నేడు తన అభిమానులకు రూ. 5 లక్షల రూపాయల హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు అందజేస్త వారిని ఆరోగ్య పరంగా ఆదుకోవడం అభినందనీయమని కొనియాడారు. అందుకే మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు కేవలం మెగాస్టార్ మాత్రమే కాదు ఆపదలో ఆదుకునే మెగా పవర్ హౌస్ అని స్వామి నాయుడు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత అధికార ప్రతినిధి మేకల రవీంద్ర బాబు, మెగా యూత్ ఫోర్స్ చింత శివ దావులూరి శ్రీనివాస్, కే శ్రీనివాస్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## స్మైల్ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం

**మంగళగిరి, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ మంగళగిరి కమిటీ ఆధ్వర్యంలో 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ మంగళగిరి ప్రెస్ క్లబ్ నుండి బయలుదేరి నవులూరు స్మైల్ వృద్ధుల ఆశ్రమానికి చేరుకుంది. అక్కడ వృద్ధులకు అన్నదానం నిర్వహించి, వారికి అవసరమైన వ్యక్తిగత సామాగ్రిని అందజేశారు. యూనియన్ నాయకులు ఏపీయూడబ్ల్యూజే సాధించిన విజయాలను ప్రస్తావించి సేవలను



కొనియాడారు. ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు జొన్న వెంకటేష్, కార్యదర్శి బత్తుల సాంబశివరావు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు తాడిబోయిన నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు షేక్ సుభాని, జాయింట్ సెక్రెటరీ శిరందాసు విజయ భాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కమల్, కార్యవర్గ సభ్యులు చదలవాడ సాయి చంద్, ప్రదీప్, సందీప్, ఇంధనం నాగరాజు, గాజుల సురేష్, రాంబాబు, సుబ్రహ్మణ్యం, శివరాత్రి శ్రీనివాసరావు, కాజా చిన్ని, జర్నలిస్టులు శిరందాసు శ్రీనివాసరావు, ఆరేపల్లి రాజు, అన్వర్ ఖాన్, శ్యామ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఈమని గ్రామంలో ఇళ్ల స్థలాలకు రహదారి సౌకర్యం పై హర్షం

**తాడేపల్లి, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ఈమని గ్రామంలో ప్రభుత్వ ఇళ్ల స్థలాలకు రోడ్డుదారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తుల సమస్యకు జనసేన పార్టీ చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. ఈమని గ్రామ ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ ఇళ్ల స్థలాల వరకు రోడ్డుదారి ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రైవేట్ భూమిని జనసేన పార్టీ తరపున కొనుగోలు చేసి, గ్రామ పంచాయతీకి అందించి రహదారి సౌకర్యాన్ని కల్పించారు. ఏపీ ఎం ఎస్ఐ డిసి చైర్మన్ జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ



ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డుదారిని గ్రామస్తులు ప్రారంభించుకున్నారు. ఈ సందర్భంగా రోడ్డుదారి ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపిన చిల్లపల్లి శ్రీనివాసరావుకు దుగ్గిరాల మండల అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, దుగ్గిరాల మండలం జనసేన పార్టీ నాయకులు ఎడ్ల సాయి కృష్ణ, గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఇళ్ల స్థలాలకు రాకపోకల సౌకర్యం కల్పించడంతో తమ ఇబ్బందులు తొలగిపోయాయని, తమ సమస్యను పరిష్కరించిన జనసేన నాయకులకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

## ఆగస్టు 21న ఉచిత వైద్య శిబిరం

**నకరికల్లు, ఆగస్టు 17 ప్రభాతవార్త :** ఈనెల 21 న ఆంధ్ర హాస్పిటల్స్ మరియు మహేష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నపిల్లల గుండె ఆపరేషన్లకు సంబంధించిన వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఎండీ. ఫారూఖ్ బాబు సోమవారం రామిరెడ్డి పేటలోని హీరో కృష్ణ మహేష్ బాబు అభిమాన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ శిబిరంలో ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ డి. లింగస్వామి పాల్గొని అవసరమైన వారికి గుండె పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రతినెల మూడో శుక్రవారం నరసరావుపేటలోని పల్నాడు రోడ్ లోని నాగసరపు రామారావు కాంప్లెక్స్ వెనక ఉన్న శ్రీ త్రికోటేశ్వర స్కాన్ సెంటర్ లో వైద్యశిబిరం నిర్వహిస్తారని అన్నారు. కావున 0 15 ఏళ్ల లోపు పిల్లల వరకు గుండె సంబంధిత సమస్యలు ఉన్న వారు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం సభ్యులు షేక్. నబీబాజీ, సిహెచ్.చిన్నికృష్ణ, షేక్. మోలాలి, జి. బుచ్చిబాబు, మన్నేపల్లి శ్రీను, బాజీ, సుభాని తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేట లో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవం

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 69 సంవత్సరాలు పూర్తి చేసుకుని 70వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పల్నాడు జిల్లానరసరావుపేటలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా



నిర్వహించారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఆర్డీవో కార్యాలయంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జర్నలిస్టుల సౌకర్యార్థం ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. అనంతరం రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆర్వంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని జర్నలిస్టులు సందర్శించారు. అక్కడ వృద్ధులకు భోజనం ఏర్పాటు చేసి, స్వయంగా వడ్డించి వారి పట్ల ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సంర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి , జిల్లా సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ, ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర నాయకులు ఐ.వి. సుబ్బారావు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాలు అందజేయడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనం ఏర్పాటు చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన జర్నలిస్టు మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు జగన్, పల్నాడు జిల్లా కార్యదర్శి నాగరాజు, నరసరావుపేట అధ్యక్షులు అడ్డగిరి అప్పారావు, ట్రెజరర్ ఘ్మశివ, జిల్లా నాయకులు కోటేశ్వరచారి, నందిగం సుధీర్, 99జిలాని, సాజిద్, స్వర్ణ నాగరాజు, ఆలీ, సిద్దు, కరిముల్లా, బాలు, గాంధీ, ప్రేమ్, వసంత్, సత్య, రాజా, ప్రసన్న, మస్తాన్, స్వర్ణ శివ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 ప్రభాతవార్త :** స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి నూతన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు హాజయ్యారు. ప్రిన్సిపాల్ డా. వై.వి. నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కళాశాల చైర్మన్ శ్రీ బొల్లా బ్రహ్మానాయుడు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ రావెల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ డా. నల్లబోతు వెంకట్రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ బ్రహ్మానాయుడు మాట్లాడుతూ కళాశాలను స్థాపించడం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాలను, విద్యార్థుల ప్రయోజనం కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను



వివరించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెలసత్యనారాయణ మాట్లాడుతూ కళాశాలపై నమ్మకంతో తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడతామని అన్నారు. జాయింట్ సెక్రటరీ డా. నల్లబోతు వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులకు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. నేటి విద్యార్థులే భవిష్యత్ శక్తివంతమైన నాయకులన్నారు. ప్రిన్సిపాల్ డా. వై.వి. నారాయణ మాట్లాడుతూ కళాశాలలోని సౌకర్యాలు, ప్రయోగశాలలు, భావ వ్యక్తీకరణ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## శానిటేషన్ సిబ్బందికి దుస్తుల పంపిణీ

రొంపిచర్ల ఆగస్టు 17 ప్రభాతవార్త :: బొల్లు రాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బొల్లు రాజేశ్వరి 29వ వర్ధంతి సందర్భంగా సోమవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 25వ వార్డు శానిటేషన్ సిబ్బందికి మహిళలకు చీరలు, పురుషులకు దుస్తులు పంపిణీ చేశారు. పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిరక్షణలో శానిటేషన్ సిబ్బంది చేస్తున్న సేవలను గుర్తించి వారికి చిరుకానుకగా దుస్తులు అందించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో 25వ వార్డు శానిటేషన్ సెక్రటరీ ముఖేష్, ట్రస్ట్ చైర్మన్ బొల్లు



వెంకటకృష్ణారావు, బొల్లు వెంకటేశ్వర్లు, బొల్లు రాజేంద్రప్రసాద్, ట్రస్ట్ సభ్యులు మల్లిపాటి రామకృష్ణ, జాస్తి గోపాలకృష్ణబాబు, గోపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ పాటిపాటి అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**రొంపిచర్ల, ఆగస్టు 17 ప్రభాతవార్త :** మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల శ్రీ పాటిపాటి అంకమ్మ తల్లి దేవస్థానంలో సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి వేళ్ళలో భజనా కార్యక్రమం జరిగింది.

## వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు ఏఐ శిక్షణలో ప్రతిభ చూపిన డా. కొమ్మినేని వీర శంకరరావు



**చిలకలూరిపేట, ఆగస్టు17, ప్రభాతవార్త** వైద్య విద్య, పరిశోధన మరియు ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంపై నిర్వహించిన ప్రతిష్టాత్మక జాతీయ సదస్సులో కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ప్రముఖ వైద్యులు డా. కొమ్మినేని వీర శంకరరావు ఉత్సాహంగా పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. జాతీయ సదస్సు నిర్వహణ:నేషనల్ మెడికల్ ఫోరమ్ మరియు మెడికల్ డైలాగ్స్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని నెహ్రూ ప్లేస్ వద్ద గల ఎరోస్ హోటల్‌లో ఈ జాతీయ సదస్సు ఘనంగా జరిగింది. అధునాతన ఏఐ సాధనాలపై శిక్షణ:వైద్య రంగంలో డాక్యుమెంటేషన్, పరిశోధన, కమ్యూనికేషన్ మరియు వర్క్‌ఫ్లో ఆప్టిమైజేషన్ కోసం చాట్‌జిపిటి (ద్భుబిశిగి), క్లాడ్ మరియు మైక్రోసాఫ్ట్ కోపైలట్ వంటి ఆధునిక కృత్రిమ మేధస్సు సాధనాల ప్రాక్టికల్ వినియోగంపై నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా సెషన్లు నిర్వహించారు. అభినందనలు:ఈ సదస్సుకు నేషనల్ మెడికల్ ఫోరమ్ అధ్యక్షులు డా. ప్రేమ్ అగర్వాల్ మరియు మెడికల్ డైలాగ్స్ ఎడిటర్ ఇన్‌చీఫ్ మేఘనా సింఘానియా నేతృత్వం వహించారు. వైద్య రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఏఐని ఏకీకృతం చేయడంలో మరియు డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో కొమ్మినే సూపర్ స్పెషాలిటీ వైద్యులు డా. కొమ్మినేని వీర శంకరరావు చురుకైన భాగస్వామ్యం కనబరచడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు17, ప్రభాతవార్త :** చిలకలూరిపేట మండలం మిట్టపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు దండా ఆదినారాయణ కుమారుడి వివాహ వేడుకలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీమంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారు.



## కూటమి ప్రభుత్వ ముందుచూపే.. ఎల్‌నినో తీవ్రతకు సరైన పరిష్కారం : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు17, ప్రభాతవార్త :** ఎల్ నినో ప్రభావంపై ప్రజలు చాలా ఆందోళనకరంగా ఉన్నారని, ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణప్రాంత ప్రజలు కుటుంబపోషణ.. పిల్లల చదువు వంటి అంశాలపై తీవ్ర ఆందోళన చెందుతున్నారని,



వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ప్రజల్ని, ముఖ్యంగా రైతుల్ని అప్రమత్తం చేయడంలో కూటమి ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించడంతో, దేశంలో ఎల్ నినో తీవ్రతను ఎదుర్కొంటూ, సరైన పరిష్కారాలతో ఏపీ ముందుకెళ్తోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీలో ఎల్ నినోపై ప్రభుత్వం చేపట్టిన లఘుచర్చలో ఆయన మాట్లాడారు.

**208 మండలాల్లో కరువు ప్రభావం.. హై రిస్క్ లో 122 మండలాలు..**

జులైలో 60శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఆగస్ట్ లో కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ రాష్ట్రంలో 208 మండలాల్లో ఓ మోస్తరు కరువు ప్రభావం ఉందని, వాటిలో 122 మండలాలు హై రిస్క్ లో ఉన్నాయని ప్రభుత్వం గుర్తించిందన్నారు. రాబోయే 3 నెలల్లో మరో 40శాతం వరకు వర్షాభావ తీవ్రత ఉండొచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు సూచిస్తున్న నేపథ్యంలో పలు అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉందని ప్రత్తిపాటి తెలిపారు. వాతావరణం అనుకూలిస్తే, ఈ సమయానికి రాష్ట్రంలో 2.78 లక్షల హెక్టార్లలో పత్తిసాగు చేపట్టేవారని, కానీ ఇప్పటికి 1.07 లక్షల హెక్టార్లలో, 40 శాతం మాత్రమే సాగైందన్నారు. పత్తిసాగు లేకపోవడంతో స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు మూతపడే పరిస్థితులు ఏర్పడ్డాయని, దాంతో వాటిపై ఆధారపడిన లక్షల కుటుంబాలకు ఉపాధి కరువైందన్నారు. 15. 14 లక్షల హెక్టార్లలో సాగు అవ్వాల్సిన వరి 4.70 లక్షల హెక్టార్లకు మాత్రమే పరిమితమైందన్నారు. అంటే కేవలం 31శాతం మాత్రమే సాగులోకి వచ్చిందన్నారు. 2.95 లక్షల హెక్టార్లలో సాగు చేయాల్సిన కంది..1.40 లక్షల హెక్టార్లకు తగ్గిందన్నారు. వేరుశనగ 90వేల హెక్టార్లలో మాత్రమే సాగైందన్నారు. వీటన్నింటి నేపథ్యంలో ప్రభుత్వం తగిన ముందస్తు జాగ్రత్తలు చేపట్టిందని ప్రత్తిపాటి తెలిపారు.

**రూ.3,400 కోట్లతో చేపట్టిన జలధారజలహారతి కార్యక్రమంతో సత్ఫలితాలు..**

కొన్ని ప్రాంతాల్లో వేసవి కంటే దారుణమైన పరిస్థితులు ఉన్నాయన్న ప్రత్తిపాటి.. విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం తక్కువ నీటితో సాగయ్యే పంటలు, పశుపోషణ, తాగునీటి సమస్య, ఆహార కొరతపై యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జలధారజలహారతి కార్యక్రమంలో భాగంగా చెరువులు, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, 0.79 మీటర్ల వరకు భూగర్భ జలాలు పెరిగినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయన్నారు. 3,409 కోట్లతో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలధార జలహారతి కార్యక్రమం సత్ఫలితాలు ఇవ్వడం శుభపరిణామమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వ లెక్కల ప్రకారం 625 టీఎంసీల భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నాగార్జున సాగర్ లో నీటి నిల్వలు అడుగంటాయని, శ్రీశైలం డ్యామ్ పూర్తిగా నిండలేదని, కొన్ని జిల్లాల్లో నమోదైన తక్కువ వర్షపాతం ప్రమాద ఘంటికలు మోగిస్తోందన్నారు.

**ఎల్‌నినో ప్రభావం.. ఆహార ఉత్పత్తులు, నిత్యావసరాలపై పడకుండా చూడాలి.**

గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్ని ఉత్సవ విగ్రహాలుగా మారిస్తే. కూటమి ప్రభుత్వం రైతుల సేవకు అంకితమయ్యేలా వాటిని పునర్వ్యవస్థీకరించిందని ప్రత్తిపాటి తెలిపారు. వాటి ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, రాయితీ పరికరాలు అందిస్తోందన్నారు. ఎల్ నినో ప్రభావం ఆహార ఉత్పత్తులు, నిత్యావసర ధరలపై పడుతోందని, పరిశ్రమల్లో ఉపాధి కోల్పోయే వారి సంఖ్య పెరుగుతోందని, ఈ పరిస్థితుల్లో ఉన్న వనరులతోనే ప్రజల్ని ఆదుకోవడంపై ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని ప్రత్తిపాటి సూచించారు. సమర్థుడైన ముఖ్యమంత్రి నాయకత్వంలో అధికారులు నిబద్ధత, పట్టుదలతో పనిచేస్తే రైతులు, రైతుకూలీలు, వ్యవసాయ..పారిశ్రామిక రంగాలపై ఆధారపడిన శ్రామికులకు అండగా నిలిచి. ఎల్ నినో తీవ్రతను అధిగమించవచ్చని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

## అంకితభావానికి దక్కిన గుర్తింపు

### హెడ్ కానిస్టేబుల్ గోపికి ఉత్కృష్ట అవార్డు

**చిలకలూరిపేట, ఆగస్టు17, ప్రభాతవార్త :** చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్, రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న గోపికి ఉత్కృష్ట అవార్డు లభించడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. విధుల పట్ల అంకితభావం, నిష్కళంకమైన సేవా తత్పరత, నిరంతర కృషికి ఈ పురస్కారం తగిన గుర్తింపుగా నిలిచింది. దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా



జరుగుతున్న తరుణంలో, నరసరావుపేట సబ్ డివిజన్ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన ఉత్కృష్ట పురస్కారానికి గోపి ఎంపిక కావడం చిలకలూరిపేట పట్టణానికే గర్వకారణంగా నిలిచింది. ముఖ్యంగా నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలో ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకోబోతున్న ఏకైక రైటర్‌గా చిలకలూరిపేట అర్బన్ హెడ్ కానిస్టేబుల్ గోపి నిలవడం విశేషం.

## విద్యార్థినులకు బ్యూటిఫికేషన్ శిక్షణ ప్రారంభం

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్ 17, ప్రభాతవార్త:** ఏఎన్‌యులోని ఒకేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సిఎస్ఆర్, ఎక్స్ఎల్ఆర్ సంస్థ సంయుక్తంగా రూసా 2.0 నిధులతో 5రోజుల ఉచిత బ్యూటిఫికేషన్ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ కార్యక్రమానికి సిఎస్ఆర్ డైరెక్టర్ ఆచార్య బబిత అధ్యక్షత వహించారు. తరగతులను రిజిస్ట్రార్ జి.సింహాచలం ప్రారంభించి మాట్లాడారు. నైపుణ్య శిక్షణలు సమాజానికి ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రస్తుత సమాజంలో నైపుణ్యంపై శిక్షణ పొందడం వలన ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ రోజుల్లో విద్యని అభ్యసించిన వారికన్నా వృత్తి శిక్షణలు ద్వారా పొందే ఆదాయం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. అలాగే వర్సిటీలో డిప్లమో, సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించేందుకు ప్రతిపాదనలు పంపాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సెల్ఆర్ వైస్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరావు, సిఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రామర్ ఎం.వెంకటరమణ, స్వప్న, శ్యామల, సిబ్బంది వీరాంజనేయులు, ఏసమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఉత్క్రుష్ట సేవ రివార్డు అందుకున్న నాగరాజు

**అమరావతి., ఆగస్టు 17, ప్రభాతవార్త :** హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు ఉత్రుష్ట సేవా రివార్డును అందుకున్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ నాయుడు పల్నాడు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఈ రివార్డును నాగరాజు అందుకున్నారు. అమరావతి స్టేషన్ సిబ్బంది పలువురు నాగరాజుకు అభినందనలు తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ప్రతిభావంతులకు అధికారులకు నాయకులకు ప్రత్యేక ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరు లో భాగంగా హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న నాగరాజుకు ఉ త్రుష్ట సేవా రివార్డు రావడం ఆనందదాయకంగా ఉందని నాగరాజు తెలిపారు.



## నిష్ణాతులకు కళాసారధి గుదిబండి వెంకటరెడ్డి జీవన సాఫల్య పురస్కార ప్రధానం

**గుంటూరు కల్చరల్, ఆగష్టు 17, ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆరాధన ఆర్ట్స్ అకాడమి, రామరాజు ఫౌండేషన్ గుంటూరు ఎన్‌టిఆర్ కళాపరిషత్, సాతులూరు వారి సంయుక్త నిర్వహణలో జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్, హైదరాబాద్ వ్యవస్థాపక చైర్మన్, కళాసారధి గుదిబండి వెంకటరెడ్డి జీవన సాఫల్య పురస్కార సభ జరిగింది. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా చెరుకూరి సాంబశివరావు, ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ దామచర్ల శ్రీనివాసరావు, గౌరవాతిధులుగా ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ చిటిపోతు రామాంజనేయులు, ట్యాక్స్ కన్సల్టెంట్ బొల్లేపల్లి శ్రీనివాసరావు, చార్టెర్డ్ అకౌంటెంట్ జొన్నలగడ్డ శ్రీనివాస్, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు లు పాల్గొని జ్యోతి ప్రజ్వలనంతో సభా కార్యక్రమాలను ప్రారంభించారు. ముఖ్య అతిధి మాట్లాడుతూ గుదిబండి వెంకటరెడ్డి స్మరణిక ఆత్మీయుల జ్ఞాపకాల తోరణం ఏళ్ళ తరబడి అలుపెరగని సాంస్కృతిక యోధుడిగా, పోరాడి దివంగతులైన గుదిబండి వెంకటరెడ్డి అడుగు జాగలు భావితరం సాంస్కృతిక రంగ ప్రవేశికులకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం పురస్కార గ్రహీతలు స్వర్గీయ జాస్తి హరిబాబు తరపున కుమార్తె పోతినేని శిరీష, సమాజ సేవా రంగంలో అవ్వారి వెంకట మంగాదేవి, నవ మల్లెతీగపత్రికా సంపాదకులు కె.సాంబశివరావు (కలిమిశ్రీ), నటనారంగం జానా రామయ్యలకు అతిధులు పురస్కార ప్రధానం చేసి ఘనంగా సత్కరించి, స్మరణిక సంచికను ఆవిష్కరించారు. సభానంతరం తారకరామా కళాస్రవంతి పెదకాకాని వారి శ్రీగణపతి మహాత్యం నాటకంలోని సన్నివేశాన్ని ప్రదర్శించి కళాభిమానులను అలరించారు. తొలుత కార్యక్రమాలను బొల్లేపల్లి సుబ్బారావు సినీ మధురగీతాలతో ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గం డి.తిరుమలేశ్వరరావు, నడింపల్లి వెంకటేశ్వరరావు, జానీభాషా, గరికపాటి వెంకటరామారావు, డాక్టర్ బాబు పాల్గొన్నారు.

18-08pg10_18-08pg10.qxd 17/Aug/26 10:28 PM Page 1






### ది హండ్రెడ్ మెన్స్ ఛాంపియన్‌గా

# సూపర్ జెయింట్స్

### ఫైనల్లో ట్రెంట్ పై అద్భుత విజయం

**లండన్:** ది హండ్రెడ్ మెన్స్ 2026 ఫైనల్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ డిఫెండింగ్ ఛాంపియన్స్ అయిన ట్రెంట్ రాకెట్స్‌పై ఘన విజయం నమోదు చేసి ఛాంపియన్‌గా నిలిచింది. లండన్‌లోని లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఈ పోరులో, జెయింట్స్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించి తమ తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. టిమ్ సీఫెర్ట్ యొక్క అద్భుత ప్రదర్శన మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ టైటిల్‌ను కైవసం చేసుకోవడానికి సహాయపడింది. రాకెట్స్ మొదట బ్యాటింగ్ చేయడంతో ఈ పోరు ప్రారంభమైంది. బెన్ డకెట్, ఫిన్ అలెన్ వరుసగా 31, 15 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. అన్యూరిన్ డొనాల్డ్ 38 పరుగులు, మిచెల్ శాంట్నర్ 20 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, లూయిస్ గ్రెగొరీ 32 పరుగులు జోడించాడు. దీంతో రాకెట్స్ తొలి ఇన్నింగ్స్‌లో మొత్తం 158 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్‌లో 3 వికెట్లతో జెయింట్స్ తరఫున నూర్ అహ్మద్ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. సోనీ బేకర్ 2 వికెట్లు, జోష్ టంగ్, లియామ్ డాసన్ కూడా చెరో వికెట్ పడగొట్టారు. లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన సూపర్ జెయింట్స్ టిమ్ సీఫెర్ట్, పాల్ వాల్టర్‌లతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. సీఫెర్ట్ 72 పరుగులు చేయగా, పాల్ వాల్టర్ 22 పరుగులు చేసి మంచి ప్రదర్శన కనబరిచాడు. జోస్ బట్లర్ మరో 23 పరుగులు జోడించగా, ల్యూస్ డు ప్లూయ్ 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో జెయింట్స్ 98 బంతుల్లోపే లక్ష్యాన్ని ఛేదించి, 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాకెట్స్ తరఫున మహమ్మద్ అమీర్ 3 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. కాల్విన్ హారిసన్ 2 వికెట్లు తీశాడు.

### మహిళల ఛాంపియన్స్ లీగ్..
# బంగ్లాదేశ్‌పై భారత్ విజయం




**మలేషియా:** ఏఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ ప్రిలిమ్స్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన జట్టు రాజ్‌షాహి స్టార్స్‌పై ఈస్ట్ బెంగాల్ (భారత్ జట్టు) సునాయాసంగా విజయం సాధించింది. మలేషియాలోని కోటా కినాబాలులోని లికాస్ స్టేడియంలో సోమవారం బంగ్లాదేశ్‌కు చెందిన రాజ్‌షాహి స్టార్స్ ఎఫ్‌సిపై 4-0 తేడాతో విజయం సాధించి, ఈస్ట్ బెంగాల్ ఛాంపియన్స్ లీగ్ 2026-27 ప్రాథమిక దశ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. ఘనా క్రీడాకారిణి ఒలివియా అనోక్యే రెండు గోల్స్ చేయగా, భారత అంతర్జాతీయ క్రీడాకారిణులు అస్తమ్ ఒరాన్, సౌమ్య గుగులోత్ చెరొక గోల్ చేసి ఘన విజయాన్ని ఖాయం చేశారు. ఈస్ట్ బెంగాల్ బలంగా ప్రారంభించి, తొమ్మిది నిమిషాల తర్వాత 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. గోల్ కీపర్ రూప్నా చక్మా ఎంతగానో ప్రయత్నించినప్పటికీ, ఒలివియా పెనాల్టీని సునాయాసంగా గోల్‌గా మలిచింది. 26వ నిమిషంలో అస్తమ్ ఒరాన్ ద్వారా ఐడబ్ల్యుఎల్ ఛాంపియన్ తన ఆధిక్యాన్ని మరింత పెంచుకోగా, విరామానికి ముందు బంగ్లాదేశ్ జట్టుకు పరిస్థితి మరింత దిగజారింది. 38వ నిమిషంలో రింపా హల్దార్ పంపిన క్రాస్ రూప్నాను దాటి వెళ్ళగా, వెనుక పోస్ట్ వద్ద సులంజన రౌల్ అత్యంత వేగంగా స్పందించి బంతిని వెనక్కి పంపగా, ఒలివియా ఆ సాయంత్రపు తన రెండవ గోల్‌ను సాధించింది. విరామం తర్వాత రాజ్‌షాహి పుంజుకుంది, కానీ మరింత ప్రతిఘటన చూపినప్పటికీ, మోనికా చక్మా కొట్టిన ఒకే ఒక్క లాంగ్‌రేంజ్ షాట్‌ను పాంథోయ్ చాను ఎలాంగ్‌బామ్ అడ్డుకుంది. మోషల్ గర్ల్స్ తమ చేతిలో ఉన్న అనుకూలతతో ఓపికతో 71వ నిమిషంలో ప్రత్యర్థి రక్షణలో జరిగిన పొరపాటును సద్వినియోగం చేసుకుని స్కోరును పెంచారు. సులంజన అందించిన పాస్‌ను సౌమ్య గోల్‌గా మలచడంతో భారత జట్టు అద్భుతమైన ప్రదర్శనకు ముగింపు పలికింది.

# 284 రన్స్‌తో కుప్పకూలిన శ్రీలంక

### టీమిండియా 178 పరుగుల ఆధిక్యం

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో తొలి టెస్ట్‌లో భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది. మూడో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు కుప్పకూలింది. అంతకుముందు 460/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌట్ అయింది. దేవదత్ పడిక్కల్(167) సెంచరీతో రాణించగా, కేఎల్ రాహుల్(82) శతకాన్ని చేజార్చుకున్నాడు. ధ్రువ్ జురెల్(51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య(4/109) నాలుగు వికెట్లు, కేశర నువాంత(3/175) మూడు వికెట్లు, అసితా ఫెర్నాండో(2/63) రెండు వికెట్లు తీసాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు షాకిచ్చారు. సిరాజ్, జడేజా, మానవ్ సుతార్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. దాంతో శ్రీలంక 99/5 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో సొనాల్ దినుషా, నిరోషణ్ డిక్‌వెల్లా అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి శ్రీలంకను ఆదుకున్నారు. ఈ క్రమంలో నిరోషన్ డిక్‌వెల్లా 67 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా, దినుషా 92 బంతుల్లో అర్థశతకాన్ని అందుకున్నాడు. దాంతో శ్రీలంక 215/5 స్కోర్ టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో 146 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. సెంచరీ దిశగా సాగిన నిరోషన్ డిక్‌వెల్లా(80)ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో మ్యాచ్ భారత్‌వైపు మలుపు తిరిగింది. ఆ వెంటనే కేశర నువాంత(2)ను జడేజా ఔట్ చేయగా, ప్రబాత్ జయసూర్య(10)ను మానవ్ సుతార్ వెనక్కిపంపాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు సోనాల్ దినూషా 167 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ మరుసటి బంతికే అతన్ని జడేజా ఎల్బీగా పెవిలియన్ మార్చాడు. లాహిరు కుమార(10)ను మానవ్ సుతార్ ఔట్ చేయడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆ వెంటనే వర్షం రావడంతో అంపైర్లు మూడో రోజు ఆటను ముగించారు.









### వరల్డ్ ఛాంపియన్‌షిప్..
# రెండో రౌండ్‌లోకి సింధు

**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ ప్రారంభ రౌండ్‌లో, మాజీ ఛాంపియన్ పివి సింధు అనుభవం లేని ఐరిష్ షట్లర్ సోఫియా నోబుల్‌పై వరుస గేమ్‌లలో విజయం నమోదు చేసింది. ఐదుసార్లు పతక విజేత అయిన సింధు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో తొలిసారిగా ఆడుతున్న నోబెల్‌పై కేవలం 29 నిమిషాల్లోనే 21-7, 21-11 తేడాతో సునాయాసంగా గెలుపొందింది. తొలి గేమ్‌లోనే 8-0 ఆధిక్యంతో దూసుకుపోయిన సింధు ఆ తర్వాత వెనుతిరిగి చూడలేదు. రెండవ సెట్‌లో నోబుల్ మెరుగ్గా ఆడింది, ఆట మధ్య విరామ సమయానికి ఆమె కేవలం మూడు పాయింట్ల తేడాతో వెనుకబడి ఉంది. అయితే ఆ తర్వాత వచ్చిన 13 పాయింట్లలో 10 పాయింట్లను గెలుచుకుని ఆమె విజయాన్ని ఖాయం చేసుకుంది. ఇదే సమయంలో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్‌ల మహిళల డబుల్స్ జోడీ, ఎంఆర్ అర్జున్-హరిహరన్ అమ్సకరుణన్‌ల పురుషుల డబుల్స్ జోడీ కూడా రెండో రౌండ్‌లో తమ స్థానాలను ఖరారు చేసుకున్నాయి. ట్రీసా-గాయత్రి స్పెయిన్‌కు చెందిన పౌలా లోపెజ్-లూసియా రోడ్రిగ్జ్‌లను 21-9, 21 -13 తేడాతో ఓడించింది. అలాగే గాయం కారణంగా ఐరిష్ ద్వయం స్కాట్ గిల్డియా-పాల్ రేనాల్డ్స్ మ్యాచ్ నుండి వైదొలగడంతో, అర్జున్-హరిహరన్ వారిపై 21-16, 6-4 ఆధిక్యంలో ఉన్నారు.

# టీమిండియాకు బంగ్లా షాక్

### డబ్ల్యూటిసి ఫైనల్‌పై పెను ప్రభావం

**న్యూఢిల్లీ:** టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే బలహీన జట్టుగా భావించిన బంగ్లాదేశ్ ఆస్ట్రేలియాపై సంచలన విజయం పాయింట్ల పట్టిక ముఖచిత్రాన్నే మార్చేసింది. ఈ చారిత్రక విజయంతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టిక ఒక్కసారిగా తలకిందులైంది. కంగారూ జట్టు అగ్రస్థానానికి గండిపడగా, బంగ్లాదేశ్ తన నాలుగో స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. మరోవైపు భారత జట్టు అవకాశాలపై ఈ ఫలితం పెను ప్రభావాన్ని చూపుతోంది. ఆడిన ఐదు మ్యాచ్‌లలో మూడో విజయం సాధించడంతో ఆ జట్టు పాయింట్ల శాతం 58.33 నుంచి ఏకంగా 66.67 శాతానికి ఎగబాకింది. మరోవైపు అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియాకు ఈ ఓటమి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఆ జట్టు పాయింట్ల శాతం 87.50 నుంచి 77.77 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా (75.00శాతం) ఆస్ట్రేలియాకు అత్యంత చేరువగా వచ్చింది. మూడో స్థానంలో న్యూజిలాండ్ 72.22 శాతంతో కొనసాగుతోంది. కాగా బంగ్లాదేశ్ విజయం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ అనూహ్య మార్పుల వల్ల ఐదో స్థానంలో ఉన్న భారత జట్టు (48.15 శాతం), ఆరో స్థానంలో ఉన్న శ్రీలంక (41.67 శాతం) తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. బంగ్లాదేశ్ దూకుడుతో ఫైనల్ రేసు మరింత ఉత్కంఠగా మారింది. ఈ సైకిల్‌లో భారత్‌కు ఇంకా తొమ్మిది టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా నేరుగా ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకోవాలంటే శ్రీలంకతో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా 2-0 తేడాతో క్లీన్ స్వీప్ చేయాల్సి ఉంటుంది. అయితే తొలి టెస్టులో ఊహించని పరాజయం ఎదురైనా ఫైనల్ తలుపులు పూర్తిగా మూసుకుపోవు. మిగిలిన టెస్టుల్లో కనీసం 7 మ్యాచ్‌లు గెలిస్తే పాయింట్ల శాతాన్ని 60 శాతానికి పైగా చేరి భారత్ ఫైనల్ రేసులో నిలబడగలదు. టీమిండియా ముందున్న తొమ్మిది టెస్టుల ప్రయాణం అంత తేలికైనదేమీ కాదు. శ్రీలంక పర్యటనలో రెండు టెస్టుల సిరీస్ తర్వాత స్వదేశంలో న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. ఆ తర్వాత అత్యంత కీలకమైన ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టెస్టుల బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ ఎదురుచూస్తోంది. ఈ కఠినమైన షెడ్యూల్‌లో మెజారిటీ మ్యాచ్‌లు గెలవడం భారత జట్టుకు పెద్ద సవాలుగా మారనుంది.




# ఆర్‌బీఐ కీలక నిర్ణయం

### ఎఫ్సీఎన్‌ఆర్‌బి స్వాప్ విండో ముందుగానే మూసివేత



**ముంబయి, ఆగస్టు 17:** విదేశీ కరెన్సీ నిధులు అంచనాలకు మించి భారీగా రావడంతో ప్రత్యేకఎఫ్‌సిఎన్ఆర్-బి స్వాప్ విండోను ముందుగానే మూసివేయాలని రిజర్వ్ బ్యాంకు నిర్ణయించింది. ఈనెల 13 నాటికి బ్యాంకులు ఈ డిపాజిట్ల ద్వారా 52.3 బిలియన్ డాలర్లు సమీకరించాయి. సెప్టెంబర్ 30 వరకు ఈ పథకం అందుబాటులో ఉంటే మొత్తం నిధుల సమీకరణ 100 బిలియన్ డాలర్లు దాటే అవకాశం ఉండేది. దీంతో గడువును కుదించిన ఈ విండో ముగిసే నాటికి మొత్తం ఎఫ్‌సిఎన్ఆర్ సమీకరణ సుమారు 70-80 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది.

ఈ స్వాప్ విండోను ముందుగానే మూసివేయడానికి ప్రధాన కారణాల్లో ఒకటి ఆర్‌బీఐపై పెరిగే హెడ్జింగ్ ఎక్స్‌పోజర్. ఎఫ్‌సిఎన్ఆర్ డిపాజిట్ల కాలపరిమితి సాధారణంగా 3-5 సంవత్సరాలు ఉంటుంది. దీంతో డిపాజిట్ల పరిమాణం పెరిగే కొద్దీ, రానున్న అనేక సంవత్సరాల్లో ఆర్‌బీఐ నిర్వహించాల్సిన విదేశీ కరెన్సీ ఎక్స్‌పోజర్ కూడా పెరుగుతుంది. అదే సమయంలో రాబోయే మూడు నుంచి ఐదేళ్లలో అంతర్జాతీయ వడ్డీ రేట్ల పరిస్థితిపై స్పష్టత లేదు. భవిష్యత్ గ్లోబల్ వడ్డీ రేట్లు, హెడ్జింగ్ వ్యయాలను ముందుగా అంచనా వేయడం కష్టంగా ఉన్న నేపథ్యంలో భారీగా అదనపు విదేశీ కరెన్సీ ప్రవాహాలను ప్రోత్సహించడం వల్ల ఆర్‌బీఐపై దీర్ఘకాలిక హెడ్జింగ్ భారం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఈ పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన రావడంతో పూర్తి గడువు వరకు విండోను కొనసాగించాల్సిన అవసరం తగ్గిందని ఆర్‌బీఐ భావిస్తోంది. భవిష్యత్తులో విదేశీ మారక ద్రవ్య లిక్విడిటీ పరిస్థితులు అదనపు డాలర్ల నిధులను కోరుకుంటే, ఆర్‌బీఐ ఇలాంటి స్వాప్ సదుపాయాన్ని తిరిగి ప్రవేశపెట్టవచ్చు.

మొత్తంగా చూస్తే, అంచనాలకు మించి వచ్చిన డాలర్ ప్రవాహాలను నియంత్రించడం, దీర్ఘకాలిక హెడ్జింగ్ ఎక్స్‌పోజర్‌ను సమతుల్యం చేయడమే ఎఫ్‌సిఎన్ఆర్ స్వాప్ విండోను ముందుగానే మూసివేయడం వెనుక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

## వాణిజ్యం

# వారంలో నష్టాల బోణీ

### నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, ఆగస్టు 17:** బెంచ్‌మార్క్ సూచీలు సోమవారం నష్టాలతో వారం ప్రారంభించాయి. ఇరాన్ వివాదం ముగింపునకు సంబంధించి ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం మార్కెట్ సెంటిమెంట్‌పై ఒత్తిడి తెచ్చింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 89 డాలర్ల వద్ద కొనసాగింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించగా, మెటల్ షేర్లు లాభపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 281.09 పాయింట్లు నష్టపోయి 77,728.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 78.35 పాయింట్లు క్షీణించి 24,287.65 వద్ద స్థిరపడింది. నిఫ్టీని ఎక్కువగా దెబ్బతీసిన షేర్లలో ఇన్ఫోసిస్ 2.51 శాతం, సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ 2.49 శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.14 శాతం చొప్పున పడిపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.18 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.06 శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్ వెడల్పు ప్రతికూలంగా ఉంది. బీఎస్ఈలో 2,087 షేర్లు లాభపడగా, 2,353 షేర్లు నష్టపోయాయి. మరో 240 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. బ్రెంట్ ముడిచమురు అక్టోబర్ ఫ్యూచర్స్ 93 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 89.45 డాలర్లకు చేరింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5 సెటిల్‌మెంట్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.46 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,55,190 వద్ద ముగిశాయి. విదేశీ మారక మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా క్షీణించి 95.6500 వద్ద కొనసాగింది. మోల్బియో డయాగ్నోస్టిక్స్:బీఎస్ఈలో తొలి ట్రేడింగ్ రోజును రూ.1,036.30 వద్ద ముగించింది. ఇది ఇష్యూ ధర రూ.807తో పోలిస్తే 28.41 శాతం ప్రీమియం. షేరు రూ.980 వద్ద లిస్ట్ అయి 21.44 శాతం ప్రీమియం నమోదు చేసింది. ట్రేడింగ్‌లో రూ.925.80 నుంచి రూ.1,064.85 మధ్య కదిలింది. హొరిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్ 4:48 గంటల సమయానికి 3,52,05,000 షేర్లకు బిడ్లు వచ్చాయి. మొత్తం 25,13,56,273 షేర్లు ఆఫర్‌లో ఉండగా, ఇష్యూ 0.14 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ.57-60గా ఉంది. కనీసం 250 షేర్లు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయాలి.లలితా జ్యువెలరీ మార్ట్ సోమవారం4:48 గంటల సమయానికి 4,32,49,448 షేర్లకు బిడ్లు వచ్చాయి. మొత్తం 6,27,61,403 షేర్లు ఆఫర్‌లో ఉండగా, ఇష్యూ 0.69 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. 17న ప్రారంభమైన ఐపీఓ 19న ముగుస్తుంది. ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ.190-201గా నిర్ణయించారు. కనీసం 74 షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.


## ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ చైర్‌పర్సన్‌గా శబ్నమ్ సిన్హా

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌లో నాయకత్వ మార్పు చోటుచేసుకోనుంది. మూడు దశాబ్దాలకు పైగా అభివృద్ధి ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక సేవలు, ప్రజా విధాన రంగాల్లో అనుభవం ఉన్న శబ్నమ్ సిన్హా.. ప్రస్తుత చైర్‌పర్సన్ సునీల్ భారతి మిత్తల్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతికి లోబడి 2026 అక్టోబర్ 1 నుంచి ఆమె చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. సునీల్ భారతి మిత్తల్ సెప్టెంబర్ 30, 2026తో నాన్




ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ పదవి నుంచి తప్పుకోవడంతో పాటు బ్యాంక్ బోర్డు నుంచి వైదొలగనున్నారు. దీంతో 2016 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఆయన పదవీకాలం ముగియనుంది. ప్రస్తుతం ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా ఉన్న శబ్నమ్ సిన్హా మూడేళ్ల పాటు చైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు. మిట్టల్ హయాంలో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ వినియోగదారులు, సంస్థల కోసం అందించే బ్యాంకింగ్ సేవలను విస్తరించడంతో పాటు ఆదాయం పరంగా దేశంలోనే అతిపెద్ద పేమెంట్స్ బ్యాంక్‌గా ఎదిగిందని కంపెనీ తెలిపింది.

# బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.1లక్షకోట్లు!




**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** దేశంలోని వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసి, మర్చిపోయిన, క్లెయిమ్ చేసుకోని సొమ్ము విలువ దాదాపు రూ.1 లక్ష కోట్లు ఉంటుందని ఆర్బీఐ తెలిపింది. పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ ఇటీవల వెల్లడించిన వివరాల ప్రకారం జనవరి 31, 2026 నాటికి దేశంలోని బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని సొమ్ము రూ.98,073. దీనికి సంబంధించిన వివరాల్ని గతంలోనే వెల్లడించింది. ఈ సొమ్మును గురించి తెలుసుకునేందుకు అవకాశాలు కూడా కల్పించింది. ఇందుకోసం ఆర్బీఐ ఉద్గామ్ అనే పోర్టల్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్ ద్వారా ఎవరైనా తమకు సంబంధించిన లేదా మర్చిపోయిన లేదా మరణించిన తమ వారి బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చు. సంబంధిత బ్యాంకుల్ని సంప్రదించి, తమ డబ్బు అందడానికి కావాల్సిన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ డబ్బు వారికి అందుతుంది. చాలా మంది తమ డబ్బును రహస్యంగా దాచుకోవడం కోసం తమవారికి తెలియకుండా బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటారు. అలాంటి వారు వాటి వివరాల్ని మర్చిపోవచ్చు. లేదా వారు మరణించి ఉండొచ్చు. దీంతో ఆ డబ్బు బ్యాంకులో అలాగే, నిలిచిపోతుంది. ఒక బ్యాంకులో రెండేళ్లకంటే ఎక్కువ కాలం డిపాజిట్లకు సంబంధించి ఎలాంటి లావాదేవీ జరగకుంటే ఆ ఖాతాను నిర్వహణలో లేని లేదా నిలిచిపోయిన ఖాతాగా గుర్తిస్తారు. ఆ తర్వాత పదేళ్లపాటు ఆ ఖాతాను ఎవరూ క్లెయిమ్ చేసుకోకుంటే ఆ నిధిని డీఈఏకు తరలిస్తారు. ఈ డబ్బు బదిలీ అయినంత మాత్రాన సంబంధిత వ్యక్తులు లేదా వారి కుటుంబ సభ్యులు, చట్టబద్ధమైన అర్హతదారులకు చెందకుండా పోదు.



## రికార్డు స్థాయికి సోయా ఆయిల్ దిగుమతులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం కారణంగా నల్ల సముద్రం నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్ సరఫరాలకు అంతరాయం ఏర్పడటంతో భారత్ ప్రత్యామ్నాయంగా సోయా నూనె దిగుమతులను భారీగా పెంచుతోంది. ఆగస్టులో దేశంలోకి సోయా నూనె దిగుమతులు రికార్డు స్థాయిలో 6.20 లక్షల టన్నులకు చేరుకోవచ్చని అంచనా. ఆగస్టు సోయా నూనె దిగుమతులు ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరంలోని నెలవారీ సగటు 4,24,549 టన్నుల కంటే దాదాపు 46 శాతం అధికం కానున్నాయి. ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరం నవంబర్‌లో ప్రారంభమైంది. భారత్ సన్‌ఫ్లవర్ ఆయిల్ అవసరాల్లో ఎక్కువ భాగం రష్యా, ఉక్రెయిన్ నుంచే వస్తుంది. రెండు దేశాల మధ్య యుద్ధం కారణంగా ఆగస్టు, సెప్టెంబర్‌లో రావాల్సిన సుమారు 1.50 లక్షల టన్నుల సన్‌ఫ్లవర్ ఆయిల్ సరుకులు ఆలస్యమయ్యాయి. దీంతో ఆగస్టులో సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులు జూలైతో పోలిస్తే 28 శాతం తగ్గి 1.80 లక్షల టన్నులకు పడిపోవచ్చని అంచనా. ఇది ఫిబ్రవరి తర్వాత అత్యల్ప స్థాయి. రష్యా, ఉక్రెయిన్‌లు పరస్పరం పోర్టులు, సముద్ర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుంటుండటంతో బ్లాక్ సీ మార్గంలో వంటనూనెల రవాణా కష్టతరంగా మారింది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని రిఫైనర్లపై దీని ప్రభావం ఎక్కువగా ఉంది. పండుగల సీజన్ సమీపిస్తుండటంతో దేశంలో వంటనూనెలకు డిమాండ్ కూడా పెరుగుతోంది. జూలైలో మొత్తం వంటనూనెల దిగుమతులు 10 నెలల గరిష్ఠానికి చేరుకుని 14.8 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. అదే సమయంలో సోయా నూనె దిగుమతులు 31 శాతం పెరిగి 4,98,881 టన్నులకు చేరాయి. సెప్టెంబర్‌లోనూ 6 లక్షల టన్నులు దాటే అవకాశంసోయా నూనెకు పెరిగిన డిమాండ్ ఆగస్టుతో ముగిసే అవకాశం కనిపించడం లేదు. సెప్టెంబర్-డిసెంబర్ డెలివరీ కోసం భారత్ ఇప్పటికే దాదాపు 14 లక్షల టన్నుల సోయా నూనెను బుక్ చేసుకున్నట్లు వ్యాపారులు తెలిపారు. సెప్టెంబర్‌లో కూడా నెలవారీ దిగుమతులు 6 లక్షల టన్నులు దాటవచ్చని ఓ డీలర్ అంచనా వేశారు. అర్జెంటీనా, బ్రెజిల్ లతోపాటు చైనా, ఈజిప్ట్, థాయ్‌లాండ్, టర్కీ నుంచి కూడా సరుకులను రిఫైనర్లు కొనుగోలు చేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14